యిచ్చెను. అహమ్మదు నగరరాజ్యము 1637 సం॥ ములో బీజపూరు వారును మొగలులును పంచుకొనిరి. బైహిరీవంశమంతటితో నంతమయ్యెను. అహమ్మదు నగరరాజ్యములో నాసిక ఖాన్ దేశములలోనికొంతభాగమును, బేరారులును, ఉత్తరకొంకణములో కొంతభాగమును గలిసి ఔరంగబాదను క్రొత్తసుభేగ నేర్పడి మొగలు రాజ్యమునఁ జేరెను. తక్కిన భాగము ముఖ్యముగా భీమానీరా నదులకు మధ్యదేశము బీజపూరు రాజుల పరమయ్యెను. మొగలు బీజపూరు సంధివలన షాజీయొక్క కుటుంబజాగీరగు పూనా సోపాజిల్లాలు బీజపూరువంతునకు వచ్చిన అహమ్మదునగరరాజ్యములో నుండెను. ఆ జాగీరు బీజపూరువలన షాజీకి యథాప్రకారముగ నియ్యఁబడెను.

ప్రకరణము 6.

శివాజీయొక్క బాల్యము.

బీజపూరునకు క్రొత్తగ వశమైన జిల్లాలను కొన్నియేర్పాటులఁ జేయుటయందు మురారి జగదేవునకు షాజీ మంచిసహాయకారి యయ్యెను. షాజీ యొక్క శక్తి సామర్థ్యములను గూర్చి మురారి జగదేవుఁడు, సుల్తానునకును ప్రశంసచేసి చెప్పి, యతనియెడల ననురాగబద్ధుఁడగునట్లు చేసెను.

షాజీ బీజపూరునందు కొన్నిదినము లుండగనే యతనిభార్య యగు జిజాబాయియు శివాజీయు నచ్చటి కరిగిరి. శివాజీ కప్పటికి పది సంవత్సరముల వయస్సుండెను. శివాజీ కొంచెము బుద్ధి తెలిసినపిమ్మట తండ్రిని జూచుట కిదియే ప్రథమ పర్యాయము. అయినను వెనుక చెప్పఁబడిన కారణములచేతనే జిజాబాయియు శివాజీయు బీజాపూరునందు విస్తారము కాలముండలేదు. జగపాలరావు నింబాల్కరు మనుమరాలగు సుహ్యీబాయి నిచ్చి శివాజీకివివాహమైనపిమ్మట జిజాబాయియు కుమారుఁడును, దాదోజీ కొండదేవుఁడను బ్రాహ్మణ కార్కూను * రక్షణక్రింద పూనాకువచ్చి నివసించి యుండిరి. ఇంతలో షాజీయు కర్ణాటక దండయాత్రయందు దక్షిణమునకుఁ బంపఁబడెను. షాజీ తనపెద్దకుమారుఁడగు శంభాజీతోడను చిన్నభార్యతోడను కర్ణాటకమునకుఁ బోయెను. రెండవ భార్యయగు తుకాబాయి మోహితీయందు షాజీకి వెంకాజీ యనుకుమారుఁడుదయించెను. వీరుగాక నొక దాసీస్త్రీయం దాతనికి శాంతాజీ యను నొక కుమారుఁడు కలిగెను.

ప్రముఖులగు మహారాష్ట్ర యుద్యోగస్థులందఱికిని సామాన్యముగ గుమాస్తాలుగను, వ్యవహారనిర్వాహకులుగను, కొందఱు బ్రాహ్మణులు సేవయం


---

* కార్కూను అనగా గుమాస్తా యని యర్థము.

దుండురు. షాజీ కిట్టివారు చాలమంది గలరు. అందు కొంద అతని కష్ట సుఖములను కనిపెట్టుకొని యుండి, యతని యదృష్టకాలములో నతని యొక్క జయమునకు తోడగు చుండెడివారు. కొందఱు మొగలులచే క్రొత్తగా నుద్యోగములనుండి తొలఁగింపఁబడినవారై యతని నాశ్రయింప వచ్చినవారుగలరు. ఇందు ముఖ్యులును అతనికి నమ్మకస్థులు నైనవారు, నారుపంతు హానుమంతీయు, దాదోజీ కొండదేవుఁడునై యున్నారు. ఇందు మొదటియతఁడు షాజీయొక్క కర్ణాటక జిల్లాల వ్యవహారమును జూచుటకును, రెండవ యతఁడు శివాజీకి రక్షకుఁడై పూనా జాగీరును జూచుటకును నియమింపఁబడిరి. కర్ణాటకమునందు షాజీ చేసిన గొప్పకార్యములకొఱకై పూనా దగ్గిరనుండు కొండకోనలు మావలు లనఁబడునవి యనేకము షాజీ జాగీరునకు కలుపఁబడెను.

శివాజీయొక్క యుద్యమము.

కల్నల్ విల్కస్స, తన మైసూరు చరిత్రలో, 1646 సంవత్సరపు యొక్క హిందూ వ్రాతప్రతిలో నొక భావి దర్శకుడు 'సాధువుల పరిత్రాణమును ధర్మముయొక్క వినాశనమును' వర్ణించి చిట్టచివరకు 'విమోచనకాలము సమీపించు ననియు, కన్యాంగనామణులెల్ల నానందంబున గానంబు సేయుదురనియు దేవతలెల్ల పుష్పవర్షంబు గురిపింతు' రనియు వ్రాసియున్నదని ప్రశంసించిరి. ఈ సిద్ధవాక్యము, శివాజీయొక్క కీర్తి సౌరభము పూనా జాగీరునకు వెలుపల విస్తరింపక పూర్వమే, వ్రాయఁబడియున్నది. కాని కల్నలు విల్కస్స ఈ విమోచన కారకుఁడగు మహానుభావుఁడు శివాజీయే యని శతాబ్దము చాల వఱకు గడుపక పూర్వమే యెల్లరిచే సామాన్యముగ నంగీకరింపఁబడినదని చెప్పుచున్నాడు. ఒక పక్షమున శివాజీ, గలీము అనగా బందిపోటుదొంగ యని మహమ్మదీయ చరిత్రకారు లతని దూషింపుచుండ, దేశీయ బఖరులు రెండవ పక్షమున పురాణాదర్శప్రకారము, భూమి ధేనురూపంబున పరమేశ్వరునిఁ బ్రార్థింప నతఁడు తద్రక్షణకొఱకవతరించెనని వ్రాయుచున్నది. ఈ ప్రియతమంబగు నమానుష విశ్వాసంబుననే దేశీయ చరిత్రకారులు శివాజీయొక్క



రామదాసస్వామి శివాజీకి ఉపదేశించుట. 60

Natio[illegible]
Calcutta-27.

వంశవృక్షంబును ఉదయపురవంశ మూలంబునకుఁ జూపింప యత్నించిరి. శివాజీ బందిపోటుదొంగయు కాడు, అవతారంబునుఁ గాడు. రాజవంశ జననంబు వలననే యతని బలసాహసంబు లుద్భవింపలేదు. అతఁడు షాజీ జిజాబాయిలకు కుమారుడగుటవలననే యుత్తమోత్తముఁ డయ్యెను. అతని తల్లి లుకజీ జాధవరావు పుత్రిక యగుటవలనను, యాతనిభార్య జగపాలరావు నింబాల్కరు మనుమరాలగుట వలనను, అతఁ డుత్తమ సంబంధములు గలిగియుండెను. అట్టి తల్లిదండ్రులకు పుత్రుఁడగుట వలననే, కట్టుకథలును పురాణగాథలు నొసంగఁగలిగిన దానికంటె యెక్కువ విలువగల యధికారము యౌవనశివాజీ సంపాదించిన వాఁడాయెను. తన కాలముయొక్కయు తాను సంబంధించిన జాతియొక్కయు నుదాత్త మనోరథంబుల నతఁడు మనంబునందు సంపూర్ణముగ గ్రహించుటయందే యతని బలాధిక్యత కలదు. అట్టి పురుషులు, దేశక్షేత్రంబు సంసిద్ధంబుఁ గాకుండ, తగిన ఋతుకాలంబు ప్రాప్తించకుండ, ననగా సామాన్య జనమనంబు, తమ సుగుణంబు లను గ్రహించి సహాయముజేయుటకు తగినంత ప్రబోధంబు గాకుండ, యవతరించువారుగారు.

మనుజులను, వారియొక్క యవస్థయెట్టులున్నను, ధైర్యమవలంబింపగల శక్తి నిచ్చునది లౌకిక వివేకజ్ఞానము కానేరదు. అట్టి లౌకిక వివేకము, శివాజీ తండ్రివలన నతని రక్షణకును శిక్షణకును నియమింపఁబడిన దాదోజీ కొండదేవునందు, మూర్తీభవించి యుండెను. అతఁడు పూర్వరాజకీయ మతావలంబకుఁడు. యౌవనుడగు కుమారునియొక్క హృదయము భవిష్యత్ప్రకాశమానం బగు నాశలతో నుప్పొంగుచుండెను. ఇంకను లౌకికవివేకము, అస్తమయభానుని నుండి యుదయభానుని దిక్కునకు తమ ముఖంబుల ద్రిప్పుకొనుచు, రాష్ట్ర రాష్ట్రములకును తమసేవను కాలానుసారంబుగ మార్చుకొనుచు వచ్చిన మాతామహుండగు లుకజీజాధవునందును, తండ్రియగు షాజీయందును సంపూర్ణముగ నుండెను. శివాజీ చిన్నతనము నుండియు రామాయణ మహాభారత కథా విశేషంబులను వినుటయందు విశేషాసక్తిగలవాడని, యతనిఁ గూర్చి

చెప్పెడు కథలన్నియు నైకకంఠ్యంబుగ వాకొనుచున్నవి. పూర్వవీరులవారి కథాకాలక్షేపంబు వినుట కతఁడెన్ని క్రోసుల దూరమునైన లక్ష్యముసేయక పోవుచుండెడివాఁడు. అతఁడు పేరుఁబొందిన తరువాత ననేక సంవత్సరముల కొక్కసారి యట్లు వారి కథ కేగుట యందలి యాసక్తివలన నతఁడు శత్రువుల చేతులలోఁ జిక్కుప్రమాదము కొంచెములో తటస్థించెడి దయ్యెను. శివాజీ యొక్క మనం బతిశయమైన ధర్మోత్సాహప్రవణంబున పోతపోయఁబడెను. అతని వివిధలక్షణలక్షిత జీవితంబునందు నతఁడు ముఖ్యముగ నీశ్వరభక్తిపరాయణుఁడై చూపట్టును. లౌకికవివేక నిధులగు తన గురువును, తన తండ్రియు నెఱుఁగని మనోధైర్యమాతనికి ధర్మాసక్తిమూలముననే కలిగెను. అట్లు కేవలము ధర్మాసక్తియే పురికొల్పఁగల స్వార్థవిచారణారాహిత్య మతడు తన మనంబునందు పొందఁగల వాడయ్యెను. అయితే ఈయుత్సాహము యొక్క పూర్ణశక్తి నతఁడు చిన్న తనమునం దంతగా గ్రహింపలేదు. అల్లరులును, దుండగీని పనులును అతని చిన్నతనపుచేష్టలయందు పెక్కులుండవచ్చును; కాని, జీవితపుస్తకంబునం దొక్కొక పత్రంబుఁ ద్రిప్పికొనినకొలదిని నతఁడు తన యీశ్వరోద్దిష్ట కార్యము నెక్కున స్పష్టముగ గ్రహించుచుండెను. ముమ్మారు ముఖ్యసమయములయందతఁడు సంసారవ్యవహారంబుల నెల్ల త్యజించి సన్యాసియై యాముష్మికవిషయంబులఁ బ్రొద్దు పుచ్చుటకు సంసిద్ధుఁడుగాగ నతని గురువులును మంత్రులును వర్ణాశ్రమ ధర్మంబులను గూర్చి సరియైన యభిప్రాయములను బోధించి, బలవంతమున నా దృష్టినుండి యతని మరలించిరి. అతనిచరిత్ర పొడుగునను, గొప్పయాపదలు తటస్థించి, యొక్క తప్పటడుగు వేసిన యెడల నాశలెల్ల వికలములగు ప్రమాదకాలములలో, నతడు ధ్యానంబున మునిఁగి, తన యావేశమున నీశ్వరవాక్యమును గ్రహించుటకు ప్రయత్నించెడివాడు. తా నా యావేశమున నేమి బల్కునో దానిని మంత్రులను వ్రాయవలసినదని సెలవొసంగెడువాడు. అట్టి యీశ్వర వాక్యము, ఔరంగజేబుతో సంధిచేసుకొనుమనినను, ఢిల్లీకి బోయి శత్రువులచేతఁ జిక్కుమనినను, అఫ్జల్ ఖానుతో నొంట

రిగ ననుమానభయాస్పదంబగు మారణద్వంద్వయుద్ధంబున నెదుర్కొను మని
నను, పూర్ణభావముతో నా యీశ్వర నియోగము ననుసరించి ప్రవర్తించెడువాఁ
డు. ఇట్టి యాత్మ సమర్పణమును, ఆత్మనిగ్రహమును, తెలియచేయు కథలు
కేవల లౌకిక లాభనష్టవిచారణలును, రాజతంత్రాంగమును, నతని కార్యనిర్వాహ
కంబులను ప్రేరేపింపలేదను విషయమును, మఱింత స్పష్టపఱచును. ఈ యుత్సా
హము మానవస్వభావమునం దుత్తమ భాగంబునుండి యురుదెంచును.

శివాజీయొక్క యీ సద్గుణమును విదేశ మహారాష్ట్ర చరిత్ర కారకు
లెవ్వరును లెస్సగ గ్రహించలేరు. అతని యొక్క పౌరుషము కంటెను, అతని
సాహసము కంటెను, ఈమనోలక్షణమే యతని నాయుగముయొక్క ప్రతినిధిఁ
జేసెను. ఈదేశములో సామాన్యజనులను కార్యశూరులుగఁ జేయునది, వారి దైవ
భక్తికి సంబంధించిన ప్రబోధయే. గడచిన మూడుశతాబ్దముల నుండియు హిం
దూదేశమంతయు, బలాత్కార యుతంబగు మహమ్మదీయమత సంఘట్టనవలన,
మిక్కిలి చలనంబు నొందినది. రెండు మతములకును పరస్పరాఘాతంబులు
విస్పష్టంబుగ జరిగెను. రామానుజులు, రామానందు మొదలైన నూతనమతోద్ధా
రకులు, సర్వవర్ణంబులవారికిని ముక్తియవసరంబనియు, పరమేశ్వరుని సింహాసన
సముఖమున ఉత్తమాధమ జన్మలను భేదము లేదనియు బోధించిరి. ఉత్తరము
నను తూర్పునను రామానందు, కబీరు, రామదాసు, రోహిదాసు, సూరదాసు,
నానకు, చైతన్యా మొదలైనవారిబోధనలందు పైయంశము ముఖ్యలక్షణమైయుండె
ను. మహమ్మదీయమతముయొక్క యేకేశ్వరోపాసన యొక్క నిశ్చలకాఠిన్యమీ
మహాపురుషుల మనంబుల ముద్రితంబయ్యెను. హిందూత్రిమూర్తులయవతారంబగు
దత్తాత్రేయునియారాధకు లద్దేవుని మహమ్మదీయఫకీరు వేషంబున నలంకరించు
చుండెడివారు. ఈయభిప్రాయమే మహారాష్ట్ర సామాన్య ప్రజాహృదయంబునఁ
బ్రవేశించి, యచ్చటి మతబోధకులగు బ్రాహ్మణులును బ్రాహ్మణేతరులునుఁగూడ
రాముడన్నను రహీమన్న నొక్కటే యనియు, కర్మబంధనంబులనుండియు, వర్ణ
భేదంబునుండియు తప్పించుకొని, దైవభక్తియు మానవప్రీతియు సంపాదించిన నే
ముక్తిగలుగుననియు, బోధించునట్లు చేసెను. తుకారాము, రామదాసు, ఏక

వాధుడు, జయరామస్వామి మొదలైన రాజకీయ బోధకులతోపాటు సరి సమానముగ నీయుద్యమమునకు మతోద్ధారకులుఁగూడ నుత్తమవర్ణంబులందేగాక బహునీచ వర్ణంబులయందును ప్రభవించి తమ ధర్మమును నిర్వహించుచుండిరి. విఠోబా మతము, పంధరపుర మాహాత్మ్యములు, భూలోకస్వర్గము ప్రతిసంవత్సరమును వేలకొలఁది జనుల నాకర్షించుచుండెడివి. ప్రతి గ్రామమందును, పట్టణమందును హరికథలు మీఱి వేలకొలది జనులనాకర్షించుచుండెడివి. ఈ యుపన్యాసములయొక్క ఫలమే రాజా జయసింగు ఔరంగజేబునకు 1678 సం॥ న అక్బరుచే తొలగింపఁబడిన జజియా యను హిందువులపై వేయఁబడిన తలపన్ను మరల వేయఁబడినపుడిచ్చినయుపదేశమునందు ప్రతిఫలించుచున్నది. ఆయన తన యజమానునకు “ఈశ్వరుఁ డొక్క మహమ్మదీయులకే యీశ్వరుఁడుగాఁడు. మానవకోటికెల్ల నీశ్వరుఁడు. ముస్లిములును ముస్లిమేతరులు నాయన సమ్ముఖము నెదుట నొక్కటే. హిందువుల మతాచారముల శూన్యంబు చేయుట యీశ్వరధిక్కారము” అని జ్ఞాపకము చేసెను. ఇది దేశము నందుదయించిన నవీనభావము, అయిన నిది ప్రజాభిప్రాయమును తెలియఁజేసెను. మహమ్మదీయులు నీయుత్తమ యుపదేశముయొక్క బలమును గ్రహించిరి. అక్బరు కాలముననున్న అబుల్ ఫాజల్ యను ఫాయిజీయును రామాయణ మహాభారతములను పర్షియన్ భాషలోనికి భాషాంతరీకరణము చేసిరి. అక్బరు మహాసక్తితో హిందూ మహమ్మదీయ మతములను సామరస్యము చేసి మతభేదంబుల మాపుట కొక క్రొత్తసిద్ధాంతమును స్థాపింపఁదలంచెను. షాజహాను, పెద్దకుమారుఁడగు దారాషేకో ఉపనిషత్తులను భగవద్గీతలను భాషాంతరీకరించి, ఉత్తమవిద్యాధికులగు మహమ్మదీయులయొక్క మనోరథంబులట్టివే యని తెలియఁజేసెను. అందుకే ముఖ్యముగ మూర్ఖమహమ్మదీయుఁడగు నౌరంగజేబాతని పరలోకంబువరకు వెంటనంటివేటాడెను. ఉత్తరమున కబీరువంటి మహాపురుషులును మహారాష్ట్రంబున షేకు మహమ్మదు వంటి మహాపురుషులు నీ యుత్తమ ధర్మములను హిందూమహమ్మదీయులకు సమానంబుగ బోధించిరి. వీరి మరణానంతర మిద్దఱును రెండు మతములవారిచేతను పూజింపఁబడినను, వారి

జీవితకాలంబున రెండు మతములయందలి మూర్ఖులచేతను గౌరవముగఁ జూడఁబడలేదు.

దేశకాలపాత్రంబుల స్థితి యిట్లుండెను. మతోద్ధారణయు సంస్కరణోత్సాహమును దేశమునందుఁ బనిసేయుచుండెను. పూర్వ మూర్ఖ మతంబు నొందవలసిన యవసరంబు గలిగె నని జనుల మనంబులకు గోచరంబు కాఁజొచ్చెను. మోటుబలంబునకు పూర్వమువలె లోబడక బోవుట ముఖ్యముగా మత విశ్వాసములందు ముందుఁ గానఁబడెను. మహమ్మదీయ దుస్సహనము మరల దేశమునందు వ్యాపింపఁగూడదను నిశ్చయమున నది వ్యక్తమయ్యెను. ఈ యావేశమును, తూల్జాపూరునందును కోల్హాపురమునందును భవానీ దేవాలయములందలి యారాధకులు పొందినట్లు, మరి యెవ్వరును పొందలేదు. వారీ తేజస్సును గ్రహించి తమ గోందిలీలు భట్లు మొదలైన గాయకుల మూలమున నెల్లరకును విస్తరింపఁ జేసిరి.

తుకారాము రామదాసు మొదలైన వారలతోడను, మఱి యితర మతోద్ధారకులగు గురువులతోడను, సరిసమానముగఁ దిరిగిన శివాజీ తనయందా మనోరథంబుల నన్నిటి నతిశయంబుగ గలిగి యుండెను. అతనియొక్క బలమునకును జనాకర్షణశక్తికిని ఇది యొక ముఖ్య యుపాధియై యుండెను. లాభనష్టములయొక్క వివేక విచారణవలన నెప్పుడును గలుగని బలముగా నది పరిణమించెను.

తనతండ్రికిని గురువునకును మనంబునకు తట్టని యింకొక భావము శివాజీయొక్క మనంబుపై చలనంబు నేయఁజొచ్చెను. విదేశ ముసల్మాను విజయులచే ఝుళిపింపఁబడు దండయాత్ర సైకమత్యముతో నెదిర్కొన వచ్చునని యతఁడు తలంచెను. శివాజీయొక్క రాజకీయ మహాపురుషుఁడగు * రామదాసు, శివాజీయొక్క యుద్దేశమును రాజనీతియు నతని యుపదేశ పద్యములలో మహా

* 'మహాపురుష' డను పదము ఉర్దూలో పైగంబరు అను నర్థములో మహారాష్ట్రభాషలో నుపయోగింపఁబడును.

రాష్ట్రీల నందరిని నొక్కటిగఁజేసి మహారాష్ట్రంబుయొక్క ధర్మంబు నెరప వలయు నని చెప్పెను. శివాజీయొక్క దృష్టిపథంబున నున్న రాజనీతి యిదియే. దీని వలననే యతడు చేసిన కొన్ని యక్రమ కార్యములు సమర్థింపఁబడును. దేశమునందున, జాగీరుదారు లందఱును తమ పొరుగువాని జాగీరు పోయినను తాను మాత్ర మందువలన లాభము పొందవలెనను తలంపుతో నొకరితో నొకరు పోరాడుచున్నయెడల, వెనుక మూడువందల సంవత్సరముల క్రింద ఆఫ్గనులవలెనే, మొగలులును జయంబునొందుదురని యతడు తలంచెను. కాలానుగుణంబుగ, సామాన్య యుద్యమమునకు పరస్పర సహాయమును, పరస్పర విశ్వాసము నవసరమయ్యెను. ఈ యుద్యమమున కడ్డను వచ్చినవాఁడు హిందువైనను, మహమ్మదీయుఁడైనను, శత్రుఁడైనను, మిత్రుఁడైనను, బంధువుఁడైనను బంధువుడు కాకపోయినను, తొలఁగింపబడవలసిన వాడయ్యెను.

ఇండియాచరిత్రలో నన్ని ప్రకరణములందును, అన్ని కాలములందును, అంతఃకలహముల నీరస మెప్పుడు నుపద్రవకారియై యుండెను. అంగవైకల్యగుణమును, పరస్పరవియోగభావమును శిక్షాధిక్కారము నని యనేకవిధముల నది వర్ణింపఁబడియున్నది. అట్టి యంగవైకల్యము నొందిన శక్తి, యంగసర్వాణమును, నైపుణ్యమును గలశక్తి నెదుర్కొని రణరంగమునఁగాని సభారంగమునఁ గాని నిలువఁజాలదనుట కేమి యాశ్చర్యముగలదు? కొద్ది యేర్పాటులందును, పెద్దకార్యములందును, శివాజీ జనులయొక్క లాభములును ఉత్తమాభీష్టంబులును జెనంగొనునట్లు చేసి, సామాన్యజయమునందు గర్వమును, సామాన్య యపజయమునం దవమానమును భావించునటులఁ జేయఁ బ్రయత్నించెడువాడు. ఘాడ్గీలును, మోరేలును, ఘోరేపురేలును, నీ వియోగభావమునకు ప్రతినిధులై మెలఁగుచుండిరి. కావున, ప్రధాన మహారాష్ట్రవంశంబులవారు శివాజీయొక్క యుత్తమ విశ్వాసంబునకు పాత్రు లగుటకు పూర్వము, వారు బలంబుచేతనో మంత్రంబుచేతనో తొలఁగింపఁ బడవలసిన వారైరి. ఈ యుద్దేశముతోడనే మహమ్మదీయరాజ్యము లొకదానిపై నొకదానిని ప్రయోగింప వలసివచ్చెను. శివాజీ యొకానొకపు డధికబలంబునకు లోబడవలసిన

వాఁడైనను, యతని వ్యవహారము నందంతయు నీ విదేశీయులమీద కైకమత్యము ప్రధానలక్ష్యముగ నతని మనంబున నుండెను. కొన్ని సమయములందు శివాజీ విఫలమనోరథుండైన మాట నిజము. చిట్టచివర కతని ప్రయత్నములు విఫలము లైనమాట సత్యమేకాని యాతనియపజయము ధీరులకగు నపజయము. అతఁడు కట్టిన నిర్మాణ,మంతకంటె పొడవైన యోశానిర్మాణంబులను గూలఁద్రోసిన,నిర్ఘాతంబులికోర్చి నిలువఁబడిన తరువాతనే భగ్నంబైనది.

శతాబ్దములనుండి శిక్షాభ్యాసంబున సిద్ధపరుపఁబడిన దేశక్షేత్రంబునందు ప్రాణబీజం బెట్లు శివాజీవలన చల్లఁబడెనో వర్ణించుటకు పూర్వ మింకొక ముఖ్యలక్షణంబు కనిపెట్టవలసియున్నది బందిపోటు దొంగలుగాని, మూర్ఖమతావలంబకులుగాని గలిగి యుండఁజాలని సత్యమైన ప్రజానాయకులయొక్క యాకర్షణశక్తి శివాజీకిఁ గలదు. దేశములో నాశాదాయకమును, ఉదాత్తమనోభీష్టప్రేరకము నగు నెల్లవానిని, జాతిమత వర్ణభేదంబులు లేక, తనయెడ కాతఁడాకర్షించెను. దేశముయొక్క బలాధారంబు లగువంశంబులనుండి యతని మంత్రు లెన్నుకొనఁబడిరి. మనుజులయం దత్యంత నీచులు నతని స్పర్శగలిగినంత మాత్రంబున తమ మనంబులయందు నా పవిత్రవహ్నిని స్వీకరించుచుండెడివారు. మావలీలను హేతాకారీలును కేవలము తమకు లభించు ద్రోపిడిధనంబునకై యతని వెంట నంటి నడువలేదు. వారు దూరదేశములందు తమ యజమానునికి సహాయము చేయఁజాలనపుడు, శివాజీ, భూమిమీదను సముద్రముమీదను తన కార్యమును నిర్వహించుటకు,మహమ్మదీయుల నియమింప కూరకుండలేదు. మావలీలు తానాజీమాలుశూరే, అతని తమ్ముఁడు సూర్యాజీ, బాజీ ఫసల్కార్, నేతాజీ పాల్కార్, పరభూలు బాజీదేశపాండే,బాలాజీ ఆవుజీ, బ్రాహ్మణులు మోరోపంతు,అబాజీ సోనదేవు,రఘునాధ నారాయణ,అన్నాజీ దత్తో, జనార్దనపంతు హనుమంతే, మహారాష్ట్రులు ప్రతాపరావుగుజర్, హంబీరరావు మోహితే, శాంతాజీ ఘోరే పురే, ధనాజీ జాధవు, పర్సాజీ భాంస్లేయొక్క పూర్వికులు, ఉదయాజీపవరు, ఖండేరావు దాభడే మొదలైన వారందఱు నతనిసైన్యమునందు సేవఁజేసి యతనివిశ్వాసము నెప్పుడును భంగము

సేయలేదు. ఇది ధీరులయొక్క వాక్కు. ఈ పురుషులు, శివాజీ ఢిల్లీయందు ఖైదీయై యుండ తమతమ స్థానంబుల విడువక నిలిచి యతఁడు తప్పించుకొని దేశమునకు వచ్చినపుడు కష్టంబులేకుండ యథాప్రకారంబు రాజ్యంబుచేయుటకు సహాయులైరి. అటుపిమ్మట, అతని మరణానంతరము, శంభాజీ యక్రమ ప్రవర్తనుఁడై చంపఁబడినపుడును, సాహూ రాయఘడ నుండి ఖైదీగాఁ గొనిపోఁబడినపుడును, ఈ పురుషులును, వీరి సంతతివారును మొగలు సేనాముఖము నోర్చి, దక్షిణమునకు తఱుమఁబడినను, ద్విగుణ బలంబుతో మరల ముందుకు వచ్చి, ఔరంగజేబును మనోవిహ్వలునిగఁ జేసి, యతని 'పేరాసలన్నిటిని సంపూర్ణముగ భగ్నంబుఁ జేసిరి.

చిట్టచివరకు, శివాజీయొక్క యాత్మశిక్షణయు, నతని యధికార నిగ్రహమును, యుద్ధ సాహసముతో పరిపాటిగ నుండెను. అతని స్వభావముయొక్క యీ లక్షణ మాకాలముయొక్క దారుణ నీతిబాహ్య సంకరంబునుండి యెంతయు స్పష్టంబుగ వ్యతిరేకమై యుండెను. యుద్ధబలిమి వలనను, ధనావసరము వలనను, తన సైన్యము లెట్టి యకృత్యంబులు చేసినకాలమున నైనను, గో స్త్రీ కర్షకజనంబుల కెన్నడును బాధగలుగకుండ నతడు కాపాడెడివాఁడు. శత్రువులకు గ్రాహ్యముకాని తెఱంగున ముఖ్యముగ స్త్రీజనంబు లత్యంత గౌరవంబునఁ జూడఁబడుచుండెడి వారు. యుద్ధంబున పట్టుపడిన స్త్రీలు బహుమానంబులతోడ తమభర్తలదగ్గిరకు పంపఁబడుచుండెడివారు. ఇందుకు తార్కాణంబుగ నొక్క చిన్నకథ యిచ్చట చెప్పఁబడుట యుచితము. కళ్యాణకోటపట్టుకొనినపు డాబాజీ సోనదేవు డాకోట కధికారియగు మూల నహమ్మదుయొక్క కోడలగు నొక సుందర స్త్రీరత్నంబునుఁ జెఱఁబట్టి శివాజీ కర్పింపఁ దీసుకొనివచ్చెను. శివాజీ యామెనుఁ జూచి 'మాతల్లికి నీ సౌందర్యమున్న యెడల నేనెంత యదృష్టవంతుడనై యుండెడివాడను! నేనుకూడ నెంత సౌందర్య వంతుడ నయ్యెడివాడను!' అనిచెప్పి యామెను తనకన్న కుమార్తెవలెఁ జూచి యనేక యాభరణంబుల నిచ్చి బీజపూరున కామెయింటికి సురక్షితముగఁ బంపివేసెను. జయింపఁబడిన దేశమునందు తనక్రింది సరదారు



శివాజీ.—'మాతల్లికి నీసౌందర్యమున్న యెడల నేనెంత యదృష్టవంతుడనై యుండెడివాడను! నేనుకూడ నెంతసౌందర్యవంతుడ నయ్యెడివాడను ! **68**

లకు జాగీరుల నిచ్చుటయందలి యపాయ మతఁడు గ్రహించి యట్టి యుపదేశ
ముల నెల్ల పెడచెవినిఁ బెట్టెను. అతని వారసు లీజాగ్రత్తను గమనింపక, యత
డంతటి వివేకముతో ప్రతిష్ఠాపించిన సామ్రాజ్యము జీర్ణం బగుటకు మఱింత
తోడయిరి.

ఆత్మరాహిత్యంబులోనికిఁ జొరఁబడి నిష్కళంక తేజంబు నొందిన ధర్మ
సంస్థాపనాసక్తియును, తాను తనయుద్యమమును అమానుషంబగు నొక్క
మహాశక్తిచే సదా రక్షింపఁబడుచున్నవను విశ్వాసంబున జనించిన ధైర్యసాహ
సములును, జనులనెల్ల నొక్కటిగ బంధించి విజయంబునకుఁ దోడ్కొనిపోవు
మహానుభావునియొక్క యాకర్షణ శక్తియును, కాలంబులయొక్క యవన
రంబులలోనికిఁ జని చూచు నపురూపంబగు దివ్యదృష్టియును, ఏ దురదృష్టంబు
లును జయింపఁజాలని నిశ్చల మనోనిశ్చయమును, ఇండియను యూరోపియను
చరిత్రలందు సామాన్యంబుగ గోచరంబుకాని సర్వసంసిద్ధత్వమును, విపుల
మంత్రోపాయ జ్ఞానంబును, కాలంబున కతీతంబైన యథార్థ దేశాభిమానం
బును, దయార్ద్రంబైన ధర్మరక్షణా పరాయణత్వంబును,ఇవియే, తన వార
సులకాలములో, తాను పన్నిన యుద్యమమును సంపూర్ణము చేయునట్టి యధి
కారమునకు బీజంబులు చల్లుటకు శివాజీకి యుపాధులై వెలసెను. ఈ సుగుణ
ములే,యతనిజాతివారిని ఇండియాచరిత్రయందొక ప్రకరణమును కించిత్ప్రయో
జనంబునకు, వ్రాయ సామర్థ్యము నిచ్చెను. ఇట్లు మహారాష్ట్రరాజ్యంబు
యొక్క మూలపురుషుని వర్తనను ప్రారంభ విమర్శ నొనర్చుటవలన తత్సూ
త్రమును గ్రహించినపిమ్మట, నతని జీవితచరిత్రంబుయొక్క పద్మ వ్యూహంబు
లోనికిఁ జొచ్చి, యందలి వివరంబులను పరిశీలించుట మన కెక్కువ సులభం
బగును.

దాదోజీ కొండదేవుడు పూనాయందు విశాలభవనం బొకటి నిర్మింపఁ
జేసి షాజీయొక్క కుటుంబము నందుఁ గాపుర ముండఁజేసెను. ఆకాలమునందు
మహారాష్ట్రకుమారుల కవసరమైనవిద్యలయందు శివాజీని దాదోజీ కొండదేవుఁ
డు తయారుచేసెను. వ్రాయను చదువను నెంపరైనపనులు బ్రాహ్మణకార్యా

మలపిల్లలు నేర్చుకొనవలసినవి గాని రాజకుమారులు నేర్చుకొనఁదగినవి కావని యాకాలమునఁ దలంపఁబడుచుండెను. శివాజీ, వ్రాయను చదువను బొత్తుగ నెఱుఁగని వాఁడనుట యసంభవము గాని యతఁడు విస్తార మట్టివానియందు పరిచయముగలవాఁడు కాఁడని చెప్పవచ్చును. కాని వ్యవహారముయొక్కయు నితర మతసాంఘిక విషయములయొక్కయు సంగతుల యర్థము చక్కఁగ గ్రహింపను, విచారింపను, సమర్థతతో తెలియఁజెప్పను, మొదలైన వాని యం దతఁడు సుశిక్షితుఁడై యుండెననుటకు సందేహములేదు. అందుకు నిదర్శనముగ నతఁడు తన మునిషీ చే చెప్పించి వ్రాయించిన యుత్తరములలో ప్రసిద్ధిఁజెందిన వానిని రెండిటి నిందు బొందు పరచు టెంతయు యుక్తమని తలంచెదను.

శివాజీయొక్క లేఖలు.

(పరిషియను నుండి ఇంగ్లీషునకును, అందునుండి తెనుఁగునకును భాషాంతరీకరింపఁబడినవి.)

(1657 సం॥ మే నెలలో శివాజీ మొట్టమొదట మొగలు దేశములోనికి, జున్నారుపట్టణమును కొల్లకొట్టుటవలన, నక్రమముగఁ బ్రవేశించెను. షాజహాను యొక్క సింహాసనము కొఱకై పోరాడుటకు, ఔరంగజేబు తత్క్షణము డిల్లీకి పోవలసినవాఁడై యప్పుడు శివాజీని శిక్షింపఁ బ్రయత్నింపలేదు. 1661 వ సం॥ మున షయిస్తఖానుడు శివాజీపైఁ బంపఁబడెను. ఏప్రిలు 1663 సం॥ మున అర్ధరాత్రివేళ శివాజీ షయిస్తఖాను నకాంత్తుగ ముట్టడించెను. షయిస్తఖానుడు కుమారుని పోగొట్టుకొని, చావు తప్పించుకొని, పాఱిపోయెను. అతఁడు దక్కను నుండి బెంగాలునకు ఉద్యోగమును మార్చుకొనెను. శివాజీ విచ్చలవిడిగ సంచరించుచు సూరతు మొదలుగాగల పట్టణములు కొల్లఁగొట్టుచుండెను. ఈ క్రింది యుత్తరము సుమారు ఆకాలములో 1664 వ సం॥ మాఘరున వ్రాయఁబడినట్లు కనుబడుచున్నది.)

మహారాజా శివాజీయొద్దనుండి ఆలంగీరు చక్రవర్తియొక్క యుద్యోగస్థులకును మంత్రిపుంగవులకును, నీలప్రభు మునిషీవలన వ్రాయబడిన యుత్తరమ్ము.

గడచిన మూడుసంవత్సరముల నుండియు, చక్రవర్తియొక్క మంత్రిశిఖామణులును, సేనానిశ్రేష్ఠులు నీదేశంబునకు వచ్చుచుండిరని, బుద్ధిమంతులును, దూరదృష్టిగలవారియొక్క మనంబులకు గూఢంబుగ నుండకుండుగాక! నాదేశంబును నాదుర్గంబులను పట్టుకొనుటకు చక్రవర్తి యిచ్చిన యాజ్ఞకు వారు 'క్షణంబులో జయింతు' మని ప్రత్యుత్తరమిత్తురు. దురూహ్యాదారుఢ్యంబుగల హయంబు సహిత మీపరువదేశంబుపై పరువెత్తలేదనియు జయంబు దుస్సాధ్యంబనియు వారెఱుంగరు. అట్లు మోక్షదాయకంబగు సత్యంబు నో వాడి యసత్యవాదంబులయొక్క యవమాన ఫలంబును వారెఱుంగకుంట యెంతయు చోద్యం బగుచున్నది. మఱి గతంబేమి? కోటగోడల కడ్డంబులు గట్టుకొనుటకుగాని, దొమ్మియుద్ధంబు సేయుటకుగాని, మీకు వీలగుటకు కళ్యాణ బీడరు కోటలవలె, నాగృహము విశాల సమప్రదేశంబున నుండలేదు. పర్వతపంక్తులు 200 లీగుల పొడుగును, 40 లీగుల వెడల్పును గలిగి నాభూమి నావరించియున్నవి. ఎచ్చటఁ బట్టిన నక్కడ దాటగరాని నల్లాలు (చిట్టడవులు) గలవు. కడు దృఢమైన దుర్గము లఱువది గట్టఁబడినవి. అందు కొన్ని సముద్రతీరంబునఁ గలవు. అందువలననే, అఫ్జుల్ ఖాను, ఏదులశాహీ యొక్క యుద్యోగస్థుడు, గొప్పసైన్యముతో జౌలీ గ్రామమునకు వచ్చి యసహాయుఁడై నాశము నొందెను. అట్టి దుర్గతియే మీకును బట్టకుండుటకు నిచ్చట సంభవించిన దెల్ల యథార్థముగ చక్రవర్తికేల మీరు విన్నవించుకొనరు?

పైఁజెప్పిన ఖానుయొక్క మరణానంతరము చుంబితాంబరములగు నీపర్వతంబులను, పాతాళంబులగు నీలోయలను జయింప అమీరులు ఉమ్రావులు నియమింపఁబడి మూఁడుసంవత్సరములు పాటుబడి, నే నత్యల్పకాలంబులో నోడింపఁబడి, నాదేశము జయింపఁబడనున్నదని చక్రవర్తికి వ్రాసియుండిరి. కాని

చిట్టచివరకు, అసత్యవాదులందరి కర్ణాంబైనటులనే, యతఁడు దినకర తేజంబు కంటె తెల్లంబైన ఘోరాపజయంబునొంది యవమానంబున నింటికి కరిగెను.

క. హాయ మరిగెడు నె ప్లుతమున న
నయమువిషమశైలభూమి ? నడువగ నరుడున్
భయపడి డాలును విసరగ
నయమగు తలములు గలవిట నాదేశమునన్
నాదేశమును రక్షించుట నాధర్మము.

వారియొక్క గౌరవమునుఁ గాపాడుకొనుటకు, వారు సత్యమునకు వ్యతిరేకముగ చక్రవర్తికి వ్రాసుకొనియున్నను, ఈశ్వరాశీర్వచనమువలన నీ మూలమున్న పురుషుని ప్రియదేశంబుపై వచ్చిన నేదండయాత్రికుని యాశాముకుళంబు నింతవరకు వికసించియుండలేదు.

ఆ-వె. "రక్తనదికిపైన ♦ రహిమీద నెన్నండు
పడవ నెవడు గడపె ♦ భద్రముగను?
బుద్ధిమంతు డెపుడు ♦ పొరపాటుఁ బడరాదు
దానిదాటు మదినిఁ ♦ దలఁపరాదు.

మతసహనము.

శివాజీయొద్దనుండి ఔరంగజేబునకు

(నీలప్రభు మునిషీవలన వ్రాయఁబడినది.)

దినకరమండలంబుకంటె విస్పష్టంబైన యీశ్వరకృపా విశేషంబులకును, చక్రవర్తి కరుణాకటాక్షంబులకును, వందనమ్ము లిడినపిమ్మట, సంతతనిశ్చలశ్రేయాభిలాషి యగు శివాజీ తమసార్వభౌమంబున కిట్లువిన్నవింపఁ బ్రార్థించుచున్నాడు. తమగంభీరసముఖమునకుండి వాఁడు సెలవుఁ గైకొనకుండ నే

శ్రేయోభిలాషి, దురదృష్టవశంబునఁ దిరిగివచ్చినప్పటికిని, యర్థ్యముసు సాధ్యమునైనంతవఱకు, సేవాకృతజ్ఞతలు నిర్బంధించునంతయుఁ జేయ నితఁడు సంసిద్ధుఁడైయున్నాఁడు.

రాజ్యముయొక్క మేలుకొఱకేఁ జేసినయుత్తమసేవయు, సాభక్తియు, రాజకుమారులకును, ఖానులకును, అమీరులకును, రాజులకును, రాయలకును, పరిషియా, మధ్యయేషియా, టర్కీ, సిరియా మొదలైన నానా దేశాధీశుల కును, సప్తఖండ నివాసులకును భూసముద్రంబులపైని యాత్రికులకును సుప్రసిద్ధంబుగా తెలియును. బహుశః వానిప్రకాశము తమ విశాలసార్వభౌమ హృదయంబునఁగూడఁ బ్రవేశించి యుండవచ్చును. కావున, మేలియుపకారము నుఁజేయు నుద్దేశముతోడను, తమ సార్వభౌమదయసంపాదించుకొనుటకును, ప్రజాసౌఖ్యముకెడల భక్తియుత చేతస్కుఁడనై యీక్రిందివాక్యంబులనువిన్న వించుకొనఁ బ్రార్థించుచున్నాను:—

నాతోడయుద్ధమువలన తమధనమువ్యయమై,తమధనాగారములుశూన్య మైన వను కారణమున, జజియా పేరిటహిందువులయొద్దనుండి పన్నువసూలుచేసి సామ్రాజ్య యవసరములు దీర్పఁబడవలయునని తమసార్వభౌము లాజ్ఞ యొసఁగి రని యీమధ్య కొంతకాలముక్రింద నావినులఁబడినది. మీ సార్వభౌమంబున కానందంబగుగాక!—సామ్రాజ్యభవన నిర్మాణకర్తయగు, అక్బరు చక్రవర్తి, సంపూర్ణాధికారంబులతో 52 ఏండ్లు రాజ్యముచేసెను. క్రిస్టియనులు, యూదులు, మాసైతులు, దాదుశాఖవారు, ఆధ్యాత్మికులు, మూర్ఖవతావలంబులు,సాంఖ్యులు, నాస్తికులు,బ్రాహ్మణులు,జైనులు మొదలైనవివిధములైన తెగలవారియెడలను, సంపూర్ణశాంతము (సుల్హికుల్) యొక్క. నిష్పక్షపాత రాజనీతిని ఆయ నవ లంబించెను. ఆయన విశాలహృదయముయొక్క మనోరథం,బందఱనుపోషించి రక్షించుటే. కావున నాయన జగద్గురునామంబున ప్రసిద్ధికెక్కెను. అటు తరువాత చక్రవర్తి నూరుద్దీనుజహాంగీరు, తన దయాచ్ఛాయను, 22 సంవత్స రములవఱకు, ప్రపంచముయొక్కయు ప్రజలయొక్కయు శిరంబుల వ్యాపింపఁ జేసి, తనమిత్రులపై హృదయంబునుంచి, కార్యంబునకుఁ గడంగి, యభివృద్ధి

గాంచెను. అటుపిమ్మట చక్రవర్తి షాజహాను, 32 సం॥లు ప్రపంచముపై తన ధవళాతపత్రచ్ఛాయను విస్తరింపఁజేసి తనసౌఖ్యకాలంబునకు ఫలంబుగ శాశ్వతజీవంబు, అనగా నిష్కళంకయశంబును సంపాదించెను.

తే. గీ. మంచిపేరుఁ బొంది మనెడు మనుజునకును
శాశ్వతంబగు భాగ్యంబు సంభవించు
చచ్చు వెనుకనతనిఁ బట్టుఁ జావకుండ
సత్కృతిస్మరణ ప్రశస్తి చక్కఁగాదె !

ఈమహాత్ముని యాశీర్వచనమువలన, నతని గంభీరమనోరథంబుయొక్క కటాక్షంబు ప్రసరించిన ప్రతిదిక్కునుండియు, విజయలక్ష్మియెదురుగ స్వాగతం బిచ్చుటకు వచ్చుచుండెను. అతని పరిపాలనకాలంబున ననేకరాజ్యంబులు, కోటలు జయింపఁబడినవి. ఈచక్రవర్తులయొక్క యధికార గౌరవైశ్వర్యములను, చక్రవర్తి ఆలంగీరు (ఔరంగజేబు) వారి పద్ధతుల ననుసరింపఁజాలకఁ బోవుటను బట్టియే, యూహించుకొనవచ్చును. జజియాపన్ను వేయుటకు, వారికిని శక్తిగలదు కాని, ఈశ్వరునిచే సృష్టింపఁబడిన జనులందఱును, ఉత్తములైనను అధములైనను, వివిధమతతత్వములయొక్క యుదాహరణలుగా వారు దలంచిరి గావున, నట్టి మూర్ఖవిశ్వాసంబును తమమనంబుల చొర నియ్యలేదు. వారి దయాదాక్షిణ్యములు కాలపత్రంబున స్మరణీయంబులై నిశ్చలంబుగ నిలచియున్నవి. కావుననే, యీపావనహృదయులస్తోత్రంబు, నిరంతరంబు నుత్తములును నధములు నను భేదంబులేక నెల్లర హృదయ జిహ్వాసీమలయందు నివసించియుండును. భాగ్యంబు సదుద్దేశముయొక్క ఫలము. కాఁబట్టి ఆ యీశ్వరునియొక్క ప్రాణికోటి శాంతిభద్రంబులయొక్క డోలికయందుండి, వారి కార్యములు నిరుపద్రవంబుగ జరిగినందువలన, వారి సిరిసంపద లభివృద్ధి నొందియుండెను.

కాని తమసార్వభౌమ పరిపాలనకాలంబున, ఆకోటలును ప్రాంతములు ననేకములు తమవశమునుండి తప్పిపోయినవి. తక్కినవియు తప్పిపోవును. ఏం

నవ, వానినాశంబునొందించి ద్రోచుకొనుటకు నాపక్షమున నేమియుఁ
గొఱంతయుండదు. కర్షకు లణఁగఁ ద్రొక్కఁబడిరి. ప్రతిమహాలు(తాలూకా)
యొక్కపంటయు సన్నగిలెను. లక్షవచ్చుచోట వేయియు, వేయివచ్చు
చోట పదియు (రూపాయిలు) వసూలగుచున్నవి. అదియు కష్టముగనున్నది.
దారిద్ర్యమును, భైక్ష్యమును, చక్రవర్తియొక్కయు రాజకుమారులయొక్కయు
మందిరంబులఁ గాపురంబుండ నీక నమీరులయొక్కయు మన్సబుదారుల
యొక్కయు నవస్థ నూహించుకొనవచ్చును. ఈ పరిపాలనమందు సైన్యము లల్ల
కల్లోలమున నున్నవి. వర్తకు లసంతుష్టి నొందియుండిరి. మహమ్మదీయు లేడ్చు
చుండిరి. హిందువులు నలియఁగొట్టఁబడుచుండిరి. అనేకజనులు రెండవపూట
నాహారములేక ప్రతిదినంబును దుఃఖంబున చెంపలు మండఁగొట్టుకొనుచున్నారు.
ఈదురవస్థకు జజియాభారంబునుగూడ వేయు తమ రాజౌదార్య మెట్లొప్పినది?
ఇండియాచక్రవర్తి భిక్షుకులపాత్రంబున కోర్వలేక, జజియాపన్నును, బ్రాహ్మ
ణులు, జైనసన్యాసులు, యోగులు, బైరాగులు, దరిద్రులు, అభాగ్యులు, క్షుధా
ర్తులు మొదలైన వారియొద్దనుండి వసూలు చేయుచున్నాడనియు, అతని
ప్రతాపము భిక్షుకులపైఁ జూపఁబడుచున్నదనియు, తైమూరీయుల నామ గౌర
వంబులను మంటఁగలుపుచున్నాడనియు, పూర్వమునుండి పశ్చిమమువఱకు
ప్రకటింపఁబడును; చరిత్రయందు గ్రంథస్థంబగును.

మంచిది, ఓహో సార్వభౌమా! నిజమైన దివిజగ్రంథమును, ఈశ్వర
వాక్యమును (కొరాను) తమరు నమ్మియుంటిరేని యచ్చట రబ్బు-ఉలా-లమీన్
(జనులందఱిదైవము) అని యున్నదిగాని రబ్బు-ఉల్-ముసల్మీన్ (మహమ్మదీ
యులదైవము మాత్రమే) యని యుండలేదు. నిశ్చయముగా ఇస్లామును హిందూ
మతమును వ్యతిరేక పదములైనను (లఫ్జి-ముఖాబిల్) విశ్వకర్మ తనరంగుల నను
రూపంబుగ గలుపుటకుపయోగించెను. మసీదున్నచోట నాయన జ్ఞాపకార్థ
మే యాహ్వానరవంబు సేయఁబడుచున్నది. దేవళమున్నచోట నాయన ప్రేమ
కొఱకే గంట వాయింపఁబడుచున్నది. ఒక్క మతము నవలంబించి యద్దాని

కొలకు మూర్ఖంబుఁజూపించుట, పావనగ్రంథంబులోని వాక్యంబును మార్చుట యైయున్నది. చిత్రమునందు గీతలుగీయుట చిత్రకారు నాక్షేపించుటగాదె?

ధర్మప్రకారము జజియా యేమియును సమ్మతముఁగాదు. రాజనీతి ప్రకారంబు, సౌందర్యవతియగు స్త్రీ సువర్ణభూషణంబులతో నొకదేశము నుండి మఱియొకదేశమునకు నిర్భయంబుగ నిరపాయంబుగఁ బోఁగలిగినచో, నది ధర్మంబుగావచ్చును. కాని యీ దినంబుల పట్టణంబులే కొల్ల పెట్టఁబడు చున్నవి. ఇక గ్రామంబుల మాటయేమి? ధర్మము మా టటులుండ, ఈపన్ను యొక్క విధానము ఇండియాయం దపూర్వము ననర్హము నై యున్నది.

జనులఁ బీడించి, హిందువులను భయభ్రాంతులనుఁ జేయుటయందే పుణ్యమున్న దని తమరు దలంచినయెడల, హిందువులలోనెల్ల ముఖ్యుఁడగు రాజా రాజసింగు (ఉదయపురము) నొద్ద నాపన్ను వసూలుచేయవలయును. అప్పుడు నేను మీ సేవకు సంసిద్ధుడనై యున్నందున, నాయొద్దనుండి యాపన్నును వసూలుచేయుట కంత కష్టముండదు. కాని చీమలదోమలను సంహరించు టంత ప్రతాపంబుగాదు.

యథార్థస్థితిని చెప్పుట కశ్రద్ధఁజేసి, యగ్నిజ్వాల నూకతోఁ గప్పిపుచ్చు తమ యుద్యోగస్థుల రాజభక్తిఁజూడ విస్మయమగుచున్నది. మీసార్వభౌమ సూర్యుఁడు గొప్పతనంబుయొక్క నారాచంబుపై ప్రకాశించుచుండుఁగాక!

(జజియా కొరానులో నొక వాక్యప్రకారము, మహమ్మదు, ఐస్లామేతరులను (జిమ్మీ) కలుపుకొనుటకు అజ్ఞయిచ్చిన దానినిఁబట్టి యొకతలపన్ను విధింపఁబడెను. అక్బరు చక్రవర్తి దానిని తీసివేసెను. మరల నొక శతాబ్దము పిమ్మట ఔరంగజేబు తన రాజధానియందును, తత్ప్రాంతములందును 2-వ యేప్రిల్ 1679 సం॥మునుండి వసూలుచేయుటకు విధించెను.)

(ఈ యుత్తరమును, లండను వ్రాతప్రతి శివాజీ కారోపించుచున్నది. కలకత్తా వ్రాతప్రతి శంభాజీ కారోపించుచున్నది. టాడ్, మహారాణా రాజసింగని చెప్పుచున్నాడు. ఉత్తరము వ్రాసినవాడు, పన్ను కొద్దికాలముక్రింద

వేయఁబడినట్లును, యుద్ధము చవినది తత్పూర్వము చాలకాలముక్రిందనైనట్లును చెప్పుచున్నాడుగాన, శంభాజీగా నేరదు. చవర భాగములో, హిందువులలో ముఖ్యుఁడగు రాజసింగు అని చెప్పఁబడుచోట, జయసింగు కొడుకు రామసింగని కలకత్తా ప్రతిలోనున్నది. ఆయన జయపూరురాజు. హిందువులలో ముఖ్యుఁడునుగాడు. అతఁడు రాజసేవ చేయుచున్నందువలన జజియా పన్నున కెదురు చెప్పినవాడునుగాడు. కావున నది రాజసింగేయై యుండవలెను. ఉదయపురము రాజగు రాజసింగుతో ఔరంగజేబు సంధిచేసికొని యతని రాజ్యములో జజియా పన్నును వేయలేదు. కావున నా యంశమునుగూర్చి పరిహాసము చేయుచు వ్రాయఁబడియుండెను. ఈ కారణమువలన రాజసింగు ఆ యుత్తరమును వ్రాసి యుండడు. శివాజీయే వ్రాసియుండవలెను. 1679 సంవత్సరాంతమున నిది వ్రాయఁబడి యుండవచ్చును.)

శివాజీ యస్త్రవిద్యయందును, బల్లెము నుపయోగించుటయందును, దక్కనునం దుపయోగింపఁబడు నన్నివిధములైన కత్తులను ద్రిప్పుటయందు నారితేరియుండెను. అతని దేశీయ లక్ష్యాయూధమునందు ప్రసిద్ధినొందినవారు శివాజీయందు సంపూర్ణ ప్రావీణ్యము నొందెను.

శివాజీయొక్క తోడికార్యనిర్వాహకులు.

శివాజీ 16 సంవత్సరముల వయస్సునుండియు స్వాతంత్ర్యమునుఁగూర్చి ప్రశంసించుచుండెడివాఁడు. అతని తల్లియగు జిజాబాయి యుగ్గుపాలతోఁగూడ మతభక్తియు, స్వాతంత్ర్యప్రీతియు నతనికి పోసియుండెననుమాటకు సంశయములేదు. అతఁడే గొప్పకార్యమును చేయఁబోవునపుడును, పెద్దవాడైన పిమ్మటఁగూడ, తల్లియొక్క యాశీర్వచనమునుగొని గాని పోయెడివాఁడు కాఁడు. స్వతంత్రబీజమును తల్లియే చిన్నతనమునం దతని మనోక్షేత్రమునందు నాటినది. తల్లియే దానిని పెంచినది. తల్లియే యతని కట్టెదుట నిలచిన భవానీ దేవతగా శివాజీకి కనుపడుచుండెడిది.

ఆ పిల్లవాఁడు తల్లియెడల నపార ప్రేమ కలిగియుండెను. తండ్రి నితఁడు బాగుగ నెఱుఁగఁడు. తల్లియే యెప్పుడు నితనికి ప్రత్యక్షమైయుండెను. రామాయణ మహాభారతములలోని శౌర్యసాహసక్రియా కథలతో నితని యాత్మ నామె యుత్సాహంగఁ జేయుచుండెడిది. ఆ పర్వతమధ్యంబుననుండి యట్టి తల్లిచేఁ బెంచఁబడిన శివాజీకి బాల్యమునుండియు సాహసకార్యములం దాసక్తిగలుగుటయం దాశ్చర్యములేదు. షాజీ మరణానంతరము జిజాబాయి సహగమనము చేయఁ బ్రయత్నించినపుడు శివాజీయొక్క ప్రార్థనచే యామె నట్టి కృత్యంబునుండి యుడిగించెను. శివాజీ ఢిల్లీ కరిగినప్పుడు రాజ్యము ను తల్లి యాధీనములో నుంచి పోయెను. అతని యుద్యమమునందలి దృఢ విశ్వాసమును, ఈశ్వరభక్తియు నీతనికి తల్లివలననే కలిగెను. వీరపురుషు లెవ్వరైన తల్లి ప్రోత్సాహమువలన నట్టి వారైనయెడ మనము శివాజీయొక్క కథనే దానికి తార్కాణముగ ముందు చెప్పవలసియున్నాము.

జిజాబాయి తరువాత, శివాజీని గొప్పవానినిగ చేయుటకు కారణమైన వాఁడు, దాదోజీ కొండదేవుఁడని చెప్పవలసియున్నది. దాదోజీ పునాజిల్లాలో మాల్థానునందు పుట్టి, పలుయుద్ధములయందు సేవచేసియుండెను. షాజీ, దగ్గర నున్నయెడల, కుమారునియం దెట్టి ప్రేమవాత్సల్యములను చూపింపఁగలఁడో, యంతయును చిన్నతనమునందు శివాజీయెడల దాదోజీ నిశ్శంకముగఁజూపి, యతఁడు తన విధాయక యుద్యమమును నిర్వహింప సమర్థునిఁ జేసెను. ఇతఁడు సహజముగ నతి జాగ్రత స్వభావముకలవాఁడు. కావున, శివాజీ విశృంఖలంబుగ కొండమార్గములందు తిరుగుట కొక్కొకప్పుడిష్టపడెడువాడు కాఁడు. కానియతని ప్రేమమాత్ర మించుకయును నంత మాత్రముచే సంకుచితంబు కాకయుండెను. చిట్టచివరకు, శివాజీ, ప్రాకృతమానవ లక్షణంబులనుఁబట్టి పరిగణింపఁదగిన వాఁడు కాఁడని యతని మనంబున నిశ్చయించి, యా యౌవనుఁడు చింతించుచున్న కార్యనిర్వహణమందు విఫలుం డగుటకూడ కీర్తికరంబని యతఁడు తలఁచెను. శివాజీయొక్క విశృంఖలవృత్తి యట్టి వృద్ధశిక్షకునిచే మార్గమునందు పెట్టఁబడుట యవసరమే యయ్యెను. అతఁడా బాలునకు సామదానభేద

దండవ్యూహ సమన్వితంబగు యుద్ధరీతియు, పరిపాలనా లక్షణంబులను నేర్పె
ను. అంతేఁగాక నశిక్షితంబులగు శక్తుల నెట్లు అంగ నిర్మాణసహితంబులుగఁ
జేయవలెనో అతఁడు శివాజీకి నేర్పెను. రాజ్యపరిపాలనా శాస్త్రంబునందు
దాదోజీ మంచి సమర్థుఁడు. అతఁడు జాగీరును స్వాధీనములోనికిఁ దీసికొను
నప్పటికి, క్షామములచేతను, బీజపూరు మొగలురాజుల గడియుద్ధములచేతను
మిక్కిలి నాశనమైయుండెను. పూనా యిప్పుడు జనక్షీణమైపోయెను.
తోడేళ్ల మందలచేతను, అంతకంటె భయంకరులగు దొంగదండులచేతను,
వ్యవసాయ మసాధ్యమయ్యెను. కొన్ని సంవత్సరములలో దాదోజీ, బహుమ
తుల నిచ్చుటవలన తోడేళ్లను నాశనముచేయించి, దొంగలను దిట్టముగ శిక్షిం
చుటవలన, నణచివేసెను; కృషీవలులకు స్వల్పశిస్తులకు చాల సంవత్సరములకు
కవులులనిచ్చి క్రమక్రమముగ దేశమును మంచి స్థితికిఁ దీసికొనివచ్చెను. పది
సంవత్సరములు గడువక పూర్వమే భూమియొక్క యభివృద్ధిస్థితిని తన యజ
మానునకు కనుబఱిచి, యా శిస్తువలన కొందఱు భటులను నియమించి, కొండ
కోటలను బాగుచేసి, కావలి సైన్యమునుంచుటకు సమర్థునిగాఁజేసెను. పూనా,
సోపా, ఇందపూరు, బారామతి, మావలులు, శాంతసుఖంబుల ననుభవించు
చుండెను. ఫలభరితవృక్షంబులు దేశమునం దానందంబున మందస్మిత రుచిరశోభి
తంబులై యుండి, యిప్పటికిని ఆ బ్రాహ్మణమహామంత్రియొక్క బుద్ధికుశలతకు
సాక్షిభూతంబులై శివపూరునందు వెలసియున్నవి. అతనియొక్క యాజ్ఞ
నిగ్రహ మెట్టులుండె నన నొక్కనాఁడు తన యజమానుని రసాలసాలంబునుండి
యొక్క పరిపక్వఫలంబును సెలవులేకుండ తనకు కోసికొన నిచ్ఛపుట్టినందుకు
తాను తనదగ్గిర యనుచరులను తన దక్షిణహస్తమును ఖండింపవలసినదని యాజ్ఞ
యిచ్చెను. కాని యతని యనుచరుల ప్రార్థనవలన నట్టిశిక్ష యాపివేయఁబడెను.
కాని యితఁడు తానుచేసినదోషమునకు చిహ్నముగ తనచొక్కాను కుడిచేయి
లేకుండ తొడిగికొనుచుండెను. అటుతరువాత న్యాయలవాటు షాజీచే
మన్నింపఁబడెను. దాదోజీయొక్క యుద్దేశము, శివాజీని, తండ్రివలెను, తాత
వలెను, మహమ్మదీయులలో నొకశక్తివారిక్రింద గొప్పసర్దారుగఁ జేయవలె

వనియే యై యుండెను. కాని ఈ సర్దారులనందఱి నొక్కటిగఁజేసి మహమ్మదీయ పారతంత్ర్యమును పడఁద్రోయవలెనను శివాజీయొక్క యూహ నతఁడు అవసానకాలము దనుక నందుకొనలేకపోయెను. కావున తనచే శిక్షితుఁడైన యాబాలుఁడు వానియొక్క మహాస్వప్నమును సాధింప సమర్థుండేయని తన మనస్సునందు అతఁడు తృప్తిపొందినతోడనే తనమరణకాలమం దతని నాశీర్వదించి పరలోకమున కేగెను. శివాజీయొక్క రివిన్యూపద్ధతియు, సివిలు పరిపాలనయు,గురువగు దాదోజీపద్ధతుల ననుసరించి చేయఁబడెను. కావున శివాజీయొక్క విశృంఖల మనోవృత్తి నట్లు చిక్కఁబట్టి తిన్ననిమార్గమునందు పెట్టిన నట్టిగురుశిక్షయేలేకుండిన, శివాజీకి సంభవించిన జయలాభం బంతనిశ్చయమును శాశ్వతమును కాకయుండెడి దనుటకు సందేహములేదు. శివాజీ తోరణకోటను పట్టుకొని తనరాజకీయ జీవనమును ప్రారంభించిన స్వల్పకాలముననే దాదోజీ స్వర్గస్థుఁడయ్యెను.

దాదోజీ కొండదేవునితరువాత శివాజీ యుద్యమమునకు తోడైనవారు దాదోజీచే తయారుచేయఁబడిన కొందఱుబ్రాహ్మణకార్యకనులు. ఆబాజీసోనదేవు, రఘునాథబలాలు, శ్యామాజీపంతు, మోరోపంతు తండ్రిపెద్దపింగళే, నారూపంతు హనుమంతే మొదలైనవారందఱును దాదోజీచేతిక్రింద యుద్ధరాజనీతిశాస్త్రంబులందు తయారైనవారు. వీరందఱును తమ యౌవనుఁడగు యజమానునిసాహసోత్సాహంబుల నామోదించుచువచ్చిరి.తరువాత మోరోపంతుపింగళే, అన్నాజీదత్తో,నిరాజీపండితు, రావుజీసోమనాథ్, రఘునాథపంతు మొదలైన యౌవనులు అతని యుద్యమకార్యములందు తోడ్పడిరి. ఈ నవీనోద్యమము యొక్క ప్రధానాంగమగు శిరోభాగము వీరైయుండిరి. ఇఁక నీయుద్యమము జయంబు నొందుటకు కావలసిన వజ్రహృదయంబులును, వజ్రబాహువులును, మావలీవీరులయందు సిద్ధమైయుండెను. ఇట్లు మహారాష్ట్రులు, పరభూలు, బ్రాహ్మణులుమొదలైన వారిలోని నాయకులు శివాజీకి ఆరంభదశయందు బలసత్వదాయకులై యుపయోగపడిరి. శత్రువులై రణరంగమున నోడిపోయినవారు సహితము తరువాత మిగులనమ్మకస్థులగు ననుచరు లగునటు లాకర్షించు ముఖ

విలాసము శివాజీకి యుండెడిది. రాబోవుచరిత్రయందు మనము ఈసంగతులనెల్ల విమర్శగ చూడంగలము. ఇక బీజపూరు అహమ్మదునగరరాజ్యముల సేవలోనుండు గొప్పమహారాష్ట్ర కుటుంబములవా రందఱును, ఈ యుద్యమమునకు సహాయము చేయుటకు మారుగా దీనికి బలవద్విరోధులైరి.

దాదోజీకొండదేవుఁడు, తన రక్షణలోనున్న శివాజీ సర్వ్యాపారంబువలన చెడిపోవుచున్నాడని, తనమరణకాలమునకు కొంతపూర్వమున. జాగీరు వ్యవహారముల భారమ్మును కొంతవఱకతనిమీద పెట్టెను.

శివాజీయొక్క యౌవనము.

శివాజీయు వ్యవహారములను చేయనారంభించినపుడు, మహారాష్ట్ర ముఖ్యులు కొందరప్పుడప్పుడు దర్శనము చేయవచ్చుచుండెడివారు. ఇతనివాగ్వైఖరియు, ప్రియభాషణంబులనుఁ జూచి యనేకమంది యిష్టులగుచుండిరి కాని యప్పటికే కొంకణములో జరిగిన గొప్ప బందిపోటులలో భాగస్వామియని రహస్యముగ నితనిఁగూర్చి చెప్పుకొనుచుండెడివారు.

శివాజీ మావళీలయందెప్పుడును సదభిప్రాయము గలవాఁడు. పైకి మోటుగను తెలివితక్కువవారుగనుపడినను, వారలవాటుపడిన కార్యములయందు చురుకుగను, సూక్ష్మబుద్ధిగలవారుగనుండి, తమకొప్పగింతపెట్టఁబడిన కార్యములయందు విశ్వాసముతోడను శ్రద్ధతోడను పనిచేయుచుండెడివారు. శివాజీ చిన్నతనమునందు చేసిన సంచారములందు వీరు వెంటనుండెడువారు. కొంకణములోను, 'ఘాట్మాతాయొక్క లోయలలోను, తక్కిన యన్ని భాగములలోను తిరుగుటవలన నతఁడన్ని మార్గములును రహస్యప్రదేశములును గుట్టమెట్టలును యడవులును బాగుగ నెఱిఁగినవాడై యుండెను

శివాజీయొక్క జాగీరు ఆకాలమందుండిన స్థితి.

మహమ్మదీయ రాజ్యములలో, కొండదుర్గములు సామాన్యముగ నశ్రద్ధఁ జూడఁబడుచుండెను. మంచికోటలు కొన్ని రాజుచే నియమింపఁబడిన ఖిల్లేదారుల క్రిందనుండెను. తక్కిన వన్నియు, సౌభాసాదారుల క్రిందఁగాని, అను

ల్దారుల క్రిందగాని, జాగీరుదారులు దేశముఖులు మొదలైన వారి క్రిందగాని యుండెను. మహమ్మదీయుల క్రింద నుండకపోవుటకు కారణము, అవి మన్య ప్రదేశములై యలవాటు లేనివారి కనారోగ్యకరములై యుండుటయై యున్నది. సామాన్యముగ నంతకు పూర్వము, వానియొక్క యుపయోగము బాగుగఁ దెలియక పోవుటవలన, సులభముగ మరల లోఁబఱుచుకొనఁబడ వీలుగనుండుటను బట్టి యట్లశ్రద్ధగ వదలి వేయఁబడినవి.మన చరిత్రయొక్క కాలమునాఁడు, బీజపూరు, మొగలులతో సంధిఁ జేసికొనియుండుట వలనను, కర్ణాటకమును జయింప దృష్టియందు కలిగియుండుటవలనను, సైన్యములో చాలభాగము దక్షిణమునకు పంపి యున్నది. షాజీయొక్క జాగీరులో దాదోజీ కొండదేవుని యాధీనము క్రింద నొక కోటయు నుంచఁబడలేదు. పూనాకు నైరుతి మూలను 12 మైళ్ల దూరములలో, కొండనే (సింహగడ్) దుర్గము ఒక మహమ్మదీయ ఖిల్లేదారుని యాధీన మందుండెను. దీని కాగ్నేయమూల నిఁక నంతియ దూరములో, పురంధరు దుర్గము నీలకంఠరావు అను బ్రాహ్మణుని యాధీనములో నుండెను. ఇతఁడు పూర్వము నిజాముశాహియందుండి, షాజీతో కూడ బీజపూరులోనికివచ్చి మురారిపంతుచే నాస్థానమందు నిలుపఁబడెను. ఈ యిద్దఱు ఖిల్లేదారులతోడను శివాజీ స్నేహముగ నుండెను. అందు ముఖ్యముగ నీలకంఠరావుతో నితఁడు సహవాసముగ నుండెను.

మావళీలలో శివాజీ ముఖ్యముగ ముగ్గురితో తఱచుగ సహవాసము గల్గియుండెడివాఁడు. వారు, 'యశాజికంకు,తానాజీమాలుశూరే, బాజీఫసల్కారు, అయియున్నారు. ఇందు మూఁడవవాఁడు మూసేఖోరా యొక్క దేశముఖుఁడు. తక్కిన యిద్దఱును వారివారి కొండలలో కొన్ని వారసపుహక్కులు గలవారే. వీరి సహాయమువలన, సింహగడకు నైరుతి మూలను సుమారెనిమిది మైళ్ల దూరముననున్న తొరణకోటయొక్క ఖిల్లేదారునితో యుత్తర ప్రత్యుత్తరములు నలిపి, కృత్రిమ యుద్ధముచేసి, శివాజీ వశము చేసికొనెను. శివాజీకికోటలేక పోయెనని యదివఱ కనేక దినములనుండి యున్న విచారము మొట్టమొదట

తొలఁగెను. అప్పుడితనికి 19 సంవత్సరములు వయస్సు. అతని యొక్క రాజకీయ జీవన మప్పటినుండి యారంభించినదని చెప్పవచ్చును. ఈ రాజకీయ జీవనము ను నాలుగు భాగములుగా విభజింప వచ్చును. 1646 మొదలు 1652 వరకు పూనా చుట్టు ప్రక్కలనుండు కోటలను దేశమును బట్టుకొని యుపాయంబుగ నచ్చటి జాగీరుదారులను లోబఱచుకొనుట. అటుపిమ్మట 1662 వరకు బీజపూరుతో యుద్ధము. తరువాత 1672 వఱకు మొగలులతో యుద్ధము. పిమ్మట పట్టాభిషేకమును, దక్షిణదిగ్విజయ యాత్రయు జరుపఁబడినవి. 1680 సం॥ మున శివాజీ 53 వ యేట కీర్తిశేషుండయ్యెను. ఈ నాలుగు భాగములను వేఱు వేఱుగ విరళముగ విచారింతము.

ప్రకరణము 7.

శివాజీ యొక్క రాజకీయ జీవితములో మొదటి భాగము.

(1646—1652)

తోరణకోటను పట్టుకొనుటతో మొదటిభాగ మారంభ మైనది. ఈ కోటలో త్రవ్వుచుండగ, భవానిదేవియనుగ్రహము వలన దొరకిన ధనములో, రాజఘడఅను కోట బాగుచేయఁబడి నతని నివాసముగ నేర్పఱుచు కొనఁబడెను. ఈ చర్యలయందు విపరీత మేమియుఁ గానఁ బడలేదు కావున బీజపూరు దర్బారువారు కోట లతని కుటుంబ జాగీరు రక్షణార్థమై పట్టుకొనఁబడినవని మనస్సంతుష్టి చేసికొను చుండిరి.

ఇతని జాగీరులో నిద్దఱు ముఖ్యులు గలరు. వీరు శివాజీ యొక్క యభిప్రాయములతో నేకీభవింపనందున నతని పక్షమునకు త్రిప్పుకొననైన లేక తొలఁగింపనైన వలసివచ్చెను. చాకనుకోట కధికారి యగు ఫిరంగోజీ నర్సాలా యొకడు. రెండవవాఁడు, షాజీ రెండవ భార్య తుకాబాయి యొక్క సోదరుఁడగు బాజీ మొహితీ సోపాజిల్లాపై నధికారిగా నుండెను.

శివాజీ యొక్క రాయభారులు, లంచమిచ్చి ఫిరంగోజీని వశముచేసి కొనిరి. కోట యధికారమతనికేయుంచి, మఱికొన్ని చుట్టు ప్రక్కల గ్రామముల శిస్తువసూలు చేయు నుద్యోగమునుఁ గూడ నతనికిచ్చి శివాజీ యతనిని తన సేవకునిగఁ జేసికొనెను.

బాజీ మొహితీ, శివాజీపంపిన సందేశములకు వినయముగ ప్రత్యుత్తరములు పంపుచున్నను, శిస్తునియ్యక షాజీయొక్క యధికారములేని యేయాజ్ఞలను లక్ష్యపెట్టకుండెను. శివాజీ యొకనాఁడు రహస్యముగ తన మావళీలతో పోయి యర్ధరాత్రి ముట్టడించి, మోహితీని యతని యనుచరులను చెఱఁబెట్టి

యతనిని యింకను తన క్రిందసేవఁజేయ నియ్యకొననివారి నందఱను కర్ణాటక మునకు తన తండ్రి పద్దకంపెను. కాని వీని యన్నిటికంటె గొప్పసంపాదన, కొండనే కోటయైయున్నది. దీనిని ఖిల్లేదారగు మహమ్మదీయుఁ డొకఁడు గొప్ప లంచమున కిచ్చివేసెను. శివాజీ దీనికి సింహగడమని క్రొత్త పేరును పెట్టెను. ఇది పూనాకు నైరుతిమూలను 12 మైళ్ల దూరములోనున్నది.

ఈవిధముగ నిచ్చట చుట్టుప్రక్కలనున్న మావలీ లందఱును వశమున కుఁ దేఁబడిరి. ఈభాగము యొక్క మోటు జనులు వారిసహజమైన నాయకుల క్రిందనే భటులుగఁ జేయఁబడిరి. ఈసంపాదన లన్నియు నే మాత్రమును బాధ గాని, రక్తపాతముగాని లేకనే చేయఁబడెను.

ఇప్పటి కితనిజాగీరు, పూనా, సోపా, బారామతి, ఇందపూరు వఱ కును వ్యాపించియుండెను. పురందరు కోట, పూనానుండి బారామతికి పోవు త్రోవను కాచియుండును. ఈకారణము వల్లను, ఇంక నితరకారణములవల్లను పురందరుకోట పట్టుకొను నవసరము గలిగెను. ఈకోట కధికారి నీలకంఠరావన్న యీావఱకు చెప్పియుంటిమి. ఇతఁడు షాజీయందును దాదోజీకొండదేవుని యం దును సుహృద్భావము గలవాఁడేగాని, మఱి యితర విధముల సన్మార్గుఁడుకాఁ డు. ఒక్కతఱి యతని భార్య కొంచెము తన దుష్కార్యముల యెడల కఠిన ముగఁ బల్కినదను కోపముచే నామెను ఫిరంగి యెదుట పెట్టికాల్చిచంపివేసె ను. దాదోజీ కొండదేవుడు చనిపోయిన సమయముననే కొంచె మెచ్చుతగ్గుగ, నితఁడును చనిపోయెను. అతనికి ముగ్గురు కుమారులుగలరు. అందు పెద్దవాడు, బీజపూరునుండి యాజ్ఞ రాకుండగనే, కోటను స్వాధీనము చేసికొనెను. తమ్ములిద్ద ఱును తమ తగవును దీర్ప శివాజీని వేడుకొనిరి. శివాజీ ముగ్గురను కూడ ఖైదు చేసి యాకోటనుపట్టుకొనెను. ఇది ద్రోహమని గ్రాంటు డఫ్ చెప్పుచున్నాఁడు. అయినవతఁడే, వారలకు శివాజీకొన్ని యినాములను వేరుగనిచ్చెననియు, యతని సేవయందు కొంతప్రాముఖ్యతకు వచ్చిరనియు, నొప్పుకొనుచున్నాడు. ఇంతేఁ గాక, కోటయొక్క కావలిసైన్యములో చాలమంది, వీరికలహముల వలన హాని రాఁగలదనితలంచి, శివాజీని కోటను పట్టుకొనఁగోరిరని, దేశీయచరిత్రకారులు

చూపించుచున్నారు. ఈ కోట యుద్ధవిషయములందు యుపయోగముగలది గావునకూడ, శివాజీ దీనిని పైకారణములనుబట్టి పట్టుకొనవలసివచ్చెను; గాన ద్రోహమనిచెప్పుట కిం దవకాశములేదు.

ఇంతవరకు రక్తపాతముగాని, గంద్రగోళముగాని లేకుండ నీచుట్టుప్రక్కల నున్న కోటలు పట్టుకొనఁబడినవి. మహమ్మదు ఏదులశాహి కర్ణాటకంబున దేశంబుల జయించుటయందును, భవనములను మసీదులను గట్టించుటయందును, కాలముఁగడపుచుండెను. షాజీయొక్క జాగీరునందలి యక్రమములు, జాగీరు రాజు వశమునం దున్నంతకాల మొక గొప్పగా నెంచఁబడలేదు.

చాకను కోటకును నీరానదికిని మధ్యనున్న దేశము ఇట్లు శివాజీసంపాదించెను. ఆ కొండలమీదనుండు బెబ్బులివలెనే మెల్లమెల్లగ ప్రాకుచువచ్చి, తన యాహారముపై నొక్కగంతున బట్టుకొనుటకు తగినస్థలంబు చేరువఱకు వాతని చర్యలెవ్వరును, గనిపెట్టలేకపోయిరి. అట్లు వెలుపలకు దుమికి యాహారముపైన పడినతోడనే యందఱునాశ్చర్యమగ్నులై చూచునప్పటి కాతని బలము చాల వరకు పుష్టినొందియుండెను.

దక్కను నందున్న రాజ్యములకు సంబంధించినవఱకును వ్యవహారస్థితి గతులింతకు పూర్వము చెప్పిన యంశములవలన, చదువరులకు స్పష్టమైయుండును. ఇక ముందు జరుగఁబోవు చరిత్రకు, శివాజీయొక్క యిప్పటిరాజ్యము చుట్టు నున్న మహారాష్ట్రదేశముఖుల స్థితి కొంత వర్ణింప నవసరము.

నీరానదికి దక్షిణపుయొడ్డున శిరవాలు వఱకును, దక్షిణమున కృష్ణా నదికి యుత్తరముననున్న పర్వతపంక్తివఱకును, బీజపూరు సంస్థానముక్రిందనున్న హారిదాసుమావలు దేశముఖుడు 'బాందలు' అనునతని యధికారములోనుండెను. ఇతఁడు శివాజీయెడల ననూయాపరుడై, కావలి సైన్యము నధికముగనుంచి పురందరుకోట సమీపభూమిని జాగ్రతగఁ గాచియుండెను.

వాయిగ్రామము, పాండుగడ కమలగడ యింక నాచుట్టుప్రక్కల నున్నకోటల కధికారియగు మొఖాసాదారుని నివాసము.

జౌలీరాజగు చంద్రరావుమోరే కృష్ణనుండి వరణానదివరకునున్న ఘాట్మాతా కధికారిగ నుండెను.

కొల్హాపూరుజిల్లా, పాన్హాలాయొక్క బలమైన దుర్గములోఁగూడ నొక మహమ్మదీయ యుద్యోగస్థునిక్రిందనుండెను.

బీజపూరురాష్ట్రముయొక్క కోంకణదేశములో మహమ్మదీయ యుద్యోగస్థుల చేతిలోనున్న రేవుపట్టణములగు దాబల్, అంజన్వీడు, రత్నగిరి, రాజాపూరును, వానికి సంబంధించిన జిల్లాలును తప్ప తక్కినవన్నియు, వచ్చటి వంశపారంపర్య హక్కులుగల దేశముఖుల వశమునందుండెను. గోవాకు సంబంధించిన పోర్చుగీసువారిసంస్థానమునానుకొని మహారాష్ట్ర జాగీరుదారులగు వాడీయొక్క సావంతులుగలరు. వారిరేవులు ఓడదొంగలయొక్క నివాసములు. వీరితరువాత ముఖ్యులైనవారు శృంగారపురముయొక్క దల్వేలు. వీరును మారుమూలగనుండుట వలన, జౌలీరాజావలెనే చాలవరకు స్వతంత్రులైయున్నారు.

కల్యాణప్రాంతము, పూర్వము అహమ్మదు నగరరాజ్యము క్రిందనుండి 1636 సం॥ పు సంధివలన బీజపూరునకు స్వాధీనమైనది. అందులో ఉత్తరభాగము, బీజపూరురాజుచే నియమింపఁబడిన గవర్నరుచే, కల్యాణభివిండీప్రధాన పట్టణమునుండి పరిపాలింపఁబడుచున్నది. ఇతనిక్రింద కొన్నికోటలునుగలవుగాని యవి యన్నియు శికస్తునందుండి యశ్రద్ధగఁ జూడఁబడుచుండెను. దక్షిణభాగము పత్తేఖాను అనునొక అబీసీనియనునకు జాగీరుగ నియ్యఁబడెను. ఇతఁడు కొంతయోడ సైన్యమును నిలిపి యోడవర్తకమును రక్షించుటకును, మహమ్మదీయ మెక్కాయాత్రికులను రుధిరసముద్రమునకుఁ దీసికొని పోవుటకును, నియమింపఁబడెను. ఓడసైన్యమునకు దండారాజపూరు రేవుగనేర్పడి జంజీరాయను సురక్షితమైన ద్వీపమును మధ్యను కలిగియుండెను. ఈయబీసీనియనులను సిద్దీలనిసామాన్యముగ వాడుచుందురు. ఈపత్తేఖానుక్రింద తాళ, గోసల, రాయిరీ యను కొన్ని దుర్గములుకూడఁగలవు. అవియన్నియు మహారాష్ట్రిల రక్షణక్రిందనే యుంచఁబడెను

ఇట్లు శత్రువులచేతను, అసూయాపరులచేతను, ఉపేక్షభావముగల వారిచేతను, చుట్టుకొనఁబడిన చిన్న రాజ్యముకలవాఁడై, శివాజీ మొట్టమొదట పరదేశాక్రమణ మెట్లు గడంగెనో చూతము.

ఇతఁడు, క్రమక్రమముగ మావలీసైన్యమును కూర్చుకొనినవాఁడై కొందఱు బ్రాహ్మణులను, కొంకణదేశ వృత్తాంతములనుఁ గనుఁగొని వారి యభిప్రాయములనుఁ దెలియపరుచుటకు, పంపెను.

కల్యాణగవర్నరువలన విస్తారధనము బీజపూరునకు పంపఁబడుచున్నటుల నెఱిగినవాఁడై శివాజీ, కొందఱు మావలీలను, బార్గీరులను వెంటతీసికొనినవాఁడై, యాధనముయొక్క రక్షకనికాయమును పారఁద్రోలి, యాధనమును గుఱ్ఱపుసవారులకు పంచి గుఱ్ఱములమీఁద వేయించుకొని, సురక్షితముగ రాయగడమునకు తీసికొనివచ్చెను.

ఈవార్త బీజపూరునకు జేరక మునుపే శివాజీ యింకననేక దుర్గములను వశముచేసికొనెను. ఈకోటలను సామాన్యముగ పట్టుకొనుట కొక మార్గము చెప్పఁబడుచున్నది. ఈ కొండకోటలలోనికి, చుట్టుప్రక్కలనుండు గ్రామస్థులు ప్రతిదినమును గడ్డిమోసుకొనుటకు, బోవువాడుకగలదు. శివాజీయొక్క మావలీలుకొందరు,గడ్డిమోపులలో ఆయుధములను పెద్దత్రాడును పెట్టుకొని కోటలోఁ బ్రవేశించి యర్ధరాత్రి యాత్రాడును మూసుమూల కోటకొకప్రక్కను క్రిందకు జారవిడచి, దానిమీఁదుగ తమమిత్రులనందరిని పైకి తీసికొనివత్తురు. తొరణ, గోసల మొదలైనదుర్గములు మహారాష్ట్రులచే శివాజీయొక్క రాయభారుల కొసంగఁబడెను.

ఇంతేఁగాక, దాదోజీకొండదేవునివద్ద సుశిక్షితుఁడైన అబాజీసోనదేవుఁడనునతఁడు కళ్యాణదుర్గమునుజయించి, యచటిజనుల నందఱినిఁ జెఱఁగొని, యాగవర్నరు నధికారమున నున్న కోటలనన్నిటిని వశము చేసికొనెను. ఈ మహావార్త వినినతోడనే, శివాజీ యచ్చటకుఁ జని యాప్రాంతమునకు సోనదేవుని సుభేదారునిచేసి, పరిపాలన వ్యవహారములనన్నిటిని చక్కఁజేసి, యదివరకున్న

ధర్మ యిహాములన్నిటిని స్థిరపఱచి నిలువఁబెట్టెను. ఈ సందర్భముననే శివాజీ కల్యాణ గవర్నరగు మూలనహమ్మదుయొక్క కోడలగు నొక స్త్రీని గౌరవములతో బీజపూరున కంపె నని యొకకథ చెప్పియుంటిమి. మూలనహమ్మదు చేఁబట్టుకొనఁబడినవాఁడై గౌరవముగ బీజపూరునకుఁ బంపివేయఁబడెను. ఈ కల్యాణప్రాంతమునకు సిద్ది బలవద్విరోధియగు హంసాయీ గావున, నా తని దేశపు సరిహద్దులలో బీర్వారి లింగణదుర్గములను క్రొత్తగ శివాజీకట్టించెను.

మూలనహమ్మదుపోయి, బీజపూరునం దీ వృత్తాంతము దెలియపఱచి నంతన, యచ్చటి వారెల్ల కలవరపడఁజొచ్చిరి. మహమ్మదు ఏదులశాహి, షాజీ యొక్క ప్రోత్సాహమువలన నీకార్యములు జరుగుచున్నవని యనుమానపడెను. రణదుల్లాఖానుడు కర్ణాటకమునుండి తిరిగి వచ్చినందున షాజీ యచ్చట మతింత ప్రబలాధికారుఁడయి యుండెను. కావున సుల్తాను, యుద్ధముచే శివాజీని లోఁగఁదీసికొనఁ దలఁపక, షాజీని యణఁగఁ ద్రొక్క నాలోచించెను. ముధోలు దేశముఖుఁడగు బాజీ ఘోరేపురే యప్పుడు కర్ణాటకమందు షాజీతోఁ గలసి పనిచేయుచున్నందున, నతనికి షాజీని మాయోపాయంబునఁ బట్టికొని ఖైదుచేయుమని, రహస్యముగ సుల్తా నాజ్ఞనిచ్చెను. అతఁడు, షాజీని ఒక పర్యాయము విందునకుఁబిలిచి ఖైదుచేసి బీజపూరున కంపెను.

షాజీయు, శివాజీ తనయెడల కూడ తిరుగఁబాటు చేసెననియు, తన మాట వినఁడనియు, నెంతచెప్పినను సుల్తాను వినడయ్యెను. అతఁడొక రాతికొట్టు నం దుంచఁబడెను. దానికి కొంచెము గాలివచ్చుట కొకచిన్న కంత యమర్పఁ బడెను. శివాజీ యొక గడువుకాలములో లోఁబడఁడేని, యాకంతయు మూయఁ బడుటకు సుల్తా నుత్తరువిచ్చెను.

ఈ సమయమునందు ఏమిచేయుటకును తోఁచనివాఁడై యాలోచించుచుండెను. లోఁబడుటకు కొంచెముఁ దలంచుచుండ, నతనిభార్యయగు సుహీర్యాబాయి, చక్రవర్తియగు షాజహాను ద్వారా తన కార్యము నింతకంటె యుపాయంబుగఁ గట్టెక్కించుకొనవచ్చునని, సలహానిచ్చెను. ఆకాలములో దక్షిణ మహమ్మదీయరాజ్యములు నమ్మి లోఁబడఁదగినవిగ నుండలేదు. కావున శివాజీ

మొగలు సేవకుఁడ నగుదుననియు, అహమ్మదు నగర రాజ్యమునందు ఛౌతు సర్దేశముఖులు తనకు వారసత్వముగ గలవనియు, కొన్ని సంగతులతో షాజహానుతో రాయభారము నడపెను. షాజహాను, శివాజీని 5000 గుఱ్ఱపుదళమునకు మన్సబుదారునిగఁజేసి, షాజీని వదలిపెట్టవలయునని, బీజపూరు సుల్తానునకు త్తరువుచేసెను.

బీజపూరు సుల్తానును, మొగలు దండయాత్ర భయమునను, శివాజీ పట్టుకొనినకోటలు మొగలుల కిచ్చివేయునను భయమునను, మంత్రియగు మురారి జగదేవుని సలహావలనను, షాజీని చీకటికొట్టునుండి తప్పించి బీజపూరునందు మాత్రముండునట్లు చేసెను. షాజీ 1652 వ సంవత్సర మాఖరువఱకును బీజపూరునందుండెను. షాజీయొక్క ప్రాణాపాయమునకు భయపడి, యీకాలములో శివాజీయేమియు బీజపూరు రాజ్యమునందు ప్రవేశింపలేదు. ఈ సమయములో, మాయోపాయముచేత శివాజీని పట్టుకొనవలెనని బీజపూరు వారు ప్రయత్నము చేసిరి. శివాజీ తఱచుగ కొంకణములో మహాడు అను గ్రామమునందుండెడివాఁడు. బాజీ శామ్రాజు అను నొకబ్రాహ్మణుఁడు, ఫాఱుఘాటుదగ్గిర చంద్రరావుమోరే యొక్క జాగీరులో దాఁగికొని యుండి, శివాజీ యామార్గమునఁ బోవుచుండగ, హఠాత్తుగ నతని పట్టుకొన నాలోచించెను. కాని శివాజీ దీనిని తన చారులవలనఁ దెలిసికొనినవాఁడై, వారిపైఁబడి వారిలో ననేకులను హతముగావించి, తక్కినవారిని తఱిమివేసెను. చంద్రరావుమోరేయొక్క సాహాయ్య మీ కుట్రయందుఁగలదని తరువాత నతనిని శివాజీ శిక్షించిన విధంబు మనము ముందుచూడఁగలము.

1652 వ సంవత్సరాంతమున కర్ణాటకంబున నల్లరు లెక్కువగుటవలన, షాజీ తిరుగ నతని జాగీరున కంపఁబడెను. అట్లు పోవుటకు పూర్వము, సుల్తాను, షాజీకిని ముధోలుదేశముఖుఁడగు బాజీఘోరేపురేకును, సమాధానముచేసి పంపెను. కాని షాజీ కర్ణాటకము చేరఁగనే, కుమారునకు 'నీవు నా కుమారుఁడవైన బాజీఘోరేపురేను శిక్షింపవలె'నని యుత్తరమువ్రాసెను. తండ్రియాజ్ఞను శిరసావహించి శివాజీఘోరముగ పగఁదీర్చుకొనెను.

ప్రకరణము 8.

శివాజీ రాజకీయజీవితముయొక్క రెండవభాగము.

(1652—1662.)

కర్ణాటకమునం దల్లరు లెక్కువాయెను. బీజపూరు సైన్యములో చాల భాగమచ్చట పనిబడి యుండెను. షాజీయొక్క పెద్దకుమారుఁడగు శంభాజీ, కనకగిరికోటను పట్టుకొనుచుండ, హతుఁడాయెను. ఆతని మరణమునకు, అప్జలుఖాను కొంతకారకుఁడని, యొకవిశ్వాసముగలదు. తరువాత షాజీ, కనకగిరిని దొమ్మియుద్ధంబున బట్టుకొని, కుమారుని మరణముయొక్క పగను తీర్చుకొనెను. షాజీయొక్క విశ్వాసపాత్రుఁడగు నుద్యోగస్థుడు నారూపంతు హనుమంతు చనిపోయెను. అతనికుమారుఁడగు రఘునాధనారాయణుఁ డా యుద్యోగమునం దుంచఁబడెను. ఇతఁడు బుద్ధిశాలి, పరిపాలనా సామర్థ్యము గలవాఁడు. శివాజీయొక్క దక్షిణ దిగ్విజయయాత్రయందు ముందు మనచరిత్రయందు ఇతఁడు, ప్రసిద్ధికి రాఁగలడు. కర్ణాటకమునందలి గంద్రగోళములు తగ్గలేదు. బీజపూరుయొక్క దృష్టి యాదిక్కుకు మరలియుండి శివాజీని చూడకుండెను.

దీనికితోడుగ, ఔరంగజేబు 1650 సంవత్సరమున దక్కనునకు యువరాజుగా బంపఁబడెను. అతఁడు బీజపూరు గోలకొండల, నే కారణమునైన కల్పించుకొని, జయింపఁదలంచుచుండెను. గోలకొండలో కుతుబ్షాకును, అతని ప్రధానమంత్రియగు మీరుజుమ్లాకును పోరాటములు కల్పించెను. ఈ మీరుజుమ్లా మొదట రత్నముల వర్తకుఁడై, యందఱు సుల్తానుల సభలయందును పేరుఁబొందియుండెను. ఈయనకుమారుఁడగు మహమ్మదు అమీను, గోలకొండ సుల్తానుయెడల కొంత యగౌరవము కనుపఱచినందున, సుల్తా నతని చెఱసాలయం

ము(బెట్టించెను. ఇది కారణముగా(గాని ఔరంగజేబు తనతండ్రిదగ్గఱనుండి యాజ్ఞ(దెప్పించుకొని 1655 సంవత్సరాంతమున యుద్ధసన్నద్ధుండగుచుండెను.

గోలకొండ వారికి ముప్పు సంభవించెను: బీజపూరువారికినిరావచ్చును: కర్ణాటకమునందలి వ్యవహారముల చేతను, మొగలులు భయము చేతను, బీజపూరు వారు శివాజీపై దాడివెడలుటకేమియు విచారింపరైరి. ఈసమయములో శివాజీయు తనజాగీరు చుట్టుప్రక్కలనున్న మహారాష్ట్రప్రముఖుల నెట్లు నయము చేతను భయము చేతను కూడ(గట్టుకొని వచ్చెనో, యట్లులనే బీజపూరు సేనయందున్న గొప్పజాగీరుదారులను(గూడ తనయుద్యమములోనికి తీసికొనిరా(బ్రయత్నించెను. చంద్రరావుమోరే యిందు కంగీకరింప(డయ్యెను. అంతే(గాక శివాజీకి వ్యతిరేకముగ(గూడ(బని చేసియున్నట్లు చెప్పియుంటిమి. కావున నితఁడు కడతేర్ప(బడవలసినవాడాయెను. శివాజీయొక్క యుద్యోగస్థులగు రఘూబల్లాలను నొకబ్రాహ్మణుడును, శంభాజీకావుజీ యను నొకమహారాష్ట్రు(డును, శివాజీకి వివాహముకొఱకు చంద్రరావుకుమార్తెను మాట్లాడు మిషమీ(ద నతని నమ్మించి యొంటరిగనుండు సమయమున నతని హఠాత్తుగ(జంపివేసిరి. శివాజీయు నర్ధరాత్రంబున తన మావలీసైన్యముతో వచ్చి వారినందఱి నోడించి కోటను వశము చేసికొనెను. చంద్రరావు సోదరు(డగు హిమ్మతురావును అతని కుమారులును చాలవఱకు పోరాడిరిగాని చివరకు పరాజితులైరి.

శివాజీ, తరువాత రోహిడాగోటను పట్టుకొని, యందున్న బందాలు అను దేశముఖునితో యుద్ధము చేసి, యతని రణనిహతుంజేసెను. అతని సైన్యమున కధిపతియగు బాజీప్రభువను నత(డు శౌర్యములోపోరాడి తన యధికారి చచ్చిపోయినమ్మట లో(బడెను. ఈబాజీ ప్రభూ సన్మానింప(బడినవాడై శివాజీకి విశ్వాసపాత్రుండగు సేవకు(డయ్యెను.

ఇట్లు సంపాదించిన క్రొత్తదేశమును వశమునం దుంచుకొనుటకు కృష్ణానది యుత్పత్తిస్థానంబగు మహాబలేశ్వరంబునొద్ద నొకకోటను కట్టుటకు మోరోపంతుపింగళేను నియోగించెను. మోరోపంతుపింగళే చిన్నతనమందు

షాజీయొద్ద నుద్యోగములోనున్న తనతండ్రితోఁగూడ కర్ణాటకంబునకుఁబోయి, యచ్చట తండ్రిపోయినమీఁదట 1653 వ సం॥ ములో మరల మహారాష్ట్రమునకువచ్చి శివాజీయొద్దఁ బ్రవేశించెను. ఇప్పుడతఁడు కట్టిన ప్రతాపగడ అను కోటయొక్క బిట్టతనమునుజూచి శివాజీయు నతని యెడల సదభిప్రాయుండయ్యెను.

ఇట్లు శివాజీ, తనరాజ్యంబును బలపఱచుకొనుచుండ నచట బీజపూరు గోలకొండలు దుఃఖవార్ధిలోమునిఁగియుండెను. ఔరంగజేబు, తండ్రిచే ననుజ్ఞాతుండై ముందు గోలకొండపై దాడివెడలెను. గోలకొండసుల్తానును, మొగులు సైన్యములు చూపుమేర దూరమున నున్నంతవఱకు నెఱుఁగని వాఁడాయెను. తోడనే భయపడి ప్రయత్నములు చేయసాగెను. సంధికొఱకు వేడుకొనెను. కాని ఔరంగజేబు సైన్యము కోటను ముట్టడించెను. హైదరాబాదు కొల్లపెట్టఁబడెను. సహాయములన్నియు నడ్డుకొట్టఁబడెను. సుల్తాను దురవస్థయందుండెను.

ఇంతలో, షాజహాను, కోపము చల్లారినవాఁడై అబ్దుల్లాకుత్బుశాహినుండి తగిన సమాధానములతో సంధిచేసికొనుమని క్రొత్తయాజ్ఞనంపెను. ఔరంగజేబు, సాధారణమైన సమాధానములతో తృప్తిపడక, బహుహీనమైన లోకువకతనిఁ దీసికొనివచ్చెను. మహమ్మదమీనును వదలిపెట్టి యతని యాస్తి నిచ్చుటయేఁగాక, సుల్తానును తనకుమార్తెను ఔరంగజేబు కుమారున కిచ్చునట్లును సంవత్సరమునకు కోటిరూపాయలు కప్పము నిచ్చునట్లును ఔరంగజేబు నిర్బంధించెను.

మీరు జుమ్లా, షాజహాను దర్బారునకు పిలువఁబడి, వజీరుగాఁ జేయఁబడెను. ఇతనియొక్క ప్రోత్సాహమువలన, బీజపూరుకూడ జయింపఁబడుటకు, షాజహా నంగీకరించి గొప్పసైన్యమునిచ్చి యతనిఁబంపెను. ఔరంగజేబుయును మీరుజుమ్లాయును రహస్యముగ నాలోచించుకొని, యిట్లుచేసిరి. ఔరంగజేబు ముందుతన యన్నదమ్ముల నోడించిరాజ్యమును సంపాదించుటకొఱకువ సైన్యము

తనక్రింద నుండుటకుగాను, చేసిన యుపాయ మిదియై యుండెను. అట్లు 1657 వ సం॥ము మార్చిలో ఔరంగజేబు బీజపూరును జయింప వెడలెను.

1656 సం॥మున, బీజపూరు సుల్తానగు మహమ్మదు ఏదులశాహి చనిపోయెను. అతని కుమారుఁడగు సుల్తాను ఆలీఏదులశాహి 19 సం॥ముల వయసునందు సింహాసన మెక్కెను. ఔరంగజేబు, చచ్చిపోయిన సుల్తానున కితఁడు కుమారుఁడు కాఁడనియు, చక్రవర్తియే, సరియైన వారసును నియమింపవలెనని యు వంకపెట్టి, యుద్ధమునకు వెడలెను.

బీజపూరు దర్బారునందు, ఖాను మహమ్మదు అను వజీరు మొగలులతో కుట్రలోఁజేరి యున్నందున, నతఁడు రక్షించుటకే ప్రయత్నములు చేయలేదు. సైన్యములు చాలవఱకు కర్ణాటకమందుండెను. కొందఱు ఉద్యోగస్థులు ప్రయత్నములు చేసినను, వారికి సహాయము చేయువా రెవ్వరును లేకపోయిరి. ఔరంగజేబు సులభముగ పట్టణమునుపట్టుకొనెను. లోపలికోటయు లోబడ సిద్ధమయ్యెను. ఇంతలో షాజహాను రోగపీడితుండై యున్నట్లును, దారా యను నతని పెద్దకుమారుఁడు సింహాసన మాక్రమించుకొన నున్నట్లును, ఔరంగజేబు సోదరియగు రోషీనారాబీగము రహస్యముగ నతనికి కబురుపంపెను. ఔరంగజేబును, బీజపూరు సుల్తానులో నేదో యొకవిధముగ సంధిచేసికొని, ఢిల్లీపట్టణాభిముఖుండై, పోయెను.

శివాజీయు నీ చలనములన్నియు గమనించుచుండెను. గోలకొండ మొగలుల స్వాధీనమాయెను. బీజపూరు స్వాధీనమగుటకు సిద్ధముగనుండెను. అటుతరువాత, ఔరంగజేబు ఏదిక్కునకు తిరుగునో తెలియరాదాయెను. శివాజీయు నాతురతతో నీ ఫలితములను పరీక్షించుచుండెను. ఔరంగజేబు ఉత్తరదిక్కునకు ముఖము త్రిప్పగనే, శివాజీ యానంద పరవశుఁడయ్యెను. క్రమ్ముకొని వచ్చుచున్న మొగలు కారు మేఘంబు తక్షణంబు విడిపిపోయెను. రంగము యొక్కమో మెల్ల మారిపోయెను. ఇంకను దృఢంబుగ వేళ్లునాటుకొనని శివాజీ రాజ్యము, తుపాను దెబ్బ తగులకుండ, తప్పించుకొనెను.

ఔరంగజేబు, గోలకొండను జయించుచున్నపుడు, శివాజీయొక్క సఖ్యమును గోరువానివలె నటించెను. అతఁడు శివాజీతో రాయభారములు నడుపుచుండెను. శివాజీయు,నతనికి వినయంబులను దూరంబునుండియేఁ జూపుచు, కొంకణ ప్రాంతములను తాను వశము చేసికొనుచుండెను. ఒకరినొకరు రాజనీతులందు మించి మెలంగుచుండిరి. శివాజీ, గుఱ్ఱపుదళమును విస్తారముగ వృద్ధి చేసి, నేతాజీపాల్కారును సర్వసైన్యాధిపతిగ నుంచెను. ఔరంగజేబు బీజపూరుపై దాడి వెడలునప్పుడు, శివాజీ, యాసంవత్సరము మేనెలలో జూనారు మీదకుపోయి, యాపట్టణమును కొల్లపెట్టి, మూడులక్షల వరహాలను, 200 గుఱ్ఱములను, విలువగల కొన్ని వస్త్రాభరణంబులను, సురక్షితముగ రాయగడకు చేర్చెను. మొగలులపై మొట్టమొదటి కలహ మితని దిదియే. కాని, యటుపిమ్మట బీజపూరు ఔరంగజేబుయొక్క పాదాక్రాంత మగుచున్నదని మాత్రము,కొంచెము వెనుకకు తగ్గి, ఔరంగజేబుతో సామవచనంబుల నతఁడు ప్రొద్దుపుచ్చుచుండెను: రఘునాథపంతుఅను నొకవిశ్వాసపాత్రుఁడైన వకీలునుబంపి, ఔరంగజేబునకు భక్తుఁడనయ్యెదనని రాయభారములు నడపుచుండెను.

కాని, ఆగ్రానుండి షాజహానురోగమునుఁగూర్చి వర్తమానమువచ్చి, బీజపూరుతో సంధిజరిగి, ఔరంగజేబు ఉత్తరాభిముఖుండైనతోడనే, వ్యవహారము లన్నియు మాఱిపోయెను. శివాజీ, మఱియొకవకీలు కృష్ణాజీ భాస్కరును ఔరంగజేబుదగ్గరకు పంపి, అతఁడు లేనికాలములో చక్రవర్తిరాజ్యమును తాను రక్షించుచుండెదననియు, మొగలు జిల్లాలలో తనకు వారసత్వపు హక్కులుగలవనియు, తనదేశముఖియు కుటుంబజాగీరును తనసేవకు ప్రతిఫలంబుగ నియ్యవలెననియు, కొంకణములో బీజపూరు సుల్తాను పరిపాలన చక్కఁగఁ జేయక పోవుటవలన తా నా దేశమునంతను దీసికొనినయెడల బాగుండుననియు, మొదలైన రాయభారములను నివేదించెను. ఔరంగజేబుయు నిందువలన కొంత మనసున కోపగించినను, శివాజీయొక్క దండయాత్రలవలన బీజపూరు నాశనమగుచుండుట తన యుద్దేశమున కనుకూలముఁగావున, నందు కొంకణము నాక్రమించుకొనుట కంగీకరించి, వారసత్వపుహక్కులనుగూర్చి మాటాడుటకు అబాజీ

పోనదేవుని బంపుమనియు, శివాజీ చేసినతప్పుల క్షమించితిననియు నుత్తరము వ్రాసెను.

వాజీగాని, ఔరంగజేబుగాని, ఈరాయబారములకు మోసపోలేదు. ఇద్దఱును, తమతమయాలోచనలను, తమయిష్టానుసారంబుగఁ జేయుచుండిరి. శివాజీ కొంకణమును జయించుటకు, సైన్యములను సిద్ధముచేయుచుండెను. సముద్రతీరమున నశ్రద్ధగ విడువఁబడిన యనేక దుర్గములాక్రమింపఁబడెను. ఈ చోటులయందు ఓడలను ద్రోచుకొనుటకు నావసైన్యమును, తరువాత నతఁడు కూర్చెను. ఇంతేఁగాక బీజపూరువారిచే, ఔరంగజేబు డిల్లీకిపోయినతోడనే, విడచిపెట్టఁబడిన 700 పఠాను కాల్బలమునుగూడ, శివాజీ తనక్రింద నుంచుకొనెను. శివాజీ, మహమ్మదీయుల సైన్యము నుంచుకొనుట కనుమానించెనుగాని, గోమాజీ నాయకుఁడను జాధవరావు నొద్ద పనిచేసిన వృద్ధయోధుని సలహాచే నందుకు సమ్మతించి, చంద్రరావు మోరేయొక్క హంతకుడైన రఘుబలాల్ క్రింద నా సైన్యమునుంచెను.

బీజపూరు రాజ్యము, కుట్రలవలన శిథిలమగుచుండెను. ఔరంగజేబు వెడలినతోడనే, శివాజీపై సైన్యమునుబంపక, ముఖ్యులగు వారొకరితో నొకరు పోరాడుకొనుచుండిరి. ప్రధాన మంత్రియగు ఖాను మహమ్మదుయొక్క రాజద్రోహము, సుల్తానునకు బోధపడెను. కాని క్రమమైన విచారణచేయఁబడకుండ, దర్బారునకు పిలువఁబడి పట్టణద్వారమునొద్దకొందఱుహంతకులచే సేనుగుపై నుండి క్రిందికి లాగఁబడి, ఘోరముగ నా వజీరు చంపఁబడెను. ఈ ఖాను మహమ్మదు, ప్రస్తుత సుల్తానుయొక్క తాతయగు ఇబ్రహీము ఏదులశాహియొక్క రీహా నను అబ్సినియను బానిసవాడు. ఇతఁడు, క్రమక్రమముగ వృద్ధినొంది, మహమ్మదు ఏదులశాహి మంత్రియాయెను. ఇతనియొక్క యాస్తిమాత్రము, సర్కారులోనికిఁ దీసికొనకుండ కవాసుఖా నను నితని కుమారునికి, సుల్తాను అలీ ఏదులశాహి ప్రస్తుత మిచ్చివేసెను.

1659 వ సం॥ ములో శివాజీ, కట్టుదిట్టమైన ప్రయత్నములఁజేసి, సిద్దిపై మంత్రియగు శ్యామాజీపంతును బంపెను. కాని, యాతఁడంతగ సమర్థుఁడు

కాకపోయెను. పత్తేఖానుఁ డతని సంపూర్ణముగ నోడించెను. అందుపై శివాజీ శామ్రాజీపంతు నుద్యోగమునుండి తొలఁగించి, మోరోపంతుపింగళేను ప్రధానమంత్రిగాఁ జేసెను. శామ్రాజీపంతు లోడిపోకమునుపే, వాడీలోని సావంతులు భయపడి శివాజీతో సంధిచేసికొని, 3000 కాల్బలము కోరినవెంటనే హాజరు పెట్టుట కొప్పుకొనిరి.*

అఫ్జల్ ఖానుయొక్క దండయాత్ర.

శివాజీ, మరల సిద్దీ నోడించుటకై గొప్పప్రయత్నములఁ జేయుచుండగనే, అఫ్జల్ ఖానుయొక్క దండయాత్ర యాసన్నమై, యతని దృష్టిని మరలించెను.

శివాజీయొక్క జయములు గొప్పయుపద్రవమునకు ద్రోవఁజూపెను. బీజపూరు వారింక నూరకుండిన నాశనమగు స్థితికి వత్తురు. కావున నెట్లైన పెద్దప్రయత్నముచేసి యీ దురాగతముల నాపఁదలంచిరి. శివాజీ, తండ్రి యాజ్ఞయందు లేడనియు, తండ్రి నేమైన నిర్బంధించిన, మొగలుల శరణు జొచ్చుననియు, వారు స్పష్టముచేసికొనిరి. బాజీ శామ్రాజువలన రహస్యముగ కడతేర్చు నుపాయము వెనుకనే విఫలమాయెను. శివాజీయొక్క యుద్యోగస్థులకు, సావంతులును, దళ్వేలును నిలువఁజాలకుండిరి. అప్పుడు బీజపూరునందు రాజకార్యధురంధరుఁడై ప్రసిద్ధికెక్కిన అఫ్జల్ ఖాను సైన్యాధిపత్యము క్రింద, గొప్పసైన్యమును బంప, వారు నిశ్చయించుకొనిరి. అఫ్జల్ ఖానుఁడు కర్ణాటకము నందు యుద్ధములు జరిపినవాడై, సకారణముగనో, యకారణముగనో, శివాజీ యన్నగారగు శంభాజీయొక్క చావునకు హేతువయ్యెనని విశ్వసింపఁబడెను. నిండు యోలగమందు, శివాజీ నెట్లైన ప్రాణములతోడనో, లేక ప్రాణములు లేకనో, పట్టితెచ్చెదనని, అఫ్జల్ ఖానుడు ప్రతిజ్ఞపట్టెను.

సెప్టెంబరులో అఫ్జల్ ఖానుఁడు, బీజపూరునుండి చుట్టుతిరిగి, తుల్జాపూరు పంధరు పురముమీదుగ సేనలను నడిపించెను. వానలు అక్టోబరు మాసాం
1659 తమువఱకు నచ్చట కురియుచుండును గాన, వాఁడు, దగ్గిర మార్గము ను
కూలము కాదని, చుట్టుమార్గము పట్టెను. అఫ్జల్ ఖానుడు, తుల్జాపురము

నందు భవాని దేవాలయమును, పంధరపురమునందలి పాండురంగనాథుని దేవాలయమును పాడుచేసి, విగ్రహములను బ్రద్దల కొట్టించెను. కావున నతని దండయాత్ర కేవలము మతవిద్వేషభూతమైన రూపంబును దాల్చి యిరుపక్షముల వారికిని క్రోధములను పెంపుఁజేసెను ఈ కలహముయొక్క ఫలితము, భయావహమై యుండు ననుటకు సందియము లేదు. ఇందు, జయించినవారికి సర్వమును సిద్ధించును. ఓడిపోయినవారికి సర్వనాశముఁ గలుగును. ఈ యవస్థయొక్క యదార్థస్థితిని, శివాజీయు నతని మంత్రులు నెఱింగిరి.

అఫ్జులుఖానుయొక్క రాక నెఱింగి, శివాజీ ప్రతాపగడకుఁ జేరెను. అఫ్జులుఖాను సైన్యము వాయీగ్రామము దగ్గరకువచ్చెను. శివాజీయొక్క సైన్యమిరువది వేలుండెను. అఫ్జుల్ ఖాను సైన్యము పండ్రెండువేలేయుండెను. అంతేఁగాక శివాజీ దుర్గమంబైన దుర్గములలో నుండెను. శివాజీ యెదురుపడి పోరాడినను యోడిపోవలసిన స్థితియందు లేదు. అఫ్జులుఖానుడును, పూర్వము కొన్ని సంవత్సరముల క్రింద, వాయీప్రాంతమున సుభేదారుగ నుండెను గాన, నతఁడును కొండలయందున్న శివాజీని గెలుచుటయం దంత నమ్మకము లేనివాఁడాయెను. శివాజీ కెట్టులైన అఫ్జులుఖానును చంపవలెనని యుండెను. అఫ్జుల్ ఖానున కెట్టులైన శివాజీని పట్టుకొనవలెనని యుండెను.

ఈ స్థితియందు, శివాజీ భవానీమాతయొక్క యనుజ్ఞకొఱకై యామెను ధ్యానించెను. భవానీమాత యతని నావహించు సమయమున, నతఁడేమి చెప్పునదియు, చిట్నీసును వ్రాయుట కాతఁడు సెలవిచ్చెను. అట్లు స్మృతిఁదప్పి యున్నపు డతఁడు పల్కినమాటలు వ్రాయఁబడెను. అట్లుభవానీవలన నియ్యఁబడిన రక్షణవలనను, తల్లియొక్క యాశీర్వచనము వలనను, సైన్యముయొక్క భక్తివలనను ప్రోత్సాహమును పొందినవాఁడై యొంటరిగ నఫ్జులుఖాను నెదుర్కొనుట కతఁడు సంసిద్ధుఁడయ్యెను.

శివాజీ, ఇట్లు సన్నద్ధుడై, అఫ్జుల్ ఖానునకు లోబడెదనని కబురులు పంపెను. అఫ్జుల్ ఖానుఁడును, పైకారణముల వలన, కొంత మెత్తపడినవాఁడై, పంతోజీ గోపీనాథుడను రాయబారిని ప్రతాపగడమునకు పంపెను. శివాజీ

ప్రతాపగడమునకు క్రిందనున్న పారను గ్రామమున నెదురుగవచ్చి రాయభారిని యోగక్షేమము లారసి, తనకు కొంత జాగీరు నిచ్చినయెడల సంతృప్తుఁడనై యుండుననియు, రాజసేవకుఁడ నయ్యెదననియు, మూర్ఖులగు ననేక పోలిగారిలను లోబడఁజేయుటవలన తాను సుల్తానున కుపకారినైతిననియు చెప్పెను. పంతోజీయు, ఖానుఁడును షాజీయొక్క స్నేహితులనియు, బీజపూరు సుల్తానుయొక్క క్షమాపణవచ్చునట్లు, ఖానుచేయ నుద్దేశించినాడనియు, చెప్పెను. శివాజీయు, రాయభారితోఁడ వచ్చినవారందఱకును తగిన బస లేర్పరచి, రాయభారికిమాత్రము దూరముగ నొక బస నేర్పాటుచేసెను. శివాజీ యర్ధరాత్రివేళ మారువేషములో బ్రాహ్మణుని కడకేగి 'తాను చేయుచున్న దంతయు గోబ్రాహ్మణరక్షణార్థమనియు, భవానీవలన తానట్లు నియోగింపఁబడితిననియు' మొదలైనసంగతులను చెప్పి యతని కనేక బహుమానములను ఈనాములనిచ్చి యతని సహాయమును వేడుకొనెను. మరునాడు కొంత వ్యవహారమును సైనటించి, శివాజీ, కృష్ణాజీభాస్కరుఁడను తన రాయభారి, నతనివెంట ఖాను కడకంపెను.


పంతోజీగోపీనాథుఁడు, వాయీదగ్గరనున్న అఫ్జులుఖాను శిబిరమునకు వచ్చి శివాజీ భయపడుచున్నాడనియు, ఖాను స్వయముగ వచ్చి సుల్తాను క్షమించునని కొంత ధైర్యము చెప్పినయెడల లోబడిపోఁగలడనియు, చెప్పెను. అఫ్జులుఖానుఁడు, గ్రుడ్డివిశ్వాసములో, పంతోజీ గోపీనాథుడు చెప్పినట్లు చేసెను. బీజపూరు సైన్యము వాయీనుండి జావళివఱకు నడచెను. ప్రతాపగడకోట క్రింద సమావేశమున కొకస్థల మేర్పఱుపఁబడెను. ఖాను రాకకు వీలగునట్లు నడ్డముగనున్న చెట్లను గొట్టించి, త్రోవ జక్కఁజేయింపఁబడెను కాని తక్కిన మార్గములన్నియు మూసివేయఁబడెను. అనేకవేల మావళీ కాల్బలములో మోరోపంతు నేతాజీ పాల్కరులను, శివాజీ కొంకణమునుండి పిలిపించెను. వీరిద్దఱకును, తానాజీ మాలుసూరేకును, అతఁడు తన యుద్దేశము నెఱిగించెను. కోటకు పూర్వపు దిక్కున నేతాజీనుంచెను. మోరో తిరుమల పింగళేను అతిశేరిన యోధులతో బీజపూరు సైన్యములో ముఖ్యభాగ మున్న

జాలీవద్దర నుంచెను. కొమ్ముఊదినతోడనే నేతాజీకి సంజ్ఞగాఁ దెలిపెను. ఆయిదుఫిరంగులు కాల్పఁబడినతోడనే మోరోపంతునకు సంజ్ఞగాఁ దెలిపెను.

అఫ్జులుఖాను సైన్యములో పదునైదు వందలమంది ప్రతాపగడ కోటకు కొన్నివందల గజముల దూరమువఱకు వచ్చిరి. అఫ్జుల్ ఖానుడు, పలుచని యొక యంగరకాను తొడుగుకొని, ఖడ్గమును మాత్రము ధరించి, యొక్క యనుచరునితో మాత్రము, నొక పల్లకిపైఁగూర్చుండి కోటయం దొక నియమిత స్థలంబునకు వచ్చి చేరెను.

శివాజీయు, భవానీదేవిని ధ్యానించుకొని, తల్లి పాదములమీద తన శిరస్సునుంచి యాశీర్వాదంబు గైకొని, లోహకవచంబుఁ దొడుగుకొని, లోహకుళ్లాయిని ధరించి, యందుపై నంగరఖాయు తలపాగయు నమర్చుకొని, అంగరఖాకుడి చేతియందు *బిచ్చ్వా అను నొక యాయుధమును దాచుకొని, ఎడమ యరచేతియందు వ్యాఘ్రనఖంబు నమర్చుకొని, తానాజీ మాలూశూరేను వెంట తీసికొని, భయపడుచున్న వానివోలె నటించుచు, మధ్యమధ్యనాగుచు ఖాను ఉన్న స్థలమునకు వచ్చి చేరెను. శివాజీకి ద్రోహబుద్ధి యున్నటుల ననేక కారణముల వలనఁ గనుపడుచున్నది. అయినను ఖానునకు మాత్రము లేదని చెప్పుటకు వీలులేదని చరిత్రకారులు ఒప్పుకొనుచున్నారు. అయిన నిద్దఱకు నున్న భేదమేమనఁగ, నొకవైపున శివాజీ తగిన జాగ్రత్తమీఁద నుండెను, రెండవవైపున ఖానుమాత్ర మవ్యక్తుఁడై యజాగ్రత్తగనుండి యహంభావముచే నిర్లక్ష్యముగ నుండెను. ఇటువంటి ప్రమాదమైన సమావేశమును బొందినపుడు, ఇరుపక్షములవారును రెండవపక్షము వారియొక్క నిష్కపట కార్యమునైనను దురుద్దేశములో కూడిన దానిగా భావించుట సంభవించును. కావున శివాజీ అఫ్జులుఖాను లాలింగనంబు చేసికొనినపు డొండొరుల యెడల గల ననుమాన భయంబున, ఘోరంబు వాటిల్లి యుండవచ్చును. అఫ్జులుఖానుడు శివాజీ దొరకెను గదా యని గట్టిగఁ బట్టుకొనియుండవచ్చును. అఫ్జులుఖానుఁడు తనను గట్టిగ పట్టుకొనెను గదా యని, శివాజీ వ్యాఘ్రనఖంబును బిచ్చ్వా నుప

* బిచ్చ్వా యనగా తేలువంటి యాయుధము.



ప్రతాపగడ.

రాగించి, యతని గాఢాలింగనంబునుండ తప్పించుకొనఁ బ్రయత్నించి యుండ వచ్చును. కాని శివాజీ, ఖానును పొడిచి తప్పించుకొనిన తోడనే, తన కార్యంబును పూర్తిముగఁ జరిపించెను. ఖానుడును, ఒక చేతితో గాయమును ఒత్తి పట్టుకొని, శివాజీ నొకవ్రేటు తన ఖడ్గముతో శిరమున వేసెను. కాని, శివాజీ కవచధరుఁడై యుండుటవలన, నా దెబ్బ యంతగా నతని గాయ పఱచ లేదు. ఖానుయొక్క యనుచరుఁడైన సయ్యదుబందు ఇంతలో దగ్గరకు వచ్చి శివాజీ తానాజీల మధ్యఁ జచ్చువఱకును యుద్ధంబు చేసెను. సవారిబోయలు పడియున్న ఖానును సవారియం దిడుకొని పాఱిపోవుచుండిరి. కాని, ఖండూ మాలేయు యశాజీకంకును దూరమున దాగియున్న స్థలమునుండి వచ్చి అఫ్జులుఖాను యొక్క శిరమును ఖండించి దాని రణవిజయ చిహ్నముగా ప్రతాపగడకు కొనిపోయిరి. ఏర్పాటు చేసికొనఁబడిన సంజ్ఞలు చేయఁబడెను. నేతాజీపల్కారు క్రింద, దాగియున్న మావలీసైన్యము, కోటదగ్గరనున్న బీజపూరు సైన్యముపైఁ బడి దాని నరకివేసెను. ఈ బీజపూరు సైన్యము కొంచ త్రోవలనుండి పారిపోకుండ, యదివఱకే బాటప్రక్కనున్న చెట్లు కొట్టఁబడి త్రోవలకడ్డముగ పడవేయఁబడెను. అచ్చట మోరోపంతుచే, ఖానుయొక్క ప్రధానసైన్యము కూడ వేటాడఁబడెను. కాని యతనికి లోఁబడిన వారినందరిని రక్షింపవలసిన దని శివాజీ యాజ్ఞ యిచ్చెను.

కాని శివాజీయొక్క దయాస్వభావము, తక్కిన యన్ని సమయము లందువలెనే, యిప్పుడుకూడ ప్రముఖ్యతనొంది యుండెనని చరిత్రకారు లొప్పు కొనుచున్నారు. తప్పించుకొని పాఱిపోయినవార నేకులు గుట్టలడవులు బట్టి తిరుగుచుండ, బహుదురవస్థయందు, శివాజీ యెదుటకు తరువాత తీసుకొని రాఁబడిరి. వారికిఁ జేయఁబడిన యాదరణయు సత్కారమునుబట్టి యనేక మహారాష్ట్రీయు లతని సేవను గైకొనిరి. ఇందు జూజారురావు ఘార్గేయనునొక మహారాష్ట్ర ముఖ్యుఁడు షాజీయొక్క ప్రియమిత్రుని కుమారుఁడై యుండెను. ఇతఁ డెంతఁ జెప్పినను బీజపూరు యెడల భక్తిని విడువలేదు. కావున నతడు ఇష్టప్రకారము బహుమతులతోఁ గూడ బీజపూరున కంపివేయఁబడెను. అఫ్జులుఖానుయొక్క

కుమారుఁడగు ఫజిల్ ఖానుఁడును, అతనియొక్క కుటుంబమును, ఖండోజీ కాకరే యను నొక శివాజీయొక్క యుద్యోగస్థునిచే, గొప్పలంచమునకు దొంగత్రోవలను రహస్యముగ బీజపూరునకు తీసికొనిపోఁబడెను. ఈ సంగతి శివాజీ తెలిసికొని యతని నఱికి దీయించెను.

శివాజీ కీ యుద్ధమువలన 4000 గుఱ్ఱములును, అనేక యేనుఁగులును, అనేక యొంటెలును, అపరిమితమైన ధనమును, తనపైఁ బంపఁబడిన యాపత్తు సాధనసామగ్రియు, దొఱికెను. యుద్ధములో గాయములు తగిలినవారికిని, శౌర్యప్రతాపములఁ జూపినవారికిని, గొప్పయుత్సవముచేసి యాడంబరముతో, బంగారపు మురుగులు గొలుసులు మొదలైనవి బహుమతు లొసంగఁబడినవి. కంతోజీ గోపీనాథునకు, మాన్యములును గొప్పయుద్యోగము నియ్యఁబడెను. అఫ్జులుఖానుయొక్క ఖడ్గమిప్పటికిని శివాజీవంశము వారగు కొల్లాపురపు రాజుగారియొక్క విజయచిహ్నముగ పరిగణింపఁబడుచున్నది.

అఫ్జులుఖానుని రాకవిని, సిద్దీ శాళగోసల దుర్గములు ముట్టడించి యుండెను. అఫ్జులుఖానునివధ వినినతోడనే వెంటనే దుర్గములవిడిచి యిల్లుచేరెను. శివాజీ, యతని నోడింపఁదలచుకొని యున్నను, పన్హాలాదుర్గమును వశముచేసికొను ప్రయత్నములో నుండెను. ఆ దుర్గాధిపతి లంచమునకు దాని నిచ్చివేసెను. దానిదగ్గరనున్న దుర్గములుకూడ సునాయాసముగ చేఁజిక్కెను. రంగనా కిల్లామాత్రము ద్వంద్వయుద్ధముచే వశముచేసికొనఁబడెను. కిల్లాదుర్గమునకు విశాలగడ యని శివాజీ నామకరణముచేసెను.

ఇంత కాలాతీతమైనపిమ్మట, కొల్హాపుర జిల్లాను రక్షించుటకు రుస్తుము జుమాను అను బీజపూరు యోధుఁడు 3000 సైన్యముతో పంపఁబడెను. శివాజీ స్వయముగ వానినోడించి, సైన్యమును హతముగావించి కృష్ణానదివఱకు తఱుమ గొట్టెను. తరువాత అన్నాజీ దత్తూకు శాల్బలమునంతను విశాలగడదగ్గర కూర్చుమని వ్రాసి, తాను బీజపూరువఱకును దండెత్తిపోయి త్రోవపొడుగునను కప్పమును వసూలుచేయుచు, దేశమునంతయు భయావహంబుచేయుచు, తిక్కోటను, వెంటఁదఱుమఁ బడకుండఁ గూడ వెనుకకువచ్చెను. విశాలగడ

యందలి సైన్యములో నతఁడు రాజాపురము త్వరితగతినిబోయి, యచ్చట జనులయొద్ద కప్పమును వసూలుచేసి, దాభలు మొదలైన పోటులధనము కొల్లఁబెట్టి భద్రముగ రాజగడఁ జేర్చెన

అఫ్జుల్ ఖాను వధ, అతని సైన్యవినాశము, పన్హాలాజయము, రుస్తుమజిమానుయొక్క రోటమి, ఇంతకుమించి బీజపూరునగరద్వారమున శివాజీదర్శనము, బీజపూరునందు భయకంపమునుఁబుట్టించెను. కర్ణాటకమునందు ఖ్యాతినిఁగొన్న సిద్దిజోహారనునతఁడును, పితృపరాభవంబునకు పగఁదీర్చుకొన నువ్విళలూరుచున్న ఫజిలుఖానుడును, అఫ్జులుఖాను సైన్యముకంటె రెట్టింపుసైన్యముతో శివాజీపై పంపఁబడిరి. పన్హాలాముట్టడితో యుద్ధమారంభింపఁబడ నేర్పాటుచేయఁబడెను. సిద్దియు, నీసైన్యము బయలుదేరిన తోడనే, కొంకణములో శివాజీదేశమునుముట్టడింప సంసిద్ధుఁడైయుండెను. వాడీటేశముఖులు ఇంతకు పూర్వమేమరలశివాజీ కెదురుతిరిగి యుండిరిగాన, తాము సహాయపడెదమని సంసిద్ధులైరి.

శివాజీయు తగినయేర్పాటులను చేసెను; పత్తేఖానుసిద్దీకి రఘునాథపంతును జోడుచేసెను, ఆబాజీసోనదేవుని కళ్యాణజిల్లాలను రక్షింప నియోగించెను, సర్ణోబతు లేక సర్వసైన్యాధిపతియగు బాజీఫసల్కారును వాడీశావంతులపై నియమించెను, మోరోపంతును పురంధరు సింహగడప్రతాపగడ దుర్గములను చుట్టుప్రక్కల దేశమును రక్షింప నేర్పఱచెను. శివాజీ, పన్హాలాదుర్గము, నిజముగ నది యున్నదానికంటె దృఢతరమని యెంచి, యందుతాను రక్షించుట కవివేకంబున నిశ్చయించుకొనెను.

బీజపూరుసైన్యము పన్హాలాకోట దగ్గిరకుచేరఁగనే, వేశాజీపాల్కారుతన గుఱ్ఱపుదళములో చుట్టునున్నదేశమును పాడుచేసి, సామగ్రుల నడ్డముకొట్టి బాధింపనారంభించెను. మావలీలు, గుట్టమెట్టలచాటునదాగి, అర్ధరాత్రినతాత్తుగ నజాగ్రతగనున్న సైన్యముపైబడి, ఖడ్గధరులై కలియఁబడి శత్రుల నాశముగావించుచుండిరి. ఇట్లువానరయుద్ధంబు నేయుచు మహారాష్ట్ర సైన్యము తామేమియు నష్టపడకుండ శత్రుసైన్యమును మడియించుచుండిరి. కాని సిద్దిజోహా రేమాత్రమును వెనుదీయక కోటను తీవ్రముగ నేకమాసములుముట్టడించెను.

సిద్దీయు, తననావసైన్యముతో, కొంకణ తీరమున ననేకచోట్ల దిగి, కొంతవఱకు రఘునాథపంతుపై తనవాడిమఁగంటిమిఁజూపెను. వాడీయొక్క సావంతులును బాజీ ఘసల్కారును సమానముగఁ బెనంగుచుండిరి. పన్హాలాముట్టడి
1660. నాలుగు నెలలు సాగెను. శివాజీ తాను చేసిన పొరపాటును గ్రహించెను.
ఇక్కడ మరలమాయోపాయంబావసరమాయెను. శివాజీ, లోఁబడెదనని, సిద్దీజోహారునకు కబురుపంపెను. శతఘ్నులిరుప్రక్కల నిలిపివేయఁబడెను. శివాజీ, యొక బ్యాటరీదగ్గరకువచ్చి, సిద్దీజోహారుచే కలుసుకొనఁబడెను. సంధి చాలవఱకు సిద్ధమాయెను. కాని కొన్ని చిన్న చిన్న షరతులు తేల్చఁబడకుండ, సాయంకాలము పడువఱకును, శివాజీ కాలక్షేపము చేసెను. మరునా డుదయమున మాటలాడుకొనవచ్చునని, శివాజీ మరల కోటలోనికి పోనియ్యఁబడెను. బీజపూరు సైన్యమునిర్విచారముగ నిద్రించుచుండ, నర్ధరాత్రి శివాజీ కొందఱు మావలీముఖ్యులతో పహరాలను దాటి, యింకనాసంగతి యనుమానింపఁబడక పూర్వమే, రంగనాకోటకు రయంబునఁ బోవుచుండెను. ఈసంగతి తెలియగనే, ఫజిలుఖానుడును, సిద్దీజోహారుకుమారుడైన సిద్దీఉజీజును, యశ్వసైన్య పదాతులతో వెంబడించిరి. ఉదయము పొద్దుబోయినకొమ్మట, రంగనాకోటకాఱుమైళ్లదూరములోకాని, యతని వారుకలసికొనలేకపోయిరి. అచ్చట నొక కొండచరియయందు, శివాజీ తనపలాయనమును రక్షించుటకుగాను కొలది మావలీసైన్యమును బాజీపరభూ క్రిందనుంచెను. బాజీపరభూ, రోహిడాకోటను పట్టుకొని బందాలును చంపినపుడు పరాక్రమంబుజూపి, తరువాత శివాజీయొక్క యుద్యోగస్థుడైన, హారిదాసుమావలుయొక్క దేశపాండ్య. ఈతనివిషయమై యీవఱకు చెప్పఁబడియుండెను. స్వల్పసైన్యముతో, నితడు బీజపూరు సైన్యములో గొప్ప భాగమునెల్ల తనయజమానుడు సురక్షితముగ రంగనాకోటనుఁ జేరినట్లు ఫిరంగి ధ్వానములు సంజ్ఞగా వినువఱకును, నిలువఁబెట్టి యొడలెల్లగాయంబులతో సంగ్రామ రంగమున 'నాయుద్యోగమును నేనుచేసితి' వని సంతోషముతో వీరశయనమునొందిన మహావీరుడు. ఈ యుద్ధమును, గ్రీకుచరిత్రయందు ధర్మాపాలీ యుద్ధములోసమానంబుగ గౌరవించి, మహారాష్ట్రులెల్ల స్మరించుచుందురు. అట్లు

ఘాతశయ్యాగతుండైన మహావీరుని శరీరంబును, శత్రువులకు జిక్కకుండ, నతని సైనికులు గొనిపోయి సముచితదహన క్రియలఁ జేసి సంతసించిరి.

ఫజిల్ ఖాను రంగనా దగ్గరకువచ్చి యాగెను. సిద్దీజోహారువేసిన యెత్తంతయు చెడిపోయెను. అతఁడు, పన్హాలాముట్టడి జరుపుచుండవలెనో లేక రంగనాకుపోవలెనో, తెలియక యాందోళమందుండెను. సుల్తాను ఆశలన్నియు భగ్నములాయెను. జోహారు లంచముపుచ్చుకొనెనని, సుల్తాను కనుమానము కలిగి, యాదోషము నారోపించెను. జోహారోటమినొంది ఖిన్నుడైయున్నమీద, నీదోషారోపణకుకూడ సహింపక, కొంచెమగౌరవంబుగ ప్రత్యుత్తరమిచ్చెను. సుల్తాను స్వయముగ 1661 జనేవరులో సైన్యాధిపత్యమవలంబించెను. సిద్దీజోహారు క్షమాపణమాత్రముగోరి, రాజశిబిరంబుననున్న మంత్రులయొక్క దురాలోచనలకు భయపడి, యచ్చటికి రానొల్లక, కర్నూలునందు తన జాగీరునకు వెడలిపోయెను.

సుల్తాను పన్హాలాను మరల ముట్టడించి పట్టుకొనెను. ఆ చుట్టుప్రక్కల నున్న జిల్లాల యధికారులందఱును, ఇదివఱకు శివాజీకి లోఁబడినవారు కూడ కొందఱు, వచ్చి తమ రాజభక్తిని తెలియఁపఱచిరి. ఆ ప్రాంతములో రంగనా విశాలగడ కోటలు తప్ప తక్కిన వన్నియు సుల్తానునకు లోఁబడెను. తరువాత వానకాల మాసన్నమగుటచే సుల్తాను, తన సైన్యమంతటితోడను, కృష్ణానది యొడ్డుననున్న చిమూగ్లే యొద్ద, శిబిరం బుండెను. అచ్చటనుండి సిద్దీ జోహారు ననేక విధముల, గౌరవించెదననియు, రావలసినదనియు కబురు లంపెను. సిద్దీ జోహారును తుదకు రాజశిబిరమునకు వచ్చుటకు బలవంత పెట్టఁబడెను. అతఁడును గౌరవముతోఁ జూడఁబడెను గాని, అతని శత్రువగు ఇబ్రహీముఖాను సుల్తాను నొద్ద నధికారములో నున్నందున, సిద్దీ జోహారు, సుల్తానును నమ్మియుండుటకు ధైర్యము చేయఁజాలక, మరల కర్ణాటకమునకు పోవుటకు సమయము వేచియుండెను. కర్ణాటకములో నీ సమయమున ననేక చిన్న చిన్న తిరుగఁబాటులు జరుగుచుండెను. వాని నణచివేయుట కతడు పంపఁబడెను గాని యతడు మాత్ర మేమియు నందు విషయమై పనిచేయలేదు. కావున నతఁ

డును శివాజీతో సంబంధముఁ గలిగి రహస్యముగ విద్రోహులను ప్రోత్సాహము చేయుచున్నాఁడను, ననుమానము సుల్తానునకును మంత్రులకును కలిగెను.

శివాజీయు, నీ మధ్యకాలములో సుల్తాను నేమియు నెదిరింపకఁ బోరు నను, ఊరకుండలేదు. మహమ్మదీయులతో కలిసి యతనిపై కత్తికట్టియున్న మహారాష్ట్రదేశముఖులు కొందఱు తీక్ష్ణముగ దండింపఁబడవలసియున్నారు. రాజాపురము కొల్లపెట్టఁబడెను. ఈ సందర్భములో, పన్హాలా కోట ముట్టడి యందు సిద్దీ జోహారునకు మందుగుండు సామానును సప్లైచేసి నారను నను మానము మీఁద నచ్చటి యింగ్లీషు ఫాక్టొరీ యుద్యోగస్థులలో ననేకమంది రెండు సంవత్సరముల వఱకు నొకకొండ కోటయందు బంధింపఁబడిరి. మహారాష్ట్ర పోలిగారగు దళ్వే యోడింపఁబడి, యుద్ధమునందు చంపఁబడెను. అతని ముఖ్యపట్టణమగు శృంగారపురము కొల్లపెట్టఁబడెను. ఫత్తేఖానుయొక్క ముఖ్య పట్టణమగు దండారాజపూరు పట్టుకొనఁబడెను. ఆ రేవునకు మధ్యనున్న జింజీరా ద్వీపమునకును ఫిరంగు లెక్కుపెట్టఁబడెను. కాని కావలసి నన్ని ఫిరంగులు లేకపోవుట వలనను, వానిని బాగుగ నుపయోగించువారు లేనందునను, కోటపై తగినంత దెబ్బ తగులలేదు. ఇంతలో బీజపూరుతో మరలఁ గలిసికొనవలసి వచ్చెను.

ఇంత యుద్ధకల్లోల సమయములను గూడ, శివాజీ తనయొక్క మత సంబంధమైన కార్యములను విడిచియుండలేదు. తుల్జాపురమునందలి భవానీ దేవిని గొలుచుట కా దేవళము బహుదూరంబున నుండుటవలన, నతఁడు ప్రతాప గడయందు మఱియొక భవానీ దేవాలయమును గట్టించెను. అతఁడు మహా పురుషునిగా గొనిన రామదాసుస్వామి యుపదేశంబులతో తఱచుగ నితర సమయముల యందు ప్రొద్దు పుచ్చుచుండెను.

శివాజీ బాజీఘోరేపురే పై పగఁదీర్చుకొనుట.

సిద్దీ జోహారు యెడల ననుమాన గ్రస్తుఁడై, యట సుల్తాను స్వయముగ కర్ణాటకమునకుఁ బోవుచు, మహారాష్ట్రమందు బాలోలుఖానును, మథోలు

దేశముఖుఁడగు బాజీఘోరేపురేను, శావంతుల సహాయముఁగొని, శివాజీపై దండు వెడలుటకు నియమించెను. ఈ సంగతి చెవినిబడినతోడనే, శివాజీ విశాలగడకు వచ్చి, ఘోరేపురే మధోలు గ్రామమునం దజాగ్రతగ నుండెనని చారుల వలనఁ దెలిసికొనినవాఁడై, హఠాత్తుగ నచటి కరిగి ఘోరేపురేను కుటుంబ పరివార సహితంబుగ హతంబు గావించి, మధోలు నగ్నిదగ్ధంబు నేసి, తనతండ్రి కతఁడు చేసిన యపకారంబునకు పగదీర్చుకొని, శీఘ్రంబుగ మరలి వచ్చి విశాలగడ చేరెను.

బాజీ ఘోరేపురేకు బదులుగా కవాసుఖానుడు నియమింపఁబడెను. కాని కర్ణాటకమునందు సిద్దీ జోహారు, సుల్తానుచే నమ్మఁబడక తఱచుగ నవమానింపఁబడుటచే, చిట్టచివరకు బహిరంగముగ నాతఁడెదురు తిరిగినందువలన శివాజీపై యుద్ధముచాలించి యచ్చట సేనలన్నియు కర్ణాకమునకు రప్పింపఁబడెను. సిద్దీ జోహారు తరువాత యోడింపఁబడి, యతని యనుచరులవలననే, రాజానుగ్రహమును సంపాదింపఁ గోరిన వారిచే, చంపఁబడెను. కర్ణాటకమందు రెండుసంవత్సరములపాటు కాలంబు గడిపి, విశేషమేమియును లేక సుల్తాను బీజపూరు చేరెను.

కాని శివాజీ పైకి మొదటఁబంపఁబడిన బీజపూరు సైన్యములు కర్ణాటకమునకు మరల్పఁబడినతోడనే, శావంతులును దళ్వేలును నిస్సహాయులై, శివాజీ యాగ్రహమున కాహుతులైరి. వారి దేశమాక్రమింపఁబడెను. వారు గోవాకు పోయి శరణుఁజొచ్చిరి. పోర్చుగీసువారు శివాజీకి వెరచి వారిని తమదేశమునుండి పంపివేసిరి. అట్లన్నిదిక్కులను హతాశులై, శరణాగత రక్షకుండును, దేశోద్ధారణ కార్యాదురంధరుండును, స్వజాతీయుండునైన శివాజీ యనుగ్రహంబును వారు వేడుకొనిరి. వారి దేశముఖులు వారి కుంచఁబడెను. శివాజీ యొక్క యుద్యమంబున కింతవఱకువచ్చిన తరువాత వారును లోఁబడిరి. ఈ దక్షిణ కొంకణమునుండి తీయఁబడిన కాల్బలము శివాజీకెంతయు నుపయుక్తమయ్యెను. కాని శివాజీ తన స్వంతసైన్యములను శావంతువాడీ యందుంచి వారి కాల్బలమును దూరమునకు గొనిపోవుచుండెను.

అట్లు జంజీరాతప్ప తక్కిన కొంకణమంతయు తన స్వాధీనమైన పిమ్మట, శివాజీ యోధ సైన్యముకూడ సిద్ధముచేయించెను. ఓడ సైన్యమువలన సిద్దీ పొందుచున్న లాభముఁజూచి, యితడు నా ప్రకారము చేసెను. బొంబాయికి దక్షిణమున 20 మైళ్లదూరమున నున్న కొలాబాను బాగుచేయించి, దృఢముగ ఘరలగట్టించి, యతని నావాసైన్యమునకు ప్రధాన రేవుస్థానముగఁ జేసికొనెను. సువర్ణదుర్గ మొదలయిన రేవులందు నావలను చేయింప మొదలుపెట్టెను. ఇతని నావాసైన్యమున కధిపతులు, దరియాసరంగను మహమ్మదీయుఁ డొకఁడును, మైనాక భండారీ యనునొక పల్లెకారియునై యుండిరి. ఈ నావలతో, సముద్రంబుపై కూడ యోడలను దోచుకొన, నతఁడు ప్రారంభించెను. పోర్చుగీసు లీ దాడి కోర్వఁజాలక అతనికి ఫిరంగులను మందుగుండు సామానుల నిచ్చు షరతుమీద సంధిచేసికొనిరి.

ఇట్లు బీజపూరు రాజ్యము నందలి మహారాష్ట్రప్రముఖులందఱు నతని నాశ్రయింప, నతఁడు భూసముద్రంబులపై బలపరాక్రమ సంపన్నుండై, యధిక తేజోవంతుఁడై యుండ, బీజపూరు రాజ్యంబు నిర్వీర్యంబగుచుండె. అంత శివాజీయొక్క రాజకీయ జీవితంబునందు రెండవ భాగము సమాప్తమగు తఱికి, బీజపూరు సుల్తాను, అబ్దుల్ మహమ్మదను మంత్రి యుపదేశంబున, నతనితో సమాధానంబు నొందఁ జేయిసాచెను. ఈ సమాధానముయొక్క షరతు లేమో తెలియవు. కాని, యీసమయంబుననే, షాజీ, తన కుమారుఁడగు శివాజీ మధోలు దేశముఖుని కడ తీర్చి, చేసిన పితృవాక్య పరిపాలనంబున కెంతయు సంతసించి, తన రెండవకుమారుఁడగు వెంకాజీతో కూడ సుల్తాను అనుజ్ఞఁగైకొని, యతనిఁ జూడవచ్చెను. శివాజీయు, తండ్రిరాకవిని, యనేక మైళ్ల దూర మెదురేగి, గుఱ్ఱముదిగి తండ్రికి నమస్కరించి, యాశీర్వాదంబుఁ గైకొని, యతని పల్లకిప్రక్క పాదచారుఁడై నడచివచ్చి, తన రాజధానిలోనికిం గొనిపోయెను. షాజీయు, సంతోషంబున కొన్ని వారంబు లచ్చటఁ గడపి, తరువాత కుమారుని రాజ్యములో ననేకస్థలంబులఁజూచి, ప్రహృష్ట హృదయుండై, యనేక బహుమానంబులను తానుగొని, మఱియు ననేక బహుమానంబులను తన సుల్తానునకుఁ బుచ్చుకొని, తిరిగి బీజపూరునకు వచ్చెను.

శివాజీయొక్క రాజకీయ జీవితము యొక్క మొదటిభాగ మంత మొందు నప్పటికి, కుమారుని దుండగములచే షాజీ ఖైదు నందుండుటయు, రెండవభాగ మాఖరగు వఱకు, షాజీ, స్వతంత్రరాజ్య ప్రతిష్ఠాపనాశాలియైన కుమారుని రాజ్యంబు చూడవచ్చి, సుల్తానునకును కుమారునకును సమాధానములు కుదుర్చు మధ్యవర్తియగుటయు, చదువరులకు చిత్రంబుగఁ గానంబడక మానదు.

షాజీయొక్క సలహావలననే, శివాజీ, తన రాజధానిని రాజగడనుండి రాయరీ దుర్గమునకు మార్చి, దానిని రాయగడమని మార్చెను. ఈకోటయందు తన కచేరులను, తన యుద్యోగస్థులకు భవనములను కట్టించవలయునని, అతఁడా పనికి ఆబాజీ సోనదేవుని నియమించెను. ఇకను కోటబలముగ నుండి యజేయ మగుట కనేక కట్టుదిట్టములు చేయఁబడెను.

ఈ సమయమునకు, శివాజీ కళ్యాణమొదలు గోవావఱకున్న కొంకణ మంతయు,ఘాట్మాతాను భీమనదినుండి వరుణానది వఱకును కలిగియుండెను. ఈ దేశముయొక్క పొడవు సుమారు 160 మైళ్లుండును. వెడల్పు సోపాకును జింజీరాకునుమధ్య సుమారు 100 మైళ్లుండును. ఇతని సైన్యమిప్పటికి 50,000 కాల్బలమును 7000 గుఱ్ఱపుదళమునని చెప్పఁబడుచున్నది. బీజపూరుతో సంధి,యతని బలమును మొగలులపైఁ ద్రిప్ప, నతని కనుకూలమిచ్చెను.

ప్రకరణము. 9.

శివాజీయొక్క రాజకీయ జీవితములో మూఁడవ భాగము.

(1662—1672.)

ఔరంగజేబు బిజపూరును ముట్టడింపఁ బోయినప్పుడొక్కసారిమాత్రము, 1657 సం॥ మున జూనారుపై, శివాజీ దాడివెడలి యుండెను. అటుపిమ్మట 1662 సం॥ మున బీజపూరుతో సంధిచేసుకొనువఱకును, శివాజీ మొగలులపైఁ బోవుట కవకాశములేని వాఁడాయెను. 1661 సం॥ మున, మొగలులు కళ్యాణబీమిరీని వశముచేసికొని యున్నను, శివాజీయెదిరింప సమర్థుడుకాఁడాయెను. కాని యిప్పుడు కాల్బలంబు మోరోపంతుక్రిందను, అశ్వసైన్యము నేతాజీ పల్కారు నాధిపత్యము క్రిందను, శివాజీమొగలులపై సన్నాహంబు చేసెను. మోరోపంతు జూనాను కుత్తరముననున్న యనేక దుర్గంబులను వశము చేసికొనెను. నేతాజీ వర్షకాలము గడచినతోడనే గ్రామంబుల కొల్లఁబెట్టి, పట్టణంబులనుండి కప్పంబులుగొని, ఔరంగబాదు పఱకును దేశంబులనెల్ల నూడ్చివేసి, నలుదిక్కులదేశమును భయకంపితంబుగ నొనర్చి శీఘ్రగమనంబులతో నెక్కడ చూచినఁదానైయై, అప్రతిహతంబుగ పూనావచ్చి చేరెను.

షయిస్తఖాను శివాజీపై యుద్ధమునకు వచ్చుట.

ఔరంగజేబుయొక్క మేనమామయగు షయిస్తఖానుఁడు, కుమారుఁడగు సుల్తాను మోఅజముకు బదులుగా, అమీరుల్ఉమ్రావుఅను బిరుదుతో, దక్కనునకు యువరాజుగా నియమింపఁబడి యాసాహస దండయాత్రకు శివాజీని శిక్షించి యతని కోటలన్నియు వశముచేసికొనుటకు చక్రవర్తిచే ననుజ్ఞాతుండయ్యెను.

షయిస్తఖానుఁడును విశేషసైన్యసమేతుండై, ఔరంగబాదునుండి బయలుదేరి, అహమ్మదునగరము పైరుగాము మీఁదుగ రాజమార్గ మవలంబించి,

యచటినుండి పశ్చిమముగ పూనాకుఁ దిరిగెను. మార్గమున సోపాను వశముచేసి కొనుటకు కొంతసైన్యమంపి తానుమాత్రము పూనానాక్రమించుకొనెను. కోటలన్నియు శోధించుటకు మూకలనంపెను. పూనాకును జూనారునకును మధ్య చాకునుకోట యున్నందున దాని సాధింప నుద్దేశించెను. షయిస్తఖానుఁ డా చిన్నకోట, పిలువగనే లోఁబడునని తలంచెనుగాని, యచ్చట 1648 వసం॥ము నుండియునున్న శూరాగ్రేసరుండు ఫిరంగోజీనర్సాలా రెండునెలలవఱకు మొగలు సైన్యమునంతయు నదలించెను. చిట్టచివర కొక పెద్దరంధ్రము, చేయఁబడెను. మొగలుసైన్యము దొమ్మియుద్ధమునకు దొరకొనెను గాని మిగిలిన కావలిసైన్యము హావల్దారుతోడ నారంధ్రమునొద్ద యద్భుతరక్షణనొనర్చిరి కాని యొకదినమట్లుచేసి రెండవదినములోఁబడిరి. షయిస్తఖాను ఫిరంగోజీని మెచ్చుకొని గౌరవించి, చక్రవర్తిసేవకురమ్మని ప్రోత్సాహపెట్టెను. కాని యతఁ డార్జించిన ఖ్యాతి నవమానించుకొనుట కతఁడియ్యకొనలేదు. షయిస్తఖానుఁడతని గౌరవంబుతో సెలవిచ్చిపంపెను. అతఁడును శివాజీనిచేరి సత్కరింపఁబడెను.

మొగలు లొక్క కోటను జయించుట, కింతకాలమై, 900 సైన్యనష్టము కలిగెను. షయిస్తఖాను మహారాష్ట్రకోటలను జయించుట కష్టసాధ్యమని మనంబున భావించెను. చక్రవర్తిమాత్ర మంత సులభమైనపని యింకొకటిలేదని తలంచుచుండెను. తరువాతకూడ చాలకాలము వఱకు మహారాష్ట్ర శత్రువుల యెడల నాతున చాలనిర్లక్ష్యభావముఁ గల్గియుండెను. అయినను జూద్పూరు రాజగురాజాజస్వంతసింగును చాలసహాయసైన్యముతో షయిస్తఖానును గలియుటకు చక్రవర్తి యాజ్ఞయిచ్చెను. ఆయన సైన్యమువచ్చుసరికి *సదృతువులు చాలవఱకుఁ గడచెను. అంత పర్యంతమును మొగలు సైన్యమంతయు నిరుద్యోగంబున పూనాయందు విశ్రమించియుండెను.

నేతాజీ పాల్కారు మాత్రము మరల, ఔరంగబాదు అహమ్మదు నగర ప్రాంతముల, ప్రళయ కాలానలంబు భంగి దహించుచు, కొల్లఁగొట్టుచు సంచ

* సదృతువు లనగా యుద్ధమున కనుకూలమైన ఋతువులు. వర్ష ఋతువులు కాక తక్కినవి.

శించెను. అతని నడ్డగింప నొకసైన్యము పంపఁబడెను. ఇదియు నతని సైన్యమును కొంతవఱకుఁ బరిమార్చి తఱిమెను. నేతాజీయు దెబ్బతిని పట్టువడెడివాఁడే గాని, బీజపూరు సైన్యాధిపతియగు రుస్తుముజామా నతనిఁ దప్పించుకొననిచ్చెనని తలంపఁబడెను.

షయిస్తఖానుయొక్క పరాభవము.

షయిస్తఖానుఁడు, శివాజీ జీజాబాయిలకొఱకు దాదోజీ కొండదేవుఁడు కట్టించిన యింటియందు, బసచేసి యుండెను. ఈతఁడు పూనా చేరగనే, శివాజీయు రాయగడనుండి సమీపముననున్న సింహగడకు వచ్చియుండెను. శివాజీ దగ్గరనుండెనను భయముచే ఖాను తీసికొనవలసిన జాగ్రత్తలన్నియుఁ దీసికొనెను. అట్లు తీసికొనఁబడిన జాగ్రత్తలు, సాధారణముగ వేనిని రాకుండ నడ్డగింపఁ దలంపఁబడెనో, వాని నాహ్వానము చేయును. ఆయుధపాణుఁడగు మహారాష్ట్రుఁ డెవ్వఁడును ఆజ్ఞాపత్రము లేనిదే పూనాలోనికిఁ రాఁగూడదు. మహారాష్ట్రి యాశ్వికుఁ డెవ్వఁడును, చక్రవర్తి యొద్దనుండి స్వయముగ జాగీరుల పొందినముఖ్యుని యధికారము క్రిందగాని మరి యెవరి క్రిందను నియమింపఁబడ రాదు.

శివాజీ, యీసంగతుల నెల్లకనిపెట్టి, ఖానుని హఠాత్తుగ ముట్టడింపఁ దలఁచి ముందు ఏర్పాటులను చేయుట కిద్దఱు బ్రాహ్మణులను పంపెను. వ్యవహారములన్నియు నేర్పాటయిన పిమ్మట నొకనాఁడు సూర్యాస్తమయ మయిన తరువాత ఏప్రిలు నెలలో శివాజీ, సింహగడనుండి కొంతమావళీ కాల్బలముతో బయలు వెడలి, మార్గము పొడుగునను గుంపులుగుంపులుగా వారి నచ్చటచట నిలిపి, యశాజికంకు, తానాజీ మాలుసూరే మఱి 25 గురుమావళీలతో పట్టణము ప్రవేశించెను. అతని రాయభారులు, ఖాను సేనలోనున్న నొకపదాతి భటునితమ పక్షమునకు తీసికొని, వివాహము మిషమీద నూరేగింపు చేసికొనునపుడు, బాజాలువాయించుకొనుటకును, కొందఱు స్నేహితులాయుధములతో బయలు దేరుటకును వానిచే సెలవుఁ గైకొనునట్లు చేసిరి. పూనా బహిరంగమైన పట్టణముగాఁగన, శివాజీ తన యనుచరులతో రహస్యముగ నా సందడిని గుంపులో చొరఁబడెను.

పట్టణమెల్ల చాటుమణిగినపిమ్మట, శివాజీయు నతని సహచరులును, ఖాను భవనముతో పరిచయులై యుండుటవలన కొన్నిగొడ్డళ్లతో వంటయింటికి పైనున్న కిటికీ నూడబెరకి తద్ద్వారా లోనికిఁ బ్రవేశించిరి. ఇంతలో నీధ్వనికి కొందఱు స్త్రీలకు మెలకువవచ్చి వారు ఖానును లేపించిరి. షయిస్తఖాను కిటికీ మార్గమున క్రిందికి దుముకఁ బ్రయత్నించుచుండగా వారి ఖడ్గ మాతని చేతి వ్రేలు నొక్కదానిని నఱికివేసెను. అతని కుమారుఁడగు అబ్దుల్ ఫత్తేఖానును మఱికొందఱు కావలివాండ్రును వారిచే హతులైరి.

శివాజీయు నతని యనుచరులును, అడ్డగింపఁబడక పూర్వమే, సింహగడమార్గము పట్టి, మార్గమున నున్న తమ గుంపులను ప్రోగుచేసికొనుచుఁ బోవుచుండిరి. అట్లు మూఁడు నాలుగు మైళ్లదూరము పోయిన తరువాత, తమ సంఖ్యను గూర్చి యనుమానమును కలుగఁజేయుటకును, తమ నిర్భయమును తిరస్కారభావమును తెలియఁజేయుటకును,అంతకుపూర్వమే సిద్ధముచేసిన కాగడాలను వారు వెలిఁగించిరి. ఇట్లు మొగలు శిబిరమునకు కనుబడుచు, కోటనెక్కిరి.

అప్పుడు శివాజీయొక్క యీ కార్యమునకు మహారాష్ట్రులందఱును మెచ్చుకొని యానందింపఁ దొడఁగిరి. మఱునాఁ డుదయమున మొగలు సైన్యము కోటమీఁదకు పరువెత్తికొని వచ్చెను. వారట్లు నగారాలు వాయించుకొనుచు, ఖడ్గంబులఁ ద్రిప్పుకొనుచు, గర్వంబున నొడలెఱుంగక వచ్చుచుండగ వారినెల్ల కోట సమీపమునకు రానిచ్చి, యంతట శివాజీ తన ఫిరంగుల ప్రయోగింప నాజ్ఞనిచ్చెను. వారెల్ల గల్లంతుపడి పలాయనంబు కాఁజొచ్చిరి. నేతాజీ పల్కారుచే మార్గమున కొకప్రక్కను కొంతగుఱ్ఱపుదండుతో నుంచఁబడిన కార్తోజీ గుజరు,పలాయనంబగుచున్న మొగలు సైన్యముపై హఠాత్తుగఁ బడి, వారి యవమానంబును పలాయనంబును సంపూర్ణముఁ జేసెను.

షయిస్తఖాను, కుమారుఁడు పోయినందుకును, సులభముగ నవమానింపఁబడినందుకును, మనోధైర్యముచెడి, యుద్యోగస్థున కుండవలసిన ధీరస్వాంతము లేనివాఁడై, జస్వంతసింగుపై దోషారోపణలచేయ నారంభించెను. జస్వంతసింగు, శివాజీయొద్ద లంచము తినెననియు, నశ్రద్ధగ పనిచేయుచున్నాఁడని

యును షయిస్తఖాను వర్తమానమంతయు చక్రవర్తికిఁ దెలియఁజేసెను. ఖాను రొంకట దురవస్థయు, జస్వంతసింగునకును అతనికిని గల భేద భావమును ఔరంగజేబు కాశ్మీరముపై నరుగ సన్నద్ధుఁడై యున్న సమయమునఁ దెలిసెను. అతఁడు షయిస్తఖాను నచ్చటినుండి పిలుపించి బెంగాలునకు నియమించి తనకుమారుఁడగు సుల్తాను మోఅజమును రెండవసారి దక్కనునకు వైసరాయిగ నియమించి, జస్వంతసింగు నతనిక్రింద పనిచేయుమని యాజ్ఞాపించెను.

జస్వంతసింగు సింహగడమును చుట్టుముట్టెను గాని ముట్టడిని జరుపలేదు. చాకన్ జూన్నారులయొద్ద దృఢబలంబుల నిలిపి ప్రధానసైన్యమంతయు నౌరంగబాదునకు సింగుచేరిపించెను.

సూరతును కొల్లపెట్టుట.

శివాజీ, తన యుద్దేశములను గూర్చి, యెప్పుడును యబద్ధపు వార్తలను ప్రచురము చేయుచుండెడివాఁడు. కళ్యాణయొద్ద కొంతసైన్యమును, దండా రాజపూరునొద్ద కొంతసైన్యమునునిలిపి, పోర్చుగీసువారి దేసము మీఁదనో లేక సిద్దీమీదనో దాడి వెడలునట్లు నటించుచు, తన ప్రధానగూఢచారియగు బైరిజీ నాయకుని సూరతు విశేషములఁ గనిపెట్టుటకుఁ బంపెను. నాసిక పుణ్యక్షేత్రమును సేవించుటయు మోరోపంతువలన నుత్తర
1664 మున క్రొత్తగపట్టుకొనఁబడిన కోటలను పరీక్షించుటయు నను
జనేవరి 5 మిషమీఁద శివాజీ బయలుదేరి, ఇంకను దేవతాసందర్శనాది కృత్యములఁ బ్రొద్దుపుచ్చుచుండెనని జనులుతలంచియుండ, 4000 గుఱ్ఱపుదళములో నప్పుడే శీఘ్రంబుగ సూరతుపట్టణమునకేగి ఆఱుదినములు నిరాటంకముగ కొల్లఁగొట్టెను. అచ్చట లభించిన యమూల్యధనంబును విశ్రాంతిగ రాయగడచేర్చెను. ఇంగ్లీషుడచ్చిఫాక్టొరీలవారు కొందఱు పట్టణస్థుల ధనమునుకూడ నీసమయమున కాపాడిరని తెలియవచ్చుచున్నది. సూరతు పట్టణమున కప్పటికి చుట్టును మట్టిగోడ మాత్రమేయున్నది. తరువాత రాతిగోడ కట్టఁబడినది.

శివాజీ తిరిగివచ్చిన తరువాత, తుంగభద్రానది యొడ్డున బసవపట్టణము దగ్గిర వేటాడుచున్న సమయమున గుఱ్ఱముమీదనుండిపడి యతనితండ్రి పరలోకగతుఁడైనట్టు, వర్తమానమునువిని నెను. షాజీ బీజపూరుసంస్థానమునే చిట్టచివర వఱకును నాశ్రయించియుండెను. ఈయనచనిపోవునప్పటికి బీజపూరుచే మొదట నియ్యఁబడిన జాగీరుమాత్రమే గాక, ఆరణికోట, పోర్టునోవో, తంజావూరు సంస్థానముఁగూడ నుండెను.

శివాజీ సింహగడమందు కొంతకాలముండి తండ్రికి నుత్తరక్రియల నుచితంబుగ జరిపి రాయగడకువచ్చి, తన ముఖ్యయుద్యోగస్థుల యాలోచనతో రాష్ట్రవ్యవహారంబులను సవరించి యనేక నూతన యేర్పాటులనుఁ జేసెను. ఈసమయముననే మొట్టమొదట శివాజీ రాజాబిరుదును వహించి, తన పేరున నాణెంబులచ్చొత్తించెను.

నేతాజీ, మామూలుప్రకారము, వర్షకాలమాసన్నమగుటకుముందు, అహమ్మదునగర ప్రాంతములకు వచ్చి మొగలుదేశమును కొల్లఁబెట్టెను. శివాజీయొక్క నావాసైన్యము, మెక్కాకుపోవుచున్న యోడలను పట్టుకొని, యందలి భాగ్యవంతులగు యాత్రికులయొద్దనుండి విస్తారధనమును పణంబుగఁ గొనెను. తరువాత అహమ్మదు నగరముయొద్ద పెట్టాను, శివాజీకొల్లఁబెట్టి, దండయాత్రల సారంగబాదు వఱకును నడిపెను. ఇతఁడు లేనిసమయమున బీజపూరు సైన్యము కొంకణమును మరల సంపాదింపవలెనని ప్రయత్నించెను. కాని సర్వవ్యాపియు సర్వసిద్ధుండైన శివాజీ యచ్చట ప్రత్యక్షమై ఆయువేల బీజపూరు సైన్యమును హతముఁ గావించెను. తన సైన్యముపై తిరుగఁబాటుఁజేసిన వింగోర్లా వాసులను శివాజీ శిక్షించి మొగలు సైన్యముయొక్క నడకలను గమనించుటకు సింహగడకు మరలివచ్చెను.

శివాజీయొక్క నావ దండయాత్ర.

మొగలులు, జావారునకు మాత్రము కొంత సైన్యమును రక్షణకుఁ బంపుకొనిరి. శివాజీపై వారు దాడి వెడలుట కుద్దేశింప నందున, శివాజీ నావికా యాత్ర కొకటిన్వయముగ నడపెను. మొగలు శిబిరమును ముట్ట
1665 డింతు నని యొక వదంతి వేసి తాను ఓడ ప్రయాణయారంభ

85 ఒంటితెఱ చాపగలయోడలును, 3 మూఁడు చాపలుగల పెద్దయోడలును శివాజీ తీసికొనివెళ్లెను. మాల్వానుదగ్గిర బయలుదేరి గోవాకు క్రింద 130 మైళ్ల దూరముననున్న బార్సిలోరు పట్టణముచేరి యచ్చటినుండి వెనుకకుతిరిగి 4000 మంది సేనతో గోకర్ణముచేరి యచ్చట స్వామి నారాధించుకొని, సైన్యమును చిన్నచిన్న వ్యూహములుగఁ జీల్చి సమీపముననున్న పర్వత స్థలములయందు కప్పముఁగొని, చాలసైన్యమును భూమార్గమునఁబంపి తక్కిన సైన్యముతో తాను నావారూఢుండై రాయగడ వచ్చిచేరెను.

ఈ ప్రయాణమున, గాలి కొంత ప్రతికూలమై యతనిని తీరమున క్రిందికి కొట్టివేసెను. అతని కులదేవత యీ ప్రయాణముమీఁద నసమ్మతి నిట్లు కనుబఱచెనని చెప్పుదురు. అతఁడు స్వయముగ నడపిన యోడదండయాత్ర యిది యొక్కటియే.

ఎదురుగాలికంటెను, సముద్రఖేదముకంటెను, భయకారణమింకొకటి యతనికొఱకు వేచియుండెను. మిర్జా రాజా జయసింగును, డిల్లిరు ఖానుఁడును ఔరంగజేబుచేఁ బంపఁబడి, గొప్పసైన్యములతో నతనిపై పయనమైరి.


ఔరంగజే బెన్నిదుండగములకైన నోర్చెనుగాని, మెక్కాయాత్రికులను కొల్లఁబెట్టెనని వినినంతనే యిఁక శాంతమున నుండలేకఁబోయెను. ఇంతవఱకును తన రాజత్వము తిన్నగ క్షేమమున లేకపోవుటచేతను, తండ్రిజీవించియున్నందున నేమి యపాయము తనకు జరుగునో యనుభయముచేతను, తన కుమారులెవ్వరైన తనవలెనే రాజ్యమును లాగుకొందురేమో యను ననుమానముచేతను, అతఁడు దూరమున కెవ్వరినియు నమ్మి, తగినంత సేననుఁబంపి శివాజీని సాధింపడాయెను. ఈ భయమే యతని చర్యలన్నిటికిని మూలకారణమై చివరవఱకును కనుపడును. కాని యింతవఱకును ‘కొండయెలుక’ యని యలుసుగఁ బలుకుచుండిన శివాజీ, నేడు మొగలు పర్వతము నడఁగునంతయు దోలుచుటయేగాక తన మతవిద్వేషమునుకూడఁ బురికొల్పెనుగాన నిఁక వాని మట్టుపెట్ట కాల మాసన్నమైనదని తలంచెను. ఇప్పటికైన నతని యుద్దేశము పూర్ణముగ

శివాజీ నణఁచుట కాదాయెను. శివాజీ నణఁచునంత సైన్యమును, జయసింగు డిల్లిరు ఖానుల నమ్మి, యొప్పగింపఁగలవాఁ డతఁడు కాదాయెను.

ఈ జయసింగు డిల్లిరుఖానులు, మొట్టమొదట దారా పక్షమువహించి, తరువాత నౌరంగజేబుచే తీసికొనఁబడినవారు. చక్రవర్తి జయసింగును పూర్ణముగ నెప్పుడును నమ్మియుండలేదు. డిల్లిరుఖాను పూర్వము దారా పక్షపాతి యగుటవలనను, ధైర్యవంతుఁడగుట వలనను, అతని దేశస్థులగు పఠానులందు మంచిపలుకుఁబడి గలవాడగుట వలనను, ఔరంగజేబు అనుమానముతో నతనిఁ జూచుచుండెడివాఁడు. ఈ గొప్పయోధుల నిద్దఱను దూరమున తనకు పరిచయమైన దేశములో కఠినమైనపని కుపయోగింప చక్రవర్తి మేలని యాలోచించెను. శివాజీ నోడించుటయు, బీజపూరు గోలకొండలనుండి వెనుకఁబడిన పేష్కషులను రాబట్టుటయు, వీరి యుద్యోగమై యుండెను.

జయసింగుయొక్క గుణవర్ణన.

జయసింగు 1605 వ సం॥ మున జన్మించి మోగలు సైన్యములో నతని 12 వ యేటనే యుద్యోగమును సంపాదించెను. అప్పటినుండియు చక్రవర్తి జెండాక్రింద నుత్తరమున మధ్య ఆసియాలో బాకు వద్దనుండి దక్కనులో బీజపూరు వరకును, పశ్చిమమున గాంధారమునుండి తూర్పున మాంఘీరువఱకును, సుప్రసిద్ధ రణరంగములందుఁ బోరాడెను. షాజహానుయొక్క దీర్ఘమైన పరిపాలన కాలమంతయు నొక్కసంవత్సరముకాని యతఁడే రంగమునసైన ఖ్యాతిఁ జెంది యుద్యోగమున నభివృద్ధి నొందనిదిలేదు. హిందూదేశమునకు వెలుపలఁ గూడ జరుపఁబడిన యుద్ధములందు, రాజవంశీయులచే నడుపఁబడు మోగలు సైన్యములలో సహితము, సైన్యముఖమునకో, లేక సైన్యపక్షమునకో యతఁ డధిపతిగ నియమింపఁబడుటనుఁ బట్టియే యతని సామర్థ్యము తేటపడఁగలదు. అటుపిమ్మట నతఁడు ప్రధానసైన్యాధిపతిగనే నియమింపఁబడుచువచ్చెను. రణరంగముల విజయములకంటె రాజతంత్రమువం దాతని విజయములు తరువాత ప్రసిద్ధికెక్కెను. ఎచ్చటనైన కఠినంబును మూర్ఖంబును నగు కార్యమున్నయెడల చక్రవర్తి, జయసింగుదిక్కునకు మొగము ద్రిప్పవలసియుండెను. రాజనీతి



శివాజీ రామదాసస్వామికి రాజ్యమర్పించుట. 118

నులు, బలవంతులగు శత్రుమండల మధ్యంబున ప్రతికూలంబులతోఁ బెనఁగి యతఁడు సంపాదించెను. చిట్టచివరకు, అతఁడెంత గొప్పవాఁడయ్యె ననఁ, నతని రక్షణను యురోపియను వర్తకు లాశ్రయించిరి, అతని స్నేహమును బీజపూరు గోలకొండనవాబులు సుంకమిచ్చి సంపాదించుకొనిరి. దానినే దక్కను మొగలు యువరాజు ఆతురతతో నెదురుచూచుచుండెను. అతని వైరమును ఢిల్లీలో మయూరసింహాసనాసీనులగు రాజాధిరాజులుగూడ భయముతో జూచుచుండిరి.

అతఁడు తన నామము, బుద్ధిమంతుడును, గుణనిధియును, దయాస్వాంతుడు నగు ప్రభువునకు పర్యాయపదం బగునటులను, రామచంద్రుని పరిపాలన స్మరణకు వచ్చునటులను, తన యధికారంబు నుపయోగించెను. హిందూ మహమ్మదీయ మతంబులు సమానంబుగ నతని రక్షణయందు ప్రవర్ధమానం బాయెను. ఏలనన, నతని వర్తనలనెల్ల పోషించు పావన దైవభక్త్యామృత వాహిను లాతని విశాలహృదయమున సర్వదా ప్రవహించుచుండెను. అతఁడు సింహాసన మలంకరించినను, యజమానుండును యథార్థంబుగ ప్రభువునైన పరమేశ్వరుని సేవకుఁడుగా తనను తలంచుకొనుచుండెను. ఒకదినమున రాజ్యమునంతను, సన్యాసియు సిద్ధపురుషుఁడు నైన రామదాసునకు ధారవోసి, యతనిచే యతని ప్రతినిధిగ రాజ్యమేల ననుజ్ఞాతుండాయెను. ఈ రాజ్యాధికారం బాతనికి స్వేచ్ఛావాంఛలనుఁ దీర్చుకొనుటకుకాదు, భౌతిక భోగంబు లనుభవించుటకు కాదు, అంతేఁగాక ప్రపంచ డంబాచారంబులను గడపుటకును గాదు, అది యాయనకు విధ్యుక్తమైన ధర్మము, కఠినమైన యాత్మనిగ్రహము, మనస్సాక్షి నియంత్రితమైన యుద్యోగము. అతఁడు చేసిన ప్రతికార్యమునందును,

తే.గీ॥ మేటియజమానుకనుదృష్టి మెలగునటుల,

వర్తించు చుండెడివాఁడు. అతఁడు సామ్రాజ్యముయొక్క మూలంబగు నొక బలసమన్వితమైన రాజ్యమును ప్రతిష్ఠించెను. అంతేఁగాక చెదరిపోయి శ్రుతిఁదప్పిన యంగంబులనుండి, వేరెవ్వరును స్వప్నమునందైనఁ దలంచియుండని కాలమున, నొక్క జాతిని సృష్టించెను. నిర్జీవధూళిపటలంబునుండి యతఁడు తన జాతిని లేవఁదీసెను. అతని మహాస్పర్శ తగిలినతోడనే జనులలోనున్న గొప్ప

తనం బాకర్షింపఁబడి, వారాత్మవిశ్వాస శౌర్యరసపూరితులయ్యెడివారు. అట్లు నూటయేఁబది సంవత్సరములు, వారి రాజదండంబు చేతినుండి పడిపోవువఱకును, నాతని స్మరణయేవారిని జయశీలురుగఁజేసెను. అట్లుచరిత్రసిద్ధమైన యమూల్య పైతృకంబుగ నతనిస్మరణను వారింకను దలంచుటయందేమి యాశ్చర్య మున్నది? అతనినామమింకను;

సీ॥ జనులయాశప్రాపు జగతికోరికపట్టు

గ నుండుటయందేమి యాశ్చర్య మున్నది ? అతఁడు, చేసినకార్యములందే గొప్పవాఁడైనను, అతని 52 సం॥ ల జీవితమునందును తరువాతివారికి మనస్సునకు తోఁపింపచేసిన భవిష్యత్కార్యనిర్వాహణములయందు మఱియు గొప్పవాఁడయ్యెను.

జయసింగుయొక్క రాజనీతియును ఉపాయములును.

బీజపూరీయులు, మహారాష్ట్ర ప్రముఖవైరులు, షయిస్తఖాను జస్వంతసింగు మొదలైనవారు విఫలమనోరథులైన శివాజీవిషయములో, నతని నడంచుటకుజయసింగు అల్పహృదయంబుతో కార్యమునునిర్వహింపలేదు. దక్కనుమేటిమహాప్రతాపంబులకు స్మశానవాటిక. తనకు పూర్వ మవమానంబు నొందిన వారిచరిత్రలాయనకుఁ దెలియును. ఉపాయంబులకు శివాజీ పెట్టినపేరై ప్రసిద్ధినొందియుండెను. అతనిమావళీలు మొగలులతో ఖడ్గంబులదూసి యుద్ధికిమించియుండిరి. అటుపైన గొప్పమొగలు సైన్యము దక్కనుకు వచ్చుటవలన బీజపూరు గోలకొండలు భయపడి, శివాజీతో నెయ్యంబుఁజేసికొని యుత్తరము నుండివచ్చు దండయాత్రికునితో యుద్ధంబునకు సమకట్టు భయంబొకటి కలదు. కావున జయసింగు కేవలము మహారాష్ట్రులమీఁదనే దృష్టి నిగిడింపఁజాలడు. బీజపూరునుగూడ నొకకంటఁ గనిపెట్టవలసి యుండెను. అతని యెదుట నున్నసమస్య సులభసాధ్యమైనదికాదు. ఆయన, చక్రవర్తికి 'అహోరాత్రంబులొక్క నిమిషంబైన, నేను నియోగింపఁబడిన కార్యమునుండి విశ్రాంతిలేకుండ పనిచేయుచున్నాను' అని వ్రాసియున్నాడు. ఆయనవ్రాసిన లేఖలనుండి, య

తఁడు శత్రువులతో వ్యవహరించునపుడు హిందూనీతిశాస్త్రంబులయందు చెప్పఁబడిన యుపాయముల నన్నిటి నెట్లు ఉపయోగించెనో, తెలియవచ్చుచున్నది. మఱియు నతఁడెంత జాగరూకుఁడై బహువిధోపాయచతురుండై, దూరదృష్టి గలవాఁడై, తన సేనలను, శత్రువునకు మనోవిహ్వలతఁ గలుగుటకును, ఆయువు పట్టునందు బలమునంతను గుమిచేసికొట్టుటకు, నెట్లు వినియోగించెనో కూడఁ దెలియవచ్చుచున్నది.

జయసింగుయొక్క యుపాయములను కొంచెముగ విచారించి కథానూత్రంబు ననుగమింతుముగాక. జయసింగు వివేకంబుతో బీజపూరు మహారాష్ట్ర శత్రువులిద్దఱి మధ్యను తనస్థానంబుఁ గైకొనెను. ఈ మధ్యనున్నయెడల, బీజపూరును నయమునను భయమునను శివాజీని చేరకుండ నడ్డపెట్టవచ్చునని, యతఁడు తెలిసికొనెను. తులుకొంకనులోనికి దిగి దాని నెల్ల వశముచేసికొనుమని చక్రవర్తి యతనిని బలవంత పెట్టినను, దాని నతఁడంగీకరింపక తనపద్ధతియే సరియైనదని ఔరంగజేబును కూడను ఒప్పించెను. మహారాష్ట్రరాజ్యంబుయొక్క హృదయం బనఁజను పురందరలోహగడసింహగడదుర్గంబులపై దృఢంబగు నాఘాతంబులిచ్చిన, దూరంబుననున్న యంగములెల్ల వానంతటవియే నిర్జీవమై నేలం గూలునని యతఁడెఱుంగును.

ఇఁకస్థానమట్లు అనుకూలముగ నాక్రమించుకొనుటయేగాక, యతఁడు చేసిన మిత్రభేదంబులుకూడ తెలిసికొనఁదగినవి. బీజపూరు సుల్తానుకు, మొగలులకు సహాయముచేసినయెడల కలుగబోవులాభమును, వ్యతిరేకించిన యెడల కలుగబోవునష్టమును గూర్చి చెప్పి యతనియాశాభయములపై నతఁడుపనిచేసెను. ఇంతేగాక ఇద్దరు యూరోపియనులను పశ్చిమతీరంబునకుఁ బంపి, యచ్చటనున్న యూరోపియను వర్తకులను, తమయోడలతో శివాజీదేశముపై నాప్రక్కనుండి గంద్రగోళముచేయ రాయభారముల నడపెను. ఉత్తరహిందుస్థానమునందలి కొందఱుబ్రాహ్మణులను కర్ణాటకమునకుఁ బంపి యచ్చటిజమీందారులను బీజపూరునకు బుద్ధిభ్రమించుటకుగాను, తిఱుగబాటుచేయుటకు రాయభారములతోఁ బంపెను. కాశీప్రాంతములనున్న బ్రాహ్మణులు బహుపవిత్రమై

నవారుగ నెంచఁబడుదురు గాన వా రట్టిరాయభారములకు పనికివచ్చియుండిరి. అంతేఁగాక మరికొందఱిని, శివాజీకి విరోధులునుఅతనియెడల నసూయాపరులు నైన చంద్రరావు మొదలైనవారి వంశములవారిని,తిరుగఁబాటు చేయవలసినదని వర్తమానములంపెను. అఫ్జులుఖాను కుమారుఁడగు ఫజిల్ ఖానుకు, తండ్రినిచంపిన పగనుఁ దీర్చుకొనుటకు సైన్యాధిపత్యమిచ్చెను.శివాజీ యుద్యోగస్థుల కనేకులకులంచముయొక్కయు,గొప్పయుద్యోగములయొక్కయు నాశలఁగల్పించెను. బాండారాజునొద్ద పనిలోనున్న నిద్దరు సోపావాస్తవ్యులగు రామ హనుమంతేలను వారు దేశస్థితి నెరిగి యున్నవారు గావున మార్గదర్శకులుగ నియమింపఁబడిరి.

హిందువైన శివాజీపై, హిందువైన జయసింగును ఔరంగజేబు నియమింపవలసి వచ్చెను. మహమ్మదీయ యోధులందఱును శివాజీయొక్క యుపాయముల వలనఁ జిక్కులంబడిరి. రాజపుత్రులు తొల్లింటి స్వాతంత్ర్య బుద్ధియు నభిమానమును మరచియుండిరి గాన నీకార్యమునకు వారిని నియోగించుటకు ఔరంగజేబు కొంత సాహసించెను. శివాజీ, హిందూ మతమును మరల ప్రతిష్ఠాపనఁ జేయఁదలచి, కార్యము నిర్వహించెను గాన నతఁడు జయసింగంతవానిని అభిమాన బుద్ధికి సంబోధించి నిమిషములో నతనిఁగూడ దేవకార్యమునకుఁ ద్రిప్పినయెడల నేమియగునో యను భయము ఔరంగజేబు మనంబునందు లేకపోలేదు. కావున నే యతని కుమారుఁడైన రామసింగును తన దగ్గిర జామీనుగా నుంచుకొనెను.

జయసింగు దక్కనుకుఁ బంపఁబడిన తోడనే, సుల్తాను మోఅజమును జస్వంత సింగును, రాజధానికి వచ్చుట కనుజ్ఞాతులైరి. అయినను మార్గమున జయసింగు ఔరంగబాదు యొద్ద యువరాజును దర్శనముచేసికొని, కాలయాపన లేకుండ శీఘ్రంబుగ పూనా పట్టణమునకు ప్రయాణమాయెను. ఏప్రిల్ మాసారంభమునకు పూనా చేరెను.

యుద్ధరంగము.

పడమటి కనుమలు, ఉత్తరమునుండి దక్షిణమునకు, దక్కనుకు పశ్చిమమున నొక యున్నతమైన గోడపెట్టినటుల వెలసియున్నవి. ఈ పర్వతములకు

శాఖలుగ కొన్ని నగపంక్తులు తూర్పునకు కొంతవఱకు వ్యాపించి యున్నవి. అట్టి ప్రతి రెండు పంక్తులకును మధ్య నొక పెద్ద యుపత్యక యేర్పడుచున్నది. ఈ ప్రతి యుపత్యకమును కృష్ణా గోదావరీ నదులకు కారణభూతంబులైన రమణీయంబగు వాహినుల పుట్టి నిండ్లై వెలయుచున్నవి. ఆ యుపత్యకములు క్రమక్రమముగ విశాలములై చిట్టచివరకు బీజపూరు సమదేశమందుఁ గలసి పోవుచున్నది. శివాజీ పుట్టిన స్థలంబగు శివనేరు కోటదగ్గరనుండి క్రిందికి వచ్చి మొగలుసరిహద్దు దాటినతోడనే ఇంద్రాయణీయుపాంత్రము కలదు. దానికి పడమట వైపున లోహగడ త్రికోణా దుర్గములు గలవు. ఈ రెండిటికిని మధ్య చాకును కోటకలదు. అటు తరువాత భీమోపాంతముండెను. ఇందు పూనా పట్టణము గలదు. దానికి క్రింద నొక దీర్ఘమైన నగపంక్తివెంట కార్హాఘురోపాంతము గలదు. ఇందు సమదేశంబున సోపా శాశ్వదు పట్టణములు గలవు. సింహగడ పడమటి వైపుననున్న కొండలలో నుండెను. పురందరు కోట దక్షిణపు పర్వతపంక్తిపై నుండెను. ఈ నగముల కింకను క్రింద నీరోపాంతముండెను. ఇచ్చట పడమటివైపున రాయగడ తోరణ దుర్గములుండెను. ఇట్లు పర్వతంబులచే నాలింగితంబగు దేశంబు మహారాష్ట్రజాతి కప్పటి కుయ్యోల తొట్టియై యుండెను. తూర్పున కా దేశము బహిరంగమై యుండుటవలన కొంత నీరసంబై యుండెను కాని పశ్చిమమున నరణ్య దుర్గంబులచే చొర నశక్యంబై యుండెను. పశ్చిమముననే శివాజీయొక్క పేరుఁబొందిన దుర్గములన్నియు నిర్మాణమై యుండెను. అటువైపున సామాన్యముగ ప్రతిగిరిశిఖరంబును మహారాష్ట్ర గృధ్రంబుల యొక్క నివాసంబై యుండెను.

జయసింగు, పూనాను జేరినతోడనే, ఉత్తరమునను దక్షిణమునకును సేనాభాగములనుఁ బంపి యన్నివైపులను ప్రహారముల (Out-posts) నేర్పఱచి, యటుతరువాత శాశ్వదు పట్టణమును ప్రధానస్థానముగ నేర్పఱచుకొని పురందరును ముట్టడించి, ముట్టడిని జరుపుటకు డిలిరుఖానున కొప్పగించి తాను మాత్రము సింహగడమును చుట్టుముట్టి, తన సైన్యభాగముల కొన్నిటిని రాజగడ వరకును ముందుకు నడిపించెను.

మహారాష్ట్రులును చాలవఱకు ప్రయత్నములు చేసిరి. కాని జయసింగు యొక్క యేర్పాటు లనన్యములై యుండెను. లోహగడ వశమాయెను. పురందరు ప్రక్కనుండు వజ్రగడ (రుద్రమాలు) లోఁబడెను. పురందరు కోట యెదుట డిల్లిరుఖాను కాలయమునివలె కనిపెట్టుకొనియుండెను.

పురందరుకోటను పడఁగొట్టుటకు కొన్ని గొప్పఫిరంగులు డిల్లీనుండి వచ్చుచున్నట్లు వర్తమానము వినవచ్చెను. కోటలో శివాజీయొక్క గొప్ప యుద్యోగస్థుల కుటుంబములన్నియునుండెను. అవి శత్రువులచేఁ జిక్కినయెడల మానహానియగును. ఇంతేఁగాక ఉత్తరహిందూస్థానమందు మహమ్మదీయ రాజ్యము బలవంతముగ నున్నంతకాల మెప్పుడైన నాచక్రవర్తికి, శివాజీ లోఁబడవలసిన వాఁడాయెను. శివాజీయొక్క నూతనోద్యమ మాహిందూస్థానమువఱకు నింకను వ్యాపించియుండలేదు. అచ్చటి రాజపుత్రులనుగూడ హిందూమతోద్ధారణమందు సమానకార్య నిర్వాహకులుగ నింతవఱకు చేయఁబడి యుండలేదు. నేఁడీమహాయోధునితో సఖ్యంబు చేసికొనిన నెట్లుండఁబోవునో యను జుగుప్స మనమున బాధించుచుండెను. ఎప్పుడైన లోఁబడవలసినయెడల నీజయసింగునకులోఁబడునంత కర్తవ్య మింకొకప్పుడుండబోదు. జయసింగుఁ గూడ తన నైపుణ్యంబులో జయముగొన నున్నవాడు. ఈ సంగర్భములన్నియు శివాజీ మనస్సునకు నాటె. యతనికి భవానీ దేవతకూడ నట్లే యాజ్ఞాపించినటుల స్వప్నమున కనుపడెను. ఇతని పిమ్మట మహారాష్ట్రులు నాయకుండు లేకఁ గూడ ఔరంగజేబు సైన్యమునంతను వానరయుద్ధముచే పీడించి యోడించి యుండ జయసింగు సైన్యమును, శివాజీ స్వయముగ నోడించలేకపోవుట యసంభవము. కావున పై కారణములఁబట్టి, యతని మనస్సున భవానీ యాజ్ఞ తెలియవచ్చినందున, నతడు జయసింగునకు లోఁబడ నుద్యుక్తుఁడయ్యెను. కావున రాయగడ కోట యందు మంత్రులందఱితోడ నాలోచించి జయసింగునకు రాయభారము లంపసాగెను.

జయసింగు, శివాజీలోఁబడిన చాలు నని, దలంచుచుండెను. అయినను పైకిమాత్రము, శివాజీ యుద్దేశము స్థిరమగుటకు, మరింత కఠినముగ యుద్ధ ప్రయత్నములు చేయునట్లు ఆజ్ఞలచేసెను.

పురందరు కోటయొక్క రక్షణ.

ఇచ్చట పురందరు కోటయందును బాజీప్రభు అనునతడు 12000 సైన్యముతో రక్షణచేయుచుండెను. (ఈ బాజీ ప్రభుకును శివాజీ రంగనాకోటకు పాఱిపోయినపుడు మార్గమును రక్షణచేసి కీర్తి శేషుండైన బాజీప్రభునకును సంబంధములేదు.) ఈతడు 700 వీరభటులతో కోట వెడలివచ్చి మొగలుల రణఘడలను (Trenches) పాడుచేసి, డిలిరుఖాను శిబిరమునందుచొరఁబడి దాని దేవిడీవద్ద 500 మొగలులను పొడిచి చంపివేసెను. అంతట డిలిరుఖాను 'భళే! వేయిసారులు భళే! నీ పరాక్రమంబునకు మెచ్చితిని. నీప్రాణమిచ్చెదను' అని కేక యిడి ముందుకువచ్చెను. బాజీ 'నేను శివాజీ సేవకుడను. నీవాగ్దానంబులతోడను నీప్రాణదానంబులతోడను నాకేమిపని' యని ప్రత్యుత్తరమిచ్చెను. అట్లు చెప్పుచు ముందుకు నడచి యతడు డిలిరుఖానును పొడువవచ్చెను. కాని ఖానుడు వాని నొక్క వాడినారసంబునఁ గూలనేసెను. అతని భటులును ఖడ్గంబులచే నతనిఁగొట్టిరి. 300 వీరభటు లతనిప్రక్కను పడిరి. తక్కినవారు నాయకుండు లేమిచే కోటలోనికి మరలిరి.

శివాజీ లోఁబడుట.

అంతట పరాక్రమవంతుండగు పురందరు రక్షణకర్త పడినతోడనే శివాజీయొక్క లోఁబడు నుద్దేశము నిశ్చయమాయెను. శివాజీయొక్క సందేశములు జయసింగు పూర్ణముగ నింతవఱకును విశ్వసించుచుండలేదు. కాని లోఁబడు పక్షమున నతనికి క్షమాపణ ఫర్మానము నియ్యవలెనని జయసింగంతకుపూర్వమే దూరదృష్టితో నౌరంగజేబుయొద్ద నుండి దానిని తెప్పించుకొని తనయొద్ద నుంచుకొనెను. శివాజీయు నాఖరు పర్యాయము రఘునాథపంతు న్యాయశాస్త్రిని (పండిత రావు) పంపి జయసింగునకు నమ్మకము పుట్టునట్లు రాయభారము చేసెను.

పురందరు కోట యిక కొంచెములో లోఁబడు ననగ, శివాజీ జయసింగు దర్శనమునకు పోయెను. జయసింగు, కొంచె మెదురుగవచ్చి, శివాజీని

కాగలించికొని, క్షేమంబడిగి రఘునాథపంతుతోఁ జెప్పిన వాగ్దానము లన్నియు దృఢపరచి చెప్పెను. వెంటనే డిలిరుఖానునకు ముట్టడి నాపివేయవలసినదని జయసింగు కబురు పంపెను. కాని డిలిరుఖాను, తనకు తెలియకుండ నీ యేర్పాటు చేయఁబడినందుకును, పురందరు కోటను పట్టుకొను ఖ్యాతి రాకపోయెనను కోపముచేతను, కోటను పట్టుకొని గాని సంధికి సమ్మతింపనని ప్రత్యుత్తర మిచ్చెను. కాని, మఱునాడు శివాజీ డిలిరుఖానును చూడఁబోయి కోట తాళము చెవులు స్వయముగ నాతనికిచ్చివేసెను. దానికి డిలిరుఖాను సంతోషాంతరంగుఁడై శివాజీకి రెండశ్వములును, ఒక ఖడ్గమును, రత్న ఖచితమైన యొక చురకత్తియు, రెండు విలువగల వస్త్రములును బహుమతిగా నొసంగి, యతని తనతోఁగూడ జయసింగు నొద్దకు మరల తీసికొనివచ్చెను. జయసింగాతనికి గౌరవ సూచకంబగు నొక దుస్తును, ఒక గుఱ్ఱమును, ఒక ఏనుగను, తలపాగయందు ధరించుటకు జీగా యను నొక యాభరణంబును బహుమతిగా నొసంగెను.

మరునాడు (13 వ జూన్) సమాధాన ప్రకారము పురందరు కోట నుండి 7000 స్త్రీపురుష జనంబులు (అందు 4000 వీరభటులు) బయలు వెడలిపోయిరి. కోట మొగలుల వశమాయెను. ఆయుధములును, భోజనాది సామగ్రులును, ఇతర వస్తుచయమును సర్కారుకు దాఖలాయెను.

పురందరు సంధి.

శివాజీ పట్టుకొనినవిగాని, కట్టించినవి గాని 32 కోటలలో 20 కోటలు మొగలుల కియ్యఁబడెను. అందు పురందరు సింహగడలుండెను. తక్కిన 12 కోటలును, తక్కిన యతడు సంపాదించిన రాజ్యమును, చక్రవర్తికి లోబడిన యతని జాగీరుగా నుంచఁబడెను. అతని కుమారుఁడగు శంభాజీకి 5000 గుఱ్ఱపు దళమున కాధిపత్య మియ్యఁబడెను. బీజపూరు సంస్థానములో కొంత భాగమందు సుమారైదులక్షల మొత్తమునకు సరిపోయిన చౌతుసర్దేశముఖు లతనికి హక్కుగ నియ్యఁబడెను. శివాజీ, జయసింగుచే జరుపఁబడఁబోవు బీజపూరుపై

యుద్ధములో సహాయముచేయు పద్ధతిని పై షరతులు ఔరంగజేబుచే ధృవపరచఁబడెను.

శివాజీపై యుద్ధము కాగానే జయసింగు, అంతవరకు నాశలతో గడపుచు, నప్పుడు బీజపూరుపై జెండా యెత్తెను. ఈ యుద్ధమునందు, శివాజీ వాగ్దానము చేసినటులనే 2000 అశ్వసైన్యముతోడను, 8000 కాల్బలముతోడను సహాయముచేసెను.

బీజపూరుతో యుద్ధములో మోగలుల పక్షమున, శివాజీయు, నేతాజీ పాల్కారును, పటు ప్రతాపమును గనుపరచిరి. అనేక దృఢమైన దుర్గములతని మావలీలెక్కి సాధించిరి. బీజపూరు పక్షమున అబ్దుల్ కరీము, బలాలు ఖాను, కవాసుఖాను, సిద్దీ ఉజీజు (సిద్దీ జోహరు కొడుకు) వెంకాజీ రాజాయు ప్రధాననాయకులుగఁ బోరాడిరి.

శివాజీచేసిన సహాయమునకు మెచ్చి ఔరంగజేబు బహుమానములను పంపుచు దర్బారు కాహ్వానముచేసి, విశేషసన్మానములు చేసి మరల దక్కనుకు పంపెదనని యుత్తరము వ్రాసెను. శివాజీయు హిందూస్థానమందు వ్యవహారములు, మనుజులవర్తనము లెట్టులున్నవో చూచుటకు కుతూహలుఁడై, రఘునాధపంతును ముందుగా నన్నిసంగతులను పరిచయముచేసికొనుటకు పంపెను.

శివాజీ ఢిల్లీ కేగుట.

శివాజీ, తన ముఖ్యయుద్యోగస్థులందఱిని రాయగడమందు తనను గలసికొనుటకుత్తరు విచ్చెను. మోరోపంతుపింగళే, అబాజీసోనదేవు, అన్నాజీదత్తో, ఈమువ్వురకును తానులేనికాలమున నధికారము వహించుట కనుజ్ఞయిచ్చి, యెల్లరను వారియాజ్ఞకు, తనయాజ్ఞవలెనే బద్ధులుకావలయునని వ్రాచ్చెను.

శివాజీ తనపెద్దకుమారుఁడగు శంభాజీతోఁగూడ 500 కాల్బలమును, 1000 మావలీలను వెంటఁదీసికొని ఆగ్రాకు ప్రయాణమైపోయెను. జయసింగు కుమారుఁడగు రామసింగెదురుగవచ్చి యతనిఁ దోడ్కొని పో
మార్చి 1666 యెను. తరువాత చక్రవర్తి దర్శనమునకు పోగా నతఁడు 5000

అశ్వసైన్యాధిపతుల స్థలమునందుంచఁబడెను. ఆహా! తానున్న యవస్థయంతయు నతని కొక్కమారుగ విస్ఫుటమాయెను. ఉత్తరహిందూస్థానమందున్న స్థితియంతయు నతనికండ్లకు కట్టినట్లాయెను. తాను దక్కనునందు ఈశ్వర ప్రబోధితుఁడై, యనేకయిడుమలఁబడి, హిందూరాజ్యము నుద్ధారణచేయ సమకట్టి, యందు చాలవఱకుఁ బనిచేసి యిప్పుడు మరల సేవకొప్పుకొనినతోడనే మాతృదేశమూర్తియగు భవాని తననుండి తొలగి పోయినట్లు ఆతనికి తోచిన నబ్బురము లేదు. హిందూస్థానమందు రాజపుత్రయోధులు స్వతంత్రమను మాట మరచి పారతంత్ర్యమను మాయనుజిక్కి మోహోపదేశంబున నున్నట్లు గానఁబడిరి. అంతట నాచక్రవర్తి యాడంబరంబేమియు నతనికి సంతోషమును కలిగింపదాయెను. ప్రకృతిభామచే నలంకరింపఁబడి, కన్నులపండువవొనర్చు తనదేశమునందు, స్వేచ్ఛయను కమ్మతావులు నలుగడల విస్తరించుచుండ నచ్చోటువిడచి, యీవికృతసభామంటపంబను యురులఁబడినట్లుదలచి, యతఁడుమూర్ఛపోయి కొంత తడవునకులేచి, 'నాకు నిర్ణయింపఁబడిన సదనంబునకు తీసికొనిపొండు' అని కేకలుపెట్టెను. అట్లుచేయఁబడిన పిమ్మట నచ్చట రామసింగుతో 'నేను పాపాత్ముడను. రాజశ్యేనంబు గోళ్లనుఁ జిక్కుకొంటిని' అని పరిపరివిధముల వెఱ్ఱివానివలె ప్రసంగింపఁ దొడగెను. సభవారును చక్రవర్తియొక్క మహదైశ్వర్యంబు నీకొండవాడు జూడలేక మూర్ఛపోయెనని కొందఱును, ఈజిత్తులమారియొక్క యీయెత్తుయేమియో యని కొందఱును, నానావిధంబుల దలంపసాగిరి. ఈతడుపల్కినపల్కులు చక్రవర్తికినిఁ దెలియవచ్చెను. చక్రవర్తియు శివాజీ* యొక్కమారియుపాయము లెరిఁగి యుండుటచే నతనిజాగ్రత్తగఁగాచి యుండుమని కొత్వాలున కాజ్ఞయిచ్చెను.

---

* శివాజీయు రామసింగుభవనంబునం దుండెను. (ఈతనిభవన మిప్పుడు కోటకును తాజమహల్‌కును మధ్యనున్న మ్యాక్డోనల్ పార్కునందుండి యుండవచ్చును). శివాజీ, ఔరంగజేబుచక్రవర్తిని, ఆగ్రాయందు గాని డిల్లీయందు కలిసికొనలేదు. ఏలననగా, ఔరంగజేబు 15వ ఫిబ్రవరి మొదలు 9 వ అక్టోబరు వఱకు ఆ సంవత్సరమున ఆగ్రాయందుండెను. షాజహాను ఆగ్రాయందు ఖైదీగ

శివాజీ ఖైదునుండి పాఱివచ్చుట.

శివాజీ మొట్టమొదట తన మనుష్యుల నందఱిని ననేక కారణములు చెప్పి క్రమక్రమముగఁ బంపివేసెను. తరువాత తాను వ్యాధిగ్రస్తుడైనట్లు నటించెను. కొంచెము స్వస్థపడిన దని చెప్పుచు, వైద్యులకు, ఫకీరులకు, స్నేహితులకు, గొప్పయుద్యోగస్థులకు బహుమతులు పంచిపెట్టుట కాజ్ఞ యిడెను. అటుపిమ్మట యిద్దరు బ్రాహ్మణులకు గుఱ్ఱములను బహుమతి నిచ్చెదనను వంక మీద, రెండు జవనాశ్వముల నొక సంకేత స్థలంబున దాచియుంచెను. ఈయేర్పాటులైన తరువాత తన సేవకు నొకనికి తన వేషము వేసి పక్కమీద పరుండ నిచ్చి, తానును శంభాజీయును రెండు బుట్టలందు గూర్చుని, యవి బ్రాహ్మణులకుఁ బంపఁబడు మిఠాయిలని చెప్పించి పహరాలనుండి తప్పించుకొని పాఱిపోయెను. అతం డేర్పాటుచేసిన గుఱ్ఱములపై నెక్కి తండ్రికుమారు లిద్దరును ఆగ్రానుండి మధురమార్గమునపోయిరి. ఒకదక్కను హర్కారా, మొగలుల గూఢ చారుడుగా నియమింపఁబడినవాడు, వచ్చి చక్రవర్తికి తెలియచేసెను. కొత్వాలు మొట్టమొదట శివాజీ లోపలనే యున్నవాడని వాదించెను. కాని కొంతకాలమైన తరువాత మోసము తెలిసికొనఁబడెను.

శివాజీ మధురకు చేరినతోడనే గడ్డమును మీసమును తీయించి, విభూతి పూసుకొని బైరాగి వేషమును ధరించెను. తోడివారలును సుమారు నలువది మంది యట్లనే వేషములను ధరించిరి. శివాజీ కొన్ని *అష్రఫీలను చేతికఱ్ఱలో

నున్నంతకాలము మాత్రము ఔరంగజేబు డిల్లీలోనేయుండెను. పూర్వులుసంపాదించిన ధనమునంతయు నక్కడికే తెచ్చుకొనెను. కాని 22వ జనేవరిని షాజహాను చనిపోయినతోడనే ఔరంగజేబు మరల ఆగ్రాకు కుటుంబ సహితముగ వచ్చెను. అంతేకాక శివాజీ పారిపోయినపుడు మార్గమును తప్పించి మధురకు పోయెనని చరిత్రలలో వ్రాసియున్నది. ఢిల్లీనుండి మధుర మహారాష్ట్రమునకు మార్గమైయుండెను గావున నాగ్రానుండి మధురకుత్తరమునకు కొంతవరకు శివాజీ పోయియుండవచ్చును.

* అష్రఫీలు పూర్వకాలపు నవరసులు.

దొల్లచేసి యందుంచెను. కొంతసొమ్ము చెప్పులయందు కుట్టివేసెను. మరికొన్ని రత్నములు, కట్టుగుడ్డలయందును, స్నేహితుల నోళ్లయందును దాచియుంచఁబడెను. ఇట్లుతిన్నఁగ వెనుకకు మరలి మరల కాశీవైపునకు బయలుదేరిరి. త్రోవయందు అలీఖూలీయను నొకమొగలు ఫౌజ్దారుడు వీరివేషముల సమమానించి కారాగార బద్ధులను చేసెను. కాని శివాజీ యతనికి కొన్నివిలువగల రత్నములనిచ్చి తప్పించుకొనెను. కుమారుడు 8 ఏండ్ల ప్రాయమువాఁడగుటవలన తనతో సమానముగ వేగముతో సవారిచేయలేనందున అలహాబాదులో నొక బ్రాహ్మణ పండాయింటియందు జాగ్రత్తగనుంచి తాను కాశీకి బయలుదేరెను. కాశీలో ఉదయ మింకను చీకటియుండగానే శివాజీ గంగానదియొద్దకుపోయి యచ్చట నొక బ్రాహ్మణ చిన్నవాని చేతిలో కొన్ని వరహాలు పెట్టి పితృకర్మలు చేయించుమని యడిగెను. ఆ పేద బాపడును అన్ని వరహాలను జూచి దిగ్భ్రాంతినొందుచు మంత్రములు చదువ మొదలుపెట్టిన కొంతసేపటిలోనే, శివాజీ పారిపోయెననియు పట్టుకొనుటకు మొగలుభటులు వచ్చిరనియు నూరియందు కల్లోలముపుట్టెను. అంతలో శివాజీ యాబ్రాహ్మణునితో స్పష్టముగ మాట్లాడకనే వెడలిపోయెను. అటుతరువాత నతడు ఒరిస్సావైపునకు త్రోవఁబట్టెను. త్రోవలో నతని కొకగుఱ్ఱము కావలసివచ్చి తన దగ్గిర రూపాయిలు లేనందున మొహిరీలిచ్చెను. వాడును 'నీవెవరవో యింత చిన్న గుఱ్ఱమునకింత యెక్కువవెలనిచ్చినావు. నీవే శివాజీవేమో' యనెను. అంత వాతడా మొహిరీల సంచినంతను ఇచ్చి వారి నోరును కట్టి యచ్చటినుండి వెడలిపోయెను. అటనుండి జగన్నాధ యాత్ర చేసికొని గోండ్వానా మార్గమున నడవులలో ప్రయాణము చేసి హైదరాబాదువచ్చి దైవానుగ్రహమువలన స్వదేశంబు 1666 డిసెంబరు నెలలో చేరెను.

తరువాత శంభాజీ చనిపోయెనని యుత్తరమువచ్చినదని వదంతివేసి శివాజీ శ్రాద్ధకర్మలుచేసెను. అతఁడు భార్యకు కూడ నీరహస్యమును చెప్పలేదు. అచ్చట శంభాజీని కొందఱు బ్రాహ్మణులు వెంటఁబెట్టుకొని వచ్చుచుండ త్రోవలో మొగలు రక్షకభటులు కొందఱు అనుమానించిరి. అందుపై వారు అతని

తోకూడ విస్తరియందు భుజించి వారి యనుమానమునుఁ దీర్చిరి. అటుతరువాత శంభాజీకి స్త్రీవేషమువేసి వారు వెంట తీసుకొనివచ్చిరి. శంభాజీచనిపోయె నని తెలిసినపుడు ఔరంగజేబు 'ఒకముండ్లచెట్టు తక్కువయాయెను. భూమి కొంత నిష్కంటకమాయెను' అనెను. కాని యీకారణమున శివాజీ తన మెలకువను దప్పించుకొనుటకు బ్రయత్నించె నని తరువాతఁ గాని యతఁడు తెలిసికొనలేక పోయెను.

జయసింగు పరలోకగతుం డగుట.

ఈమధ్యకాలములో దక్కను వ్యవహారములు, శివాజీ కెక్కువ యనుకూలములయ్యెను. జయసింగు బీజపూరును ముట్టడివేసి యుండ నతనిసైన్యము వెనుకనుండి బీజపూరు గుఱ్ఱపుదళముచే ననేక యిబ్బందులు పెట్టఁబడెను. అతని సామగ్రిగు లడ్డము కొట్టఁబడెను. వర్షములేక నీటి యిబ్బంది యెక్కువయ్యెను. సైన్యమునందు వ్యాధులుజనించెను. వీరి కార్యనిర్వహణముయొక్క మాంద్యమునుచూచి గోలకొండ సుల్తానుకూడ బీజపూరునకు సహాయముపంపెను. జయసింగునకు చక్రవర్తి సహాయము పంపడాయెను. కావున జయసింగు ముట్టడివిడిచి ఔరంగబాదునకు పాఱిపోవలసినవాఁడాయెను. శివాజీ యిచ్చిన దుర్గములన్నిటియందును కావలి సైన్యముంచుటకు జయసింగునకు మనుష్యులుచాలకపోయిరి. కావున సింహగడ లోహగడ పురందరు లందుమాత్రము సైన్యముంచి తక్కిన కోటలయొక్క సింహద్వారములను తగులఁబెట్టి రక్షణ కట్టడములను నిర్మూలము చేయవలసినదని యాజ్ఞనిచ్చెను. అట్లు విడిచి పెట్టఁబడిన కోటలన్నియును మోరోపం తాక్రమించి బాగుచేయించెను. శివాజీ, దక్కను చేరెనని తెలిసిన తోడనే, కళ్యాణమందు చాలభాగము మహారాష్ట్రులచే నాక్రమింపఁబడెను. ఔరంగజేబు చింతాక్రాంతుడయ్యెను. రామసింగు కూడ శివాజీ కుట్రయందున్నాడనియతనిని దర్బారునకు రావద్దనెను. జయసింగును దక్కను ఉద్యోగమునుండితప్పించి, మరల సుల్తాను మోఅజమును జస్వంతసింగును అతనికి బదులుగఁ బంపెను. జయసింగు దర్బారునకుఁ బిలిపింపఁబడెను. కాని యతడు మార్గమధ్యమందే పరలోకగతుఁ డయ్యెను.

మోగలులు శివాజీతో నిష్ఠులగుట.

జస్వంతిసింగు మోఅజములు దక్కనుకు వచ్చుట శివాజీ కెంతయు ననుకూల మయ్యెను. జస్వంత సింగుతో శివాజీ ఆగ్రాయందు పరిచితుఁడ య్యెను. అంతేఁగాక, యితఁడు హిందూమతాభిమాని. ఔరంగజేబుచే
1667 ననుమానమునఁ జూడఁబడెడివాఁడు. మఱియు నితఁడు కొంచెము ధన లోభముఁ గలవాఁడు గాన లంచమునకు లోఁబడు వాఁడనికూడ ప్రతీతికలదు. సుల్తాను మోఅజము, ధైర్యము, ఔదార్యము, విశ్వాసము మొదలైన ధీరగుణ ములుగలవాఁడు. మరియు నితఁడు భోగపరాయణుండును, ధార్మికుడును, సులభముగ సంతోష పెట్టఁబడువాడును, జస్వంతుసింగు మాటప్రకారము నడచు వాఁడునై యుండెను.

శివాజీ వీరిద్దఱిని సువర్ణశృంఖలంబుల బంధించెను. కుమార సుల్తాను ద్వారా శివాజీ ఔరంగజేబుతో రాయభారములు నడిపి, ఇకనుండి యథార్థముగ చక్రవర్తి సేవకుఁడ నయ్యెదనని వాగ్దానములుచేసెను. కుమారసుల్తాను తండ్రితో నుత్తర ప్రత్యుత్తరములుజరిపి, శివాజీకి రాజాబిరుదును తెప్పించెను; శంభాజీకి మన్సబుదారీ ఖాయముచేసి అహమ్మదు నగరములోని శివాజీ వారసు హక్కులకు బదులుగా బేరారు నం దొక జాగీరాతనికిప్పించెను. శంభాజీ కొంత యశ్వసైన్యముతో సుల్తాను దగ్గిరనుండుట కౌరంగాబాదుకుఁ బంపఁబడెను. కాని యతఁడు కుఱ్ఱవాఁడైనందున మరల నింటికి పంపివేయఁబడెను. కార్తోజీగుజారు, ప్రతాపరావు అను బిరుదుతో గుఱ్ఱముదళమునకు సర్ణోబతు * (సర్వసైన్యాధిపతి) చేయఁబడి సుల్తాను సముఖమున నుంచఁబడెను. పూనా సోపాచాకణ ప్రాంతములు (జిల్లాలు) శివాజీకి తిరిగి యియ్యఁబడెను. సింహగడ పురందరు తప్ప తక్కిన కోటలన్నియు తిరిగి యియ్యఁబడెను.

---

* ఔరంగజేబు, శివాజీ పాఱిపోయెనని తెలియుటతోడనే, నేతాజీ పల్కారును పట్టుకొనుమని జయసింగున కుత్తరవుచేసెను. నేతాజీ యక్రమముగ పట్టుకొనఁబడి ఢిల్లీకి పంపబడెను. అచ్చటతఁడు మహమ్మదీయులలో బలవంతముగ కలుపుకొనబడెను. మహమ్మదు కూలీనను బిరుదుతో నొక జాగీరియ్యఁబడెను. తరువాత అతఁడు శివాజీదగ్గరకు వచ్చెను.

బీజపూరు గోలకొండ సుల్తానులు శివాజీతో సంధియగుట.

ఇది యంతయు చేయుటచే, మరల శివాజీని తనచేతిలో పడవేసికొనుట
ఔరంగజేబు చేసియుండవచ్చును, గాని సుల్తాను మోఅజము మాత్ర మీ ఆలో
1668 చనయందు లేదు. ఔరంగజేబునకును బీజపూరుసుల్తానగు ఏదులశాహి
కిని, ఈసంవత్సర మధ్యమున సంధి కుదిరెను. 1,80,000 వరహాలును
షోలపూరు కోటయు నిచ్చునట్లు బీజపూరు ఒప్పుకొనెను. బీజపూరు సుల్తాను,
శివాజీకి, చౌతు సర్దేశముఖీకి బదులుగా, ప్రతిసంవత్సరమును 3 లక్షలరూపాయి
లిచ్చుటకు, ప్రధానమంత్రియగు అబ్దులు మహమ్మదుద్వారా సంధిచేసికొనెను,
కాని యీసంగతిమాత్రము మహమ్మదీయుల గౌరవముకొఱకు రహస్యముగ
నుంచఁబడుటకు ఆయనకోరెను. ఇదేవిధముగ కుతుబ్శాహియు నైదు లక్షలు
ప్రతిసంవత్సరమిచ్చుటకు సంధిచేసికొనెను.

శివాజీచరిత్రలో నీరెండువత్సరములు మిగుల విశ్రాంతికాలమైయుండె
ను. బీజపూరునకును మొగలులకును సంధి కలిగెను. శివాజీకూడ నిద్దఱితోడను
1668-1669 సఖ్యపడెను. ఈ కాలమును, శివాజీ తన రాజ్యములో ననేక
స్థిరమైన యేర్పాటులను చేసికొనుటయందు వినియోగించెను.

ఔరంగజేబు శివాజీపై మరల విరోధము వహించుట.

సుల్తాను మోఅజముకును శివాజీకిని బాగుగ సంధికలసెను. ఔరంగజేబు
తాను తండ్రికి చేసినటులనే తనకుమారుడుకూడ తనపై నేమైన యాలోచనలఁ
1670 జేయుచున్నాడేమోయని భయపడఁజొచ్చెను. కావున, వెంటనే
శివాజీని ప్రతాపరావు గుజారును పట్టుకొన వలసినదని, తీక్ష్ణమైన
యాజ్ఞ చక్రవర్తిపంపెను. ఆ యాజ్ఞ రాకపూర్వమే మోఅజము ప్రతాపరావుకు
జాగ్రత్తపడఁ దెలియచేసెను. ఈక్రొత్త విరోధమువలన మరల శాంతములో
పడిపోవుచున్న శివాజీ పరాక్రమము పురికొల్పఁబడెను. శివాజీ మఱల యెప్పటి
వాఁడాయెను.